అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 14-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 22 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు వెల : 6.50



కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణను బీఆర్ఎస్ తుప్పు పట్టించింది

దాన్ని వదిలిస్తున్నాం

గవర్నర్ ప్రసంగానికి కాదు...సభలో చర్చకు రావాలని కేసీఆర్‌కు పిలుపు

ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతిపక్షాల ట్రాప్‌లో పడను

మెట్రో, మూసీ, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్‌లకు అనుమతి మాత్రమే కోరుతున్నాం

వీటికి రుణాలిచ్చేందుకు బ్యాంకులు సిద్ధం


ఈ విషయమై ఎప్పుడైనా మంత్రి కిషన్‌రెడ్డి ప్రధానిని కోరారా..?

దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ కుట్రను తిప్పికొడతాం

ఈ అంశంపై చర్చకు రావాలని ముఖ్యమంత్రికి తమిళనాడు సీఎం ఆహ్వానం : ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 10లో

బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్





బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు...

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల ఫలితం

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ సభ్యులు, మంత్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదనను శాసనసభావ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభలో ప్రతిపాదించగా స్పీకర్ ఆమోదించారు. సస్పెన్షన్ ప్రకటన చేయగానే సభలోనే ఉన్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని బయటకు వెళ్లిపోవాలని ఆదేశించారు. దీంతో ఆయన సభ నుంచి వెళ్లిపోయారు. అంతకుముందు ఉదయం శాసనసభ ప్రారంభం కాగానే గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. ప్రారంభంలోనే ఆయన దూకుడుగా ప్రభుత్వాన్ని ధాటిగా, వ్యంగ్యంగా విమర్శిస్తూ మాట్లాడారు. ఆ సమయంలో కాంగ్రెస్ సభ్యులు ఆయన ప్రసంగానికి అడ్డుతగిలారు. 'సభను ఆర్డర్‌లో పెడితేనే మాట్లాడతా'...అంటూ జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి అన్నారు. స్పీకర్‌ను ఏకవచనంతో సంభోదిస్తూ మాట్లాడుతున్నారని కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీనికి ప్రతిగా జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ "ఈ సభ నీ సొంతం కాదు. మా అందరి తరపున కూర్చున్న పెద్దమనిషివి మాత్రమే" అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా తప్పుపడుతూ దళితుడు స్పీకర్ స్థానంలో కూర్చుంటే ఓర్వలేకే జగదీశ్‌రెడ్డి ఇలాంటి ఏకవచన సంభోదంతో జుగుప్సాకర వ్యాఖ్యలు చేస్తున్నారనీ, ఆయన్ని సభ నుంచి సస్పెండ్ చేయాలని కేకలు వేశారు. దీనితో బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఉదయం 11.35 నిముషాలకు సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభ తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైంది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభలోకి రాగానే కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. సభాధ్యక్ష స్థానాన్ని ఏకవాక్యంతో సంభోదిస్తూ, స్పీకర్ స్థానాన్ని అగౌరవపరిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు. దళితుడైన స్పీకర్‌కు జరిగిన అవమానంగా దాన్ని పరిగణిస్తున్నామని చెప్పారు. అనంతరం మరో కాంగ్రెస్ సభ్యులు రామచంద్రనాయక్ మాట్లాడుతూ దళిత స్పీకర్‌ను జగదీశ్‌రెడ్డి అహంకారపూరిత భాషతో, అభ్యంతరకర బాడీలాంగ్వేజ్‌తో దూషించడం సరికాదన్నారు. గతంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్నారనీ, డిప్యూటీ సీఎంగా ఉన్న దళిత రాజయ్యను అవమానిస్తూ ఆ పదవి నుంచి బర్తరఫ్ చేశారని గుర్తుచేశారు. సభలో ...3లో

ఈ సభ నీ సొంతం కాదు

మా అందరి తరపున కూర్చున్న పెద్దమనిషివి మాత్రమే

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు

క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ సభ్యుల నిరసన

సభ నుంచి సస్పెండ్ చేయాలని పలువురి పట్టు

కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల వాగ్వివాదాలతో అట్టుడికిన శాసనసభ

2లో..

గొంతునొక్కే యత్నం

అబద్ధాల ఆధారంగా జగదీశ్‌రెడ్డిపై చర్య

తప్పేంటో చెప్పకుండా వేటేశారు

అధికారపక్షానికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదు

నేడు అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం

కమీషన్లు, ఢిల్లీ మూటల విషయాలు చర్చకొస్తాయనే : అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసనలో కేటీఆర్

11లో..

విరామ వ్యూహం

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై కాంగ్రెస్ తర్జనభర్జన

సీఎంతో సంప్రదింపులు జరిపిన మంత్రి శ్రీధర్‌బాబు

కేసీఆర్‌కు ఫోన్ చేసిన గులాబీ నేతలు

జగదీశ్‌రెడ్డి ఒక మెట్టు దిగాలన్న కేసీఆర్

క్షమాపణ చెబుతామంటూ స్పీకర్‌కు రాయబారం

అయినా తప్పని వేటు.. డిఫెన్స్‌లో బీఆర్ఎస్ఎల్పీ

10లో..

విద్యా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలి



బడులున్న చోట విద్యార్థుల్లేరు.. విద్యార్థులున్న చోట బడుల్లేవు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

2లో..

స్టార్‌లింక్ ఒప్పందాన్ని ఆపండి

టెలికం సర్వీసులు దేశ రక్షణకు చాలా కీలకం

చట్టాలను ఉల్లంఘించి ప్రయివేటు సంస్థలకు ఎలా ఇస్తారు ? : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : బహిరంగ, పారదర్శక వేలం ద్వారా కాకుండా ఒక విదేశీ సంస్థకు, దానితో జత కట్టిన ఇతర ప్రయివేటు సంస్థలకు స్పెక్ట్రమ్‌ను ఏకపక్షంగా కట్టబెట్టడం మన దేశ చట్టాలకు తీవ్ర విరుద్ధమని సీపీఐ(ఎం) పేర్కొంది. తక్షణమే స్టార్ లింక్ ఒప్పందాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన జారీ చేసింది. దేశంలో అధిక వేగంతో ఉపగ్రహ ఆధారిత ఇంటర్‌నెట్ సేవలు ఇచ్చేందుకు జియో, ఎయిర్‌టెల్‌లు ఎలన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో పొత్తు కుదుర్చుకున్నట్టు ఇటీవల వచ్చిన వార్తలతో స్పెక్ట్రమ్ కేటాయింపులు, జాతీయ భద్రతా ఆందోళనలకు సంబంధించి తీవ్ర ప్రశ్నలు తలెత్తాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. స్పెక్ట్రమ్ అనేది అత్యంత కొరతగా వున్న వనరు అయినందున పారదర్శక, బహిరంగ వేలం ద్వారా మాత్రమే ప్రయివేటు వ్యక్తులకు కేటాయించవచ్చని 2జీ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. అలాకాకుండా స్పెక్ట్రమ్ కేటాయింపునకు జరిగిన ఏ ప్రయివేటు ఒప్పందమైనా అది దేశ ...11లో

ట్రంప్ మెహర్బానీ కోసమే..



స్టార్‌లింక్‌తో ఎయిర్‌టెల్, జియోల భాగస్వామ్యం

ఇతర ఉపగ్రహ ఆధారిత కనెక్టివిటీ ప్రొవైడర్లను అనుమతిస్తారా..?

ఒప్పందంతో జాతీయ భద్రత పరిస్థితి ఏంటీ ? : జైరాం రమేశ్

11లో..



ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవం

కాంగ్రెస్ నుంచి ముగ్గురు, బీఆర్ఎస్, సీపీఐ నుంచి ఒక్కరు

అధికారికంగా ప్రకటించిన రిటర్నింగ్ అధికారి

వివరాలు 11లో

ఎండుతున్న పంటలు

చివరి ఆయకట్టు వరకూ సాగునీరందక ఇబ్బందులు



జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న రైతులు

చెరువులు, కుంటలు ఖాళీ.. అడుగంటిన భూగర్భ జలాలు

ఎండిన పంటలకు రూ. 50 వేల నష్టపరిహారం చెల్లించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

జనగామ కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

పలు జిల్లాల్లో ఎండిన వరి పంటలను సీపీఐ(ఎం), తెలంగాణ రైతుసంఘం బృందాల పరిశీలన

నవతెలంగాణ-జనగామ/విలేకరులు

చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందక పలు జిల్లాల్లో వరి పంటలు ఎండిపోయాయి. చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడం, భూగర్భజలాలు అడుగంటడంతో పొట్టదశకు వచ్చిన వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండిన పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం పర్యటించారు. ఎండిన పంటలకు ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఎండిన వరి పనులను ప్రదర్శిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ ఆయన మాట్లాడుతూ.. సాగు నీటిపై ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్ల రాష్ట్రంలో, జిల్లాలో వరి, ఇతర పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పంటలు ఎండుతున్నా స్థానిక అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు స్పందించి రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. జిల్లాలో 40శాతం పంటలు ఎండిపోయాయని, రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి నాట్లు వేయగా పంటలు ఎండిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారని తెలిపారు. రైతులు పంటలను రక్షించుకోవడానికి ...11లో




ఎల్లోర్‌కుమ్ ఎల్లామ్

కొత్త లోగోను విడుదల చేసిన తమిళనాడు సీఎం స్టాలిన్

బడ్జెట్ లోగోను మార్చేసిన తమిళనాడు

రూపాయి గుర్తుకు బదులుగా తమిళ అక్షరాలు

చెన్నై : తమపై బలవంతంగా హిందీని రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడుతున్న తమిళనాడు ప్రభుత్వం తాజాగా బడ్జెట్ లోగోనే మార్చేసింది. ఆ లోగోలో దేవనాగరి లిపిలో ఉండే రూపాయి చిహ్నం స్థానంలో తమిళ రూపాయి అక్షరాన్ని ఉంచింది. 'ఎల్లోర్‌కుమ్ ఎల్లామ్' (అందరి కోసం అన్నీ) అని రాసి ఉన్న లోగోను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కార్యాలయం గురువారం మధ్యాహ్నం ...11లో



యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి

యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక డిమాండ్

యూనివర్సిటీ ఎదుట విద్యార్థుల ఆందోళన

భూములమ్మితే చరిత్ర కనుమరుగవుతుంది

పురాతన ఆనవాళ్లను పరిరక్షించాలి

వివరాలు 10లో

హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని నిలిపేయాలి



ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి : సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

10లో..

ఆర్ఎస్ఎస్ కోసమే జమిలీ

● హిందూత్వ సంస్థకు ఈ ఏడాదితో వందేండ్లు ● సంఘ్ సుదీర్ఘ వాంఛను నెరవేర్చేందుకు మోడీ యత్నం

కేంద్రంలోని మోడీ సర్కారు వన్ నేషన్-వన్ ఎలక్షన్(ఓఎన్ఓఈ)పై తీవ్రంగానే శ్రమిస్తోంది. దీనిని ఎలాగైనా తీసుకురావాలని ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే అటువైపుగా చర్యలు ప్రారంభించింది. ఇందుకు కావాల్సిన గ్రౌండ్‌వర్క్‌ను సిద్ధం చేసుకుంటోంది. ఇందులో భాగంగానే భారత మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ, జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లను వేసింది. ఈ కమిటీలు చర్చలూ జరిపాయి. నివేదికలనూ అందించాయి. అయితే, బీజేపీ తాపత్రయమంతా దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ కోరికను తీర్చటం కోసమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

న్యూఢిల్లీ : వన్ నేషన్-వన్ ఎలక్షన్ అనేది సదరు హిందూత్వ సంస్థ వాంఛ అనీ, దానిని ఏ విధంగానైనా నెరవేర్చాలని మోడీ భావిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం దేశంలో వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రతిపాదన, దక్షిణాది మెడపై కత్తిని పెట్టే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ, ఈ-ఓటింగ్ ప్రతిపాదన పునరుద్ధరణ, నకిలీ ఓట్ల స్కాం గురించి తీవ్ర చర్చ నడుస్తున్నది. మోడీ సర్కారు జమిలీ ఎన్నికలపై ప్రధానంగా దృష్టిని సారించింది. ఏకకాల ఎన్నికలనేది బీజేపీ మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ చిరకాల వాంఛ. దానికి అనుగుణంగానే మోడీ సర్కారు పని చేస్తున్నది. అంతేకాదు, ఈ ఏడాదిలో ఆరెస్సెస్‌కు వందేండ్లు పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో వన్ నేషన్-వన్ ఎలక్షన్‌ను తీసుకొచ్చి ఆర్ఎస్ఎస్‌కు బహుమతిగా ఇవ్వాలని మోడీ ప్రభుత్వం యోచిస్తున్నది. ధీరేంద్ర కె.ఝా కొత్త పుస్తకం " గోల్వాల్కర్ : ది మిత్ బిహైండ్ ది మ్యాన్, ది మ్యాన్ బిహైండ్ ది మెషిన్" ఇదే విషయాన్ని తెలియజేస్తున్నది. " శాసనసభ నుంచి వారి దైనందిన జీవితాల వరకు, ముస్లింల పౌర హక్కులను నిరాకరిస్తామనే గోల్వాల్కర్ వాగ్దానం నెరవేర్చే ప్రయత్నం సాగడం రాజకీయంగా, ముస్లిములను కనుమరుగు చేసేస్తున్నారు. గోల్వాల్కర్ ఆలోచనలకు, భారత్‌ను హిందూ రాష్ట్రంగా మార్చటం అనే ఆయన ఆర్ఎస్ఎస్ కోసం నిర్దేశించిన చారిత్రక విధికి అనుగుణంగా ఉండటం వల్లే ఇదంతా సంఘ్ పరివారల్‌లో విస్తృత ఆమోదం పొందింది" అని వివరించారు. జమిలీ ఎన్నికలు ఆర్ఎస్ఎస్ రెండో చీఫ్ భావనలకు దగ్గరగా ఉంటుందని పేర్కొన్నారు. ఏకీకృత ప్రభుత్వ విధానానికి ఆయన బలమైన మద్దతుదారు అని వివరించారు. జమిలీ ఎన్నికలపై 2023, సెప్టెంబర్ 2న భారత మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పడింది. గతేడాది మార్చి 14న 18 వేల పేజీలతో కూడిన తన తుది నివేదికను ప్రస్తుత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాంనాథ్ కోవింద్ సమర్పించారు. అయితే, మోడీ సర్కారు జమిలీ ఎన్నికల ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకతే వచ్చింది. కాంగ్రెస్, సీపీఐ(ఎం)తో పాటు అనేక ప్రతిపక్ష పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. ఇది భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతాన్ని ...11లో



ఉచితాలతో నిరుపయోగం



ఉద్యోగాల వల్లనే పేదరిక సమస్యకు పరిష్కారం : ఇన్ఫోసిస్ కో ఫౌండర్ నారాయణ మూర్తి

2లో..

రేపటినుంచి ఒంటిపూట బడులు



ఉత్తర్వులు విడుదల

టెన్త్ విద్యార్థులకు యథావిధిగా ప్రత్యేక తరగతులు

11లో..

మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను

ఈయూకు ట్రంప్ హెచ్చరిక



వివరాలు 11లో



విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి

- ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

నవతెలంగాణ- విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేస్తోంది. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకి వినతిపత్రం అందజేశారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించి కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ మాట్లాడుతూ.. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ప్రతి ఏడాదీ విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందన్నారు. గడిచిన పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యారంగాన్ని అభివృద్ధి పరుస్తాం, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన మాటను అమలు చేయడం లేదన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఆజాంజాహీ మిల్లు కార్మిక భవనం కూల్చివేతపై జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ



నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ నగరంలోని ఆజాంజాహీ మిల్లు కార్మిక భవనం కూల్చివేతపై గురువారం జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ తన కార్యాలయంలో పలు దళిత, ప్రజాసంఘాల, కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ గంగుల దయాకర్, జేఏసీ కన్వీనర్ కొణతం కృష్ణ, చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు పెరుమళ్ళ లక్ష్మణ్, ఆజాంజాహీ మిల్లు కార్మికులు, కన్వీనర్ ఆకేన వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

గతంలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మెన్ వడ్డేపల్లి రామచందర్ వరంగల్ నగరంలో పర్యటించినప్పుడు కార్మిక భవనం కూల్చివేతపై విచారణ జరిపించాలని తాము వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. విచారణలో భాగంగా పలువురు కార్మికులు, నాయకులు తమకు జరిగిన అన్యాయాన్ని తహసీల్దార్‌కు వివరించారు. 75 ఏండ్లుగా కార్మికుల సమావేశాలు, సభలకు వేదికైన కార్మిక భవనాన్ని తప్పుడు పత్రాలతో కబ్జా చేసి కూల్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ భవనాన్ని కబ్జా చేసిన నరేష్ రెడ్డిని, కూల్చిన ఓం నమశ్శివాయలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు సింగిరెడ్డి యశోద, హరి నారాయణ, గుత్తికొండ రవి, పల్లకొండ సుధాకర్, కొంపల్లి ప్రవీణ్, ఆరోగ్యం, సందీప్, విజయ్, బాబు, నర్సింగం, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

- నిజామాబాద్ జిల్లాలో ఘటన



నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు కర్రతో కొట్టడంతో తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని పల్లికొండ గ్రామంలో లోకాయి రిషిక్ (12) అనే బాలుడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే ఈనెల 12న స్కూలుకు వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో లోకాయ్ రిషిక్ బుక్స్ కింద పడేశాడనే కారణంతో స్కూల్ టీచర్ భూమేష్ ఇష్టం వచ్చినట్టు విద్యార్థిని కర్రతో కొట్టాడు. దాంతో గాయాలయ్యాయి. కోపోద్రిక్తులైన విద్యార్థి తండ్రి.. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులు అనురాధను కోరారు.

13 రోజులు గడుస్తున్నా.. టీవీవీపీలో 13 వేల మందికి జీతాలేవి?

- చెల్లించలేదనడం వాస్తవం కాదా? : మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మార్చి నెలలో 13 రోజులు గడిచినా తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని 13 వేల మందికి ప్రభుత్వం ఫిబ్రవరి నెల జీతాలు ఇవ్వలేదని వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. అబద్ధాలకు, అసత్యాలకు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నది సీఎం కండ్లకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఆరోగ్య శాఖలోనే కాదు, పోలీసు శాఖలోనూ ఇదే దుస్థితి ఉందని తెలిపారు. పెంచిన జీతాలు, అలవెన్సుల మాట దేవుడెరుగు. ఉన్న జీతాలు ఇప్పటికీ రాక హోం గార్డులు ఆవేదన చెందుతున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామనే అబద్ధాన్ని, అవకాశం ఉన్న చోటల్లా ప్రచారం చేసుకునే సీఎంకు వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల ఆవేదన అర్థం కావడం లేదా? దుష్ప్రచారంతోనే ఏడాదిన్నర గడిపారు. ఇంకెంత కాలం వెళ్లదీస్తారు.? అని నిలదీశారు. టీవీవీపీ డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది సహా, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, హోం గార్డులకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

ఈ సభ నీ సొంతం కాదు

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఈ సభ నీ సొంతం కాదు. మా అందరి తరపున అక్కడ కూర్చున్న పెద్దమనిషివి మాత్రమే' అంటూ బీఆర్‌ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సభను అట్టుడికించాయి. కాంగ్రెస్ సభ్యులంతా లేచి జగదీశ్‌రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ సభ్యులు కూడా లేచి అరవడంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. ఆ సమయంలోనూ 'సభను ఆర్డర్‌లో పెడితేనే నేను మాట్లాడుతా. ఆ బాధ్యత మీదే' అని జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించడం అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. 'స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధిస్తారా? వీవాంట్ సస్పెండ్..వీవాంట్ సస్పెండ్' అంటూ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ సభ్యులు తీవ్రతను పెంచారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సభ్యుల పరస్పర అరుపులతో సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ 11:35 నిమిషాలకు ప్రకటించారు. తర్వాత తిరిగి మధ్యాహ్నం మూడున్నర ప్రాంతంలో తిరిగి సభ ప్రారంభమైంది. ఆ తర్వాత జగదీశ్‌రెడ్డిని బడ్జెట్ సెషన్ వరకు సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

ఏం జరిగిందంటే..

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనపై సభలో బీఆర్‌ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డి లేస్తూనే తన మాటలతో ఎదురుదాడికి దిగారు. చార్ట్ జీపీటీ, ఏఐ టెక్నాలజీ ఆధారంగా గవర్నర్ ప్రసంగం తయారు చేసినట్టుందని దెప్పిపొడిచారు. తెలుగులో ట్రాన్స్‌లేషన్ మక్కీకి మక్కీలా ఉందనీ, కొన్ని వాక్యాలు అర్థం కాకుండా, ప్రారంభానికి, ముగింపునకు పొంతన కుదరకుండా, వాస్తవాలు లేకుండా ఉండటం ఆశ్చర్యకరంగా అనిపించిందన్నారు. గవర్నర్ ప్రసంగం మనస్సు పెట్టి కాకుండా మొక్కుబడిగా తయారు చేసినట్టు ఉందనీ, మనస్సు కవి ఆత్రేయ ఉంటే కాపీని చూసి ఆత్మహత్య చేసుకునేటోడని దెప్పిపొడిచారు. గవర్నర్‌తో 15 నెలల పాలనపై 36 నిమిషాల్లో 360 అవాస్తవాలు మాట్లాడించారని విమర్శించారు. ప్రసంగ కాపీ చూసి గవర్నర్ మనస్సు గింజుకుంటున్నట్టుందనీ, అందుకే మనస్సు పెట్టి కాకుండా మొక్కుబడిగా చదివి వెళ్లిపోయారని అన్నారు. ఊర్లల్లో తిరుగుతుంటే ఎండిపో తున్న పొలాలు కనిపిస్తున్నాయన్నారు. సభలో నీళ్ల గురించి మాట్లాడాలని రైతులు కోరుతున్నారన్నారు. అవకాశమిస్తే మాట్లాడుతానని హామీనిచ్చాననీ, గవర్నర్ ప్రసంగంపై పార్టీ తరపున మాట్లాడే అవకాశం తనకు కేసీఆర్ ఇచ్చారని చెప్పారు. ఈ సమయంలో పలువురు కాంగ్రెస్ సభ్యులు కేసీఆర్ ఎక్కడ అని అరిచారు. 'ఎక్కడో దూరంలో లేరు. మీ ముఖ్యమంత్రి కంటే దూరం లేరు. దగ్గర్లోనే ఉన్నారు. రన్నింగ్ కామెంట్ ఆపేయండి. ఎక్కువ మాట్లాడకుండా మూస్కోండి....



రైతులు, గొర్రెల కాపర్ల గురించి మాట్లాడుతుంటే ఎందుకు భయపడుతున్నారు...' అని వ్యాఖ్యానించారు. ఎన్కటికి ఓ ఊర్ల ఏతుల వెంకటయ్య ఉండేవాడనీ, తన దగ్గర బర్లు లేకపోయినా ఉన్నట్టు చెబితే.. సర్పంచి ఎక్కడివని నిలదీస్తే... "పోయిన బర్రె దొరికితే..చచ్చింది లేసొస్తే...అత్తగారు ఇస్తమన్నది ఇస్తే...నేను ఒకటి కొనుక్కుంటే నాలుగు బర్లు కావా?" అన్నడంట అని కథ వివరించారు. గవర్నర్ ప్రసంగం గట్లనే ఉందన్నారు. రైతులకు రుణమాఫీ చేశారా? రైతుబంధు ఇచ్చారా? ఈజీఎస్ కార్మికులకు రూ.12 వేలిచ్చారా? ఆటో కార్మిక సోదరులకు రూ.12 వేలు ఇచ్చారా? రూ.2500 మహాలక్ష్మి అక్కచెల్లెళ్లకు ఇచ్చారా? రైతులకు బోనస్ ఇచ్చారా? తులం బంగారం ఇచ్చారా? స్కూటీలిచ్చారా? రెండు లక్షల ఉద్యోగాలిచ్చి సందుక కింద పెట్టారా? ప్రజల కు ఏం చేశారు అధ్యక్షా" అంటూ ప్రశ్నలను సంధించారు.

రూ.21 వేల కోట్ల రుణమాఫీ కండ్లకు కనిపించడం లేదా? : విప్ ఆది శ్రీనివాస్

వెంటనే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జోక్యం చేసుకుంటూ పచ్చకామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు.. ఆ స్కూళ్లో చదువుకున్న వాళ్లందరికీ అట్లనే కనిపిస్తుందని విమర్శించారు. 'రాష్ట్రంలో బ్యాంకుల్లో రూ.2 లక్షల లోపు పంటరుణాలున్న 25 లక్షల 35 వేల మంది రైతులకు రూ.21 వేల కోట్లను మాఫీ చేసింది కండ్లకు కనిపించడం లేదా? అని నిలదీశారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు జీరో విద్యుత్ బిల్లు ఇస్తున్న విషయం కనిపించడం లేదా? మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల రుణాలిస్తున్న విషయం తప్పా? రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నది వాస్తవం కాదా?' అంటూ ప్రశ్నలతో ఎదురుదాడికి దిగారు.

10 ఏండ్లలో మీరు చేయనిది..15 నెలల్లో ఒక్కొక్కటిగా చేస్తున్నాం : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

పదేండ్ల కాలంలో ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరిస్తే..తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను 15 నెలల్లో ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామని



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బదులిచ్చారు. 'ఉద్యమ సమయంలోనూ, 2013 ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ ఇచ్చిన హామీలను కేసీఆర్ అమలు చేశారా? దళితున్ని సీఎం చేయకుంటే తల నరుక్కుంటానన్నాడు.. నరుక్కుండా? దళితులకు మూడెకరాల భూమిచ్చి బోర్లు వేయిస్తనన్నడు...అది చేసిండా? తమ పార్టీకి చెందిన దళిత నేత భట్టి విక్రమార్క సీఎల్పీ నేతగా ఉంటే..కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సంతలో కొన్నట్టు కొని ప్రతిపక్ష హోదా లేకుండా కేసీఆర్ చేసిండు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించిండా? ఎందుకు మాట్లాడుతున్నరు' అని నిలదీశారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఎంతో ఉపయోపడుతున్నదనీ, ప్రతి నెలా ఉచిత కరెంటు ద్వారా పేదలకు ఏడెనిమిది వేల రూపాయలను ఆదా చేస్తున్నామని వివరించారు. బీసీ కులగణన చేపడితే..కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎందుకు పాల్గొనలేదు? ఇప్పుడు ఈ మాటలేంది? అని ప్రశ్నించారు.

స్పీకర్ వర్సెస్ జగదీశ్ రెడ్డి

సబ్జెక్టుపై డీవీయేషన్ కాకుండా గవర్నర్ ప్రసంగంపైనే మాట్లాడాలని సభ్యులకు సూచిస్తూ జగదీశ్‌రెడ్డికి స్పీకర్ మైకు ఇచ్చారు. 'ప్రసంగంలో లేని ఒక్కటైనా మాట్లాడానా? సభలో ఉండమంటే ఉంటా..పొమ్మంటే పోతా. ఏందిది?' అని జగదీశ్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని..స్పీకర్‌ను బెదిరించడం సరిగాదనీ, జగదీశ్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. తాము మాట్లాడుతుంటే వ్యంగ్యంగా నవ్వడం జగదీశ్ రెడ్డికి తగదన్నారు. అలా వ్యంగ్యంగా నవ్వితేనే ప్రజలు అక్కడ కూర్చో బెట్టారని చురకలు అంటిం చారు. 'జగదీశ్వర్‌రెడ్డి అసహనానికి గురికాకండి..సహనంతో మాట్లాడండి. పదేండ్లు మంత్రిగా కూడా చేశారు. సభాసాంప్రదాయాలను తప్పుదోవ పట్టించడం మంచిది కాదు' అని స్పీకర్ అభ్యర్థించారు. 'అధ్యక్షా. ఏ సభా, సాంప్రదాయాలకు విరుద్ధంగా మాట్లాడానో చెప్పిన తర్వాతనే నేను మాట్లాడుతా...' అంటూ జగదీశ్‌రెడ్డి కూర్చున్నారు. మళ్లీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వగా..'సభను ఆర్డర్‌లో పెడితేనే మాట్లాడుతా..నేను ఏం విరుద్ధంగా మాట్లాడానో చెప్పిన తర్వాతనే మాట్లాడుతా' అని మొండికేశారు. 'నా విషయంలోనే. నన్ను ప్రశ్నించడమే సభా, సాంప్రదాయాలకు విరుద్ధం' అని స్పీకర్ ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. 'అస్సలే కాదు అధ్యక్షా. ఈ సభ మనందరిది. ఈ సభలో అందరికీ హక్కులున్నాయి. మా అందరి తరపున కూర్చోబెట్టిన పెద్దమనిషిగా మాత్రమే అక్కడ మీరు కూర్చున్నారు తప్ప ఈ సభ నీ సొంతం కూడా కాదు. సభలో అందరికీ సమానమైన హక్కులుంటాయి.' అంటూ స్పీకర్‌నుద్దేశించి వివాదాస్పద, ఏకవచనంతో వ్యాఖ్య లు చేశారు. దీనిపై అధికార పార్టీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్‌కు జగదీశ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. క్షమాపణలు చెప్పాల్సిన తప్పేం చేశాడంటూ బీఆర్‌ఎస్ సభ్యులు లేచి అరిచారు. అదే సమయంలో స్పీకర్ చైర్‌ను అవమానించిన జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులందరూ ముందుకెళ్లారు. హరీశ్‌రావు మాట్లాడు తూ..సభ కాంగ్రెస్ పార్టీకో..ఒక ప్రభుత్వానికో సబంధిం చింది కాదు... ప్రతిపక్ష సభ్యులకు కూడా సమాన హక్కులుంటాయని మాత్రమే జగదీశ్‌రెడ్డి అన్నారనీ, దాంట్లో తప్పేముందని వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. సభలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతుండటంతో సభను పావు గంట వాయిదా వేస్తున్నట్టు 11: 35 నిమిషాలకు స్పీకర్ ప్రకటించారు.

క్షమాపణలు చెప్పకుంటే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి : విప్ అడ్లూరి లక్ష్మణ్

స్పీకర్ చైర్‌లో ఉన్న దళితున్ని పట్టుకుని జగదీశ్‌రెడ్డి అహంకారంతో బెదిరించడం సరిగాదనీ, ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ పట్టుబట్టారు. క్షమాపణలు చెప్పకుంటే సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో స్పీకర్‌పై పేపర్ విసిరాడనే నెపంతోనే దళిత ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సభ్యత్వాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. స్పీకర్‌ను అవమానించిన, ఎదురు ప్రశ్నించిన జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని ఎందుకు రద్దు చేయకూడదు అని అడిగారు. మొదటి నుంచీ దళితుల పట్ల ఆయన చిన్నచూపుతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

సభా సాంప్రదాయాల ప్రకారం సభను నడపాలి : తలసాని

బీఆర్‌ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..సభాసాంప్రదాయాల ప్రకారం స్పీకర్ సభను నడపాలని కోరారు. అధికార పార్టీకి చెందని ఇద్దరు సభ్యులు మాట్లాడుతుంటే తామెవ్వరమూ జోక్యం చేసుకోలేదన్నారు. అధికార పక్షం నుంచి చేతులు ఎవరు లేపితే వారికి మైకు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. విరుద్ధ అంశాలుంటే నోట్ చేసుకుని తర్వాత దానిపై మాట్లాడాలని సూచించారు. మందబలం ఉందని రెండు, మూడు నిమిషాలకోసారి లేచి మైకు అడగొద్దని అధికార పార్టీ సభ్యులకు చురకలు అంటించారు. అధికార పక్షం నుంచి మాట్లాడిన ఇద్దరు సభ్యులు కూడా గవర్నర్ ప్రసంగంపైనే మాట్లాడారా? మంత్రి వెంకటరెడ్డి అలాగే మాట్లాడారా? అని ప్రశ్నించారు.

సొరంగంలో ప్రమాదకర పరిస్థితి

రెస్క్యూ టీమ్‌లతోపాటు యంత్రాలు, రోబోలతో తవ్వకాలు

మట్టిని తవ్వుతూ బయటకు పంపుతున్న రోబోలు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాద స్థలం వద్ద రోజు రోజుకూ ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతోంది. కార్మికులను గుర్తించి వెలికితీయాలన్న తపనతో రెస్క్యూటీమ్‌లు పని చేస్తున్నాయి. అయితే, పైకప్పు పడిపోయే ప్రమాదముందని అధికారులు ఆందోళన చెందు తున్నారు. అతి జాగ్రత్తగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు కదులుతున్నారు. మనుషులు, యంత్రాలు (రోబోలు) కలిసి మట్టిని తవ్వడం.. కార్మికులను గుర్తించడం, తవ్విన మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటికి పంపే పనిలో ఉన్నారు. సింగరేణి బొగ్గు గని ప్రాంతాలలో ఉపయోగించే టెక్నాలజీని వాడుతున్నారు.

రోబోలు తవ్విన మట్టికి మించి పై నుంచి మట్టి పడుతోంది. మరోవైపు ఊట నీటిని ఎప్పటికప్పుడూ బయటకు పంపుతున్నారు. కార్మికుల ఆచూకీ కోసం 24గంటలూ పని చేస్తుండగా.. అదే క్రమంలో అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. గంటకు 5 క్యూబిక్ మీటర్ల మట్టిని బయటకు పంపుతున్నప్పటికీ అంతకుమించి మట్టి వచ్చి చేరుతున్నది. అటానమస్ హైడ్రాలిక్ పవర్ రోబోలు, కేరళ నుంచి వచ్చిన కడావర్ డాగ్స్ సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. డి-1, డి-2, డీ-3 ప్రదేశాలలో తవ్వకాలకు ఉబికి వస్తున్న నీరు ఆటంకంగా మారింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండుసార్లు రోబోలను సొరంగంలోకి పంపారు. మనుషులు వెళ్లలేని ప్రదేశాల్లో రోబోలు మట్టిని తవ్వి బెల్ట్ మీదకి వేస్తుండటంతో మరో రెండ్రోజుల్లో కార్మికుల ఆచూకీ తెలిసే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.సహాయక చర్యలపై గురువారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్‌లో డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఉన్నతాధికారులతో సమీక్షించారు. సహాయక బృందాలు రెస్క్యూ ఆపరేషన్లను 24 గంటలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్టు వివరించారు. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కట్టర్స్, థర్మల్ కట్టర్స్ బృందాలు టన్నెల్ బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫామ్‌ను కత్తిరించే పనిలో నిమగ్నమై ఉన్నట్టు తెలిపారు. ప్రమాద ప్రదేశంలో తవ్వకాలు జరుగుతున్న డి-1, డి-2 ప్రాంతాల్లో సింగరేణి ర్యాట్ మైనర్స్ బృందాలు నిరంతరాయంగా పని చేస్తున్నట్టు చెప్పారు. టన్నెల్ బోరింగ్ మిషన్ భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్టు తెలిపారు. డి-1, డి-2 ప్రదేశాలకు మరోసారి కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్‌లను పంపినట్టు చెప్పారు. సహాయక చర్యల్లో ఆర్మీ, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, ర్యాట్ మైనర్స్, కడావర్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్ బృందాలు పాల్గొంటున్నాయి.



విద్యా వ్యవస్థను పునర్‌వ్యవస్థీకరించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగం ప్రమాదంలో పడింది. తెలంగాణలో 18 వేల ప్రాథమిక పాఠశాలలుండగా, 4,400 బడుల్లో 10 మందికంటే తక్కువ విద్యార్థులున్నారు. 1,800 స్కూళ్లల్లో జీరో విద్యార్థులున్నారు. శేరిలింగంపల్లి మండలంలో 1.10 లక్షలు, కుత్బుల్లాపూర్ మండలంలో 1.07 లక్షల మంది విద్యార్థులుండగా, రాష్ట్రంలోని 12 జిల్లాల్లో లక్షలోపున్నారు. బడులున్న చోట విద్యార్థుల్లేరు.. విద్యార్థులున్న చోట బడుల్లేవు. ప్రభుత్వం తక్షణం విద్యా వ్యవస్థను పునవ్యస్థీకరించాలి. పరిస్థితి ఇలాగే ఉంటే నాలుగైదేండ్లలో రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగవుతాయి" అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం శాసనమండలిలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. చొరవ తీసుకుని ఎన్‌రోల్ చేయక పోతే బడిని మూసేస్తామంటూ జీరో విద్యార్థులున్న చోట ఆయా గ్రామ పంచాయతీలకు నోటీసులివ్వాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త పేర్లతో బడులను కట్టడాన్ని ఆయన తప్పు పట్టారు. ఉన్న బడులను రక్షించేందుకు ముందు చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మన ఊరు..మన బడి పేరుతో చేపట్టిన పాఠశాలల మరమ్మతుల పథకం మధ్యలో ఆగిపోయిందని గుర్తు చేశారు. వాటిని పూర్తి చేసేందుకు రూ.800 కోట్ల వరకు ఖర్చువుతాయనీ, సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకోవాని విజ్ఞప్తి చేశారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం వల్ల విద్యారంగం పూర్తిగా ప్రయివేటీకరణకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ క్రమంలో బ్యూరోకాట్లు, ప్రజాప్రతినిధులతో పాటు ముఖ్యులందరూ ప్రభుత్వ బడుల్లో తమ పిల్లల్ని చేర్పించాలి. ప్రభుత్వాస్పత్రుల్లో తామే స్వయంగా వైద్యం చేయిం చుకోవాలి. అప్పుడే ఈ రంగాలపట్ల ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని అభి ప్రాయ పడ్డారు. కార్పొరేట్ పోటీని తట్టుకుని అవి నిలబడుతాయనీ, సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో రెండు కార్పొరేట్ విద్యా సంస్థల్లోనే లక్ష మంది విద్యార్థులు చదువుకుంటున్నారనీ, అందులో 1,000 మందికి కూడా ర్యాంకులు రావడం లేదని గుర్తు చేశారు. ఆ రెండు సంస్థల్లో వేలాది మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్న విషయాన్ని దాచి పెడుతున్నారని వివరించారు. ఈ విషయాలపై సర్కార్ సరైన ప్రచారం చేస్తే, విద్యార్థుల తల్లిదం డ్రులు సర్కార్ బడుల వైపు మళ్లుతారని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న మంత్రి పొన్నం.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను గాడీలో పెట్టేం దుకు తమ ప్రభుతం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తన నియోజ కవర్గమైన హుస్నాబాద్‌లోని నవాబ్‌పేట హైస్కూల్లో 50 మంది పిల్లలకు 10 మంది టీచర్లు న్నారని గుర్తు చేశారు. రాజకీయాలకతీతంగా ఈ అంశంపై సమగ్రంగా చర్చించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. సభాపతి స్థానంలో ఉన్న బండప్రకాష్ జోక్యం చేసుకుంటూ... ఈ అంశంపై శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బా బుతో తాను స్వయంగా చర్చించాననీ, సమయం చూసుకుని చర్చ చేపడుతామని తెలిపారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

రాష్ట్రంలో పని చేస్తున్న దాదాపు రెండు లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని నర్సిరెడ్డి కోరారు. ప్రస్తుతం చెల్లిస్తున్న జీతాలతో వారి జీవితాలు బాగుపడేలా లేవని ఆందోళన వ్యక్తం చేశారు. కేజీబీవీ తదితర ప్రభుత్వ విద్యా సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లిస్తున్న జీతాలకు, వారి వ్యయాలకు తేడా ఉందని చెప్పారు. దినదిన గండంగా బతుకుళ్లదీస్తున్న వారి ఉద్యోగ, ఆరోగ్య భద్రతకు సర్కార్ చర్యలు తీసుకోవాలని కోరారు.

హైకోర్టు జడ్జిమెంట్‌ను అమలు చేయాలి



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-ముషీరాబాద్

కనీస వేతనాల జీఓల విడుదల గురించి హైకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌ను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని పాలడుగు భాస్కర్ ఆమోదిస్తూ కర్తవ్యాన్ని ప్రవేశపెట్టి మాట్లాడారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లోని 5 రంగాలకు సంబంధించి 2021లో ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్‌ను వెంటనే గెజిట్ చేయాలని హైకోర్టు వెలువరించిన ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మిగిలిన 68 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్లలో కనీస వేతనాలను సవరించాలని కోరారు. కరువుభత్యం పాయింట్ల రేట్లు కూడా అన్‌స్కిల్డ్ వర్కర్ రూ.12/, హైలీస్కిల్‌కు రూ.26.55 ప్రతిపాదించారు. వీటిపై యాజమాన్య సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయని, గత ప్రభుత్వం కూడా యాజమాన్యాల ఒత్తిడికి లొంగి గెజిట్ చేయకుండా కార్మికులకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తూ కాలయాపన చేస్తున్నదని తెలిపారు. దీనిపై అన్ని సంఘాలూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ.. హైకోర్టులో పిల్‌నెం.14 ఆఫ్ 2023లో కేసు వేయగా.. చట్టం ప్రకారం వేతనాలు సవరించాలని 2023 అక్టోబర్‌లో తీర్పు వెలువరించిందని గుర్తు చేశారు. అలాగే, 2021లో 5 రంగాలకు ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్స్‌ను గెజిట్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయలేదని, దీనిమీద కంటెప్ట్ కేసు ఫైల్ చేశారని తెలిపారు. దాంతో 4 వారాల్లో 5 జీవోలను గెజిట్ చేయాలి.. లేదా ప్రభుత్వ ఉన్నతాధికారి పర్సనల్‌గా కోర్టుకు హాజరు కావాలని 2025 మార్చి 3న కోర్టు ఆదేశించిందని చెప్పారు. ఏప్రిల్ 11కు కేసు వాయిదా వేశారని, ఈ లోగా ప్రభుత్వం అమలు చేయాల్సి ఉందని తెలిపారు. సవరణ చేసి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాల చట్టం 1948 ప్రకారం 5 ఏండ్లకు ఒకసారి పెంచాల్సి ఉందన్నారు. కానీ 2006-12 మధ్యకాలంలో ఉమ్మడి రాష్ట్రంలో చేసిన సవరణలు తప్ప మళ్లీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీర్మానాల అమలుకు అన్ని సంఘాల తరపున మార్చి 22న చీఫ్ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇవ్వాలని, బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించాలని తీర్మానించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, ఎస్వీ రమ, జయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, కూరపాటి రమేష్, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.కె. బోస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.అనురాధ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఎం.బాబాయి, జి.తిరుపతయ్య, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచితాలతో నిరుపయోగం

ముంబయి : ఇన్ఫోసిస్ కో ఫౌండర్ ఎన్ఆర్ నారాయణమూర్తి మరోసారి నోరు పారేసుకున్నారు. వారానికి 90 గంటలు పని చేయాలని ఇటీవల వ్యాఖ్యలు చేసి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకొని అబాసు పాలైన ఆయన.. తాజాగా ఉచితాలు నిరుపయోగమని అన్నారు. ముంబయిలో జరిగిన 'టైకాన్ ముంబయి 2025'లో నారాయణ మూర్తి మాట్లాడుతూ.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సృష్టించే ఉద్యోగాలతో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. కానీ ప్రజలకు పంచే ఉచితాలతో ఉపయోగం ఉండదన్నారు. ఔత్సాహికవేత్తలు మరిన్ని వ్యాపారాల సృష్టిపై దృష్టి సారించాలన్నారు. వినూత్న కంపెనీలు ఏర్పాటు చేస్తే ఏదో ఒక రోజు పేదరికం మాయమవుతుందన్నారు. ఏ దేశమూ పేదలకు ఉచితాలు ఇవ్వడం వల్ల విజయవంతం కాలేదన్నారు. ఉద్యోగాల వల్లే పేదరిక సమస్య పరిష్కారమవుతుందన్నారు.

‘ఉపాధి’ నిధుల విడుదలలో జాప్యం

కేంద్రాన్ని తప్పుపట్టిన పార్లమెంటరీ కమిటీ | **వేతనాలు సవరించండి** | **దేశమంతటా ఒకే రేటు ఉండేలా చూడండి**

ప్రభుత్వానికి సూచన

- పని దినాలు పెంచండి
- ఆధార్ ఆధారిత చెల్లింపులను ఐచ్ఛికం చేయండి

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయడంలో జాప్యం చేస్తుండడంపై పార్లమెంటరీ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. గ్రామీణ వేతనాలపై ద్రవ్యోల్బణ వాస్తవ ప్రభావానికి అనుగుణంగా వేతన రేట్లను సవరించాలని కేంద్రానికి సూచించింది. దేశ వ్యాప్తంగా ఒకే రకమైన వేతన రేటును వర్తింపజేయాలని సిఫార్సు చేసింది. ఉపాధి హామీ పథకం కింద పని దినాలను 100 నుండి 150కి పెంచాలని, ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని ఐచ్ఛికం చేయాలని, పశ్చిమ బెంగాల్‌కు ఇవ్వాల్సిన నిధులను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని కూడా సూచించింది. కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకా నేతృత్వంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ (2024-25)పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం తన నివేదికలను లోక్‌సభకు సమర్పించింది.

వేతన రేట్లపై...

వేతన రేట్లను సవరించకపోవడంపై చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నామని కమిటీ తన నివేదికలో గుర్తు చేసింది. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలులో ఉన్న వేతన రేట్లలో వ్యత్యాసాలు ఉన్నాయని తెలిపింది. వ్యవసాయ కార్మికుల వినియోగ ధరల సూచీతో ముడిపడిన ఉపాధి పథకం వేత నాలు ద్రవ్యోల్బణ ధోరణులను ప్రతిబింబించడం లేదని చెప్పింది. ఈ సూచీ ద్రవ్యో ల్బణ వాస్తవ ప్రభావానికి అనుగుణంగా లేదని అభి ప్రాయపడింది. కాబట్టి క్షేత్ర స్థాయిలో వాస్తవ ఆర్థిక పరిస్థితులను ప్రతిబింబించే విధంగా ప్రాధాన్యతా ప్రాతిపదికన వేతన లెక్కలను సమీక్షించి తాజా పర చాలని సూచించింది. ఈ పథకానికి కేంద్రం నిధులు అందిస్తున్నం దున అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒకే విధమైన వేతన రేటు ఉండేలా గ్రామీణాభివృద్ధి శాఖ పరిశీలన జరపాలని కోరింది.

ఇతర అంశాలపై...

పథకం అమలులో అవకతవకలు జరుగుతున్నాయన్న కారణంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2021 నుండి పశ్చిమ బెంగాల్‌కు నిధుల విడుదలను నిలిపివేసింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను అందజేయాలని కేంద్రానికి కమిటీ సూచించింది. ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని తప్పనిసరి చేయవద్దని కూడా కమిటీ సిఫార్సు చేసింది. ఆధార్ వివరాలు, జాబ్‌కార్డు రికార్డుల్లో తేడాలు ఉన్నా యన్న సాకుతో కార్మికులను తొలగిస్తున్నారని తెలి పింది. దీనివల్ల అసలైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతోందని చెప్పింది. కమిటీ తన నివేదికలో పని దినాల పెంపునూ ప్రస్తావించింది.

వాటా చెల్లింపుపై...

ఉపాధి పథకానికి కేంద్రం తన వంతు వాటాను సకాలంలో చెల్లించకపోవడంపై పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది.

నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపింది. గ్రామీణాభివృద్ధి శాఖ అందించిన సమాచారం ప్రకారం ఫిబ్రవరి 15వ తేదీ నాటికి వేతనాల చెల్లింపు, సామగ్రి కొనుగోలు కింద కేంద్రం తన వంతు వాటాగా రూ.23,446.27 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఇది 27.26 శాతం. కేటాయించిన నిధుల్లో నాలుగో వంతు మొత్తాన్ని గత సంవత్సరపు బకాయిల చెల్లింపులకే ఉపయోగిస్తున్నారు. అంటే ప్రస్తుత సంవత్సరపు



వాస్తవ బడ్జెట్‌ను రూ.62,553.73 కోట్లకు కుదించారు. దీనివల్ల పథకం లక్ష్యాలు నెరవేరే పరిస్థితి లేదు. కాబట్టి కేంద్రం తన వంతు వాటా మొత్తాన్ని సకాలంలో విడుదల చేయాల్సిన అవసరం ఉంది. చెల్లింపుల్లో జాప్యం జరగకుండా రాష్ట్రాలతో సమన్వయం చేసుకోవాలి’ అని కమిటీ సూచించింది.



ఆర్‌టీఐ చట్టానికి సవరణలు ఉపసంహరించుకోండి

కేంద్రాన్ని కోరిన మాజీ ప్రభుత్వోద్యోగులు

న్యూఢిల్లీ : సమాచార హక్కు చట్టానికి ప్రతిపాదించిన సవరణలను ఉపసంహరించుకోవాలని మాజీ ప్రభుత్వోద్యోగులు, దౌత్యవేత్తలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 2023వ సంవత్సరపు డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టంలోని సెక్షన్ 44 (3) ద్వారా సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 8(1)(జే)ని సవరించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రభుత్వోద్యోగుల వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడాన్ని ఇది అనుమతించదు. దీనిపై తమ వ్యతిరేకత వ్యక్తం చేస్తూ మాజీ ప్రభుత్వోద్యోగులు, దౌత్యవేత్తలు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖలు రాశారు. ఈ సవరణ సమాచార హక్కు చట్టం చేతులు కట్టేస్తుందని వారు అందులో ఆందోళన వ్యక్తం చేశారు. అసలు ‘వ్యక్తిగత సమాచారం’ అంటే ఏమిటో అందులో నిర్వచించలేదని తెలియజేశారు.

సమాచార హక్కు చట్టం ఏ పారదర్శకత, జవాబుదారీతనం కోసం రూపొందించబడిందో వాటికి ప్రతిపాదిత మార్పులు తూట్లు పొడుస్తున్నాయని విమర్శకులు ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) ద్వారా సమాచార హక్కు చట్టం రూపుదిద్దుకున్నదని, అది భావ ప్రకటనా స్వేచ్ఛకు గ్యారంటీ ఇస్తోందని వారు తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లల్లో కుంగుబాటు

- 17.1 శాతం మందికి వయస్సుకు తగిన బరువు లేదు
- కేంద్ర ప్రభుత్వ పోషణ్ ట్రాకర్ ప్రకారం నివేదిక

న్యూఢిల్లీ : దేశంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న చిన్నారుల్లో 37.7 శాతం మంది కుంగుబాటుకు గురవుతున్నారు. 17.1 శాతం మందికి వయసుకు తగిన బరువు లేదు. కేంద్ర ప్రభుత్వ 'పోషణ్ ట్రాకర్' ప్రకారం ఫిబ్రవరి నాటికి అంగన్‌వాడీల్లో 8.8 కోట్ల మంది పిల్లలు (0-6 సంవత్సరాల మధ్య వయ స్కులు) ఉన్నారు. వీరిలో 8.5 కోట్ల మంది బరువు, ఎత్తును పరీక్షించి వారిలో ఎదుగుదల ఎలా ఉన్నదో పరిశీలిం చారు. బాలబాలికల్లో పోషకాహార లోపాన్ని ఎలా నివారి స్తారంటూ రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ లిఖిత పూర్వక సమాధానమిస్తూ ఈ సమాచారాన్ని అందించారు. దేశవ్యాప్తంగా పిల్లల్లో పోషకలోపాల సూచికలు మెరుగు పడుతు న్నాయని ఆమె తెలిపారు. 2021 నాటికి దేశంలో ఐదు సంవత్సరాల లోపు వయసున్న పిల్లలు 13.7 కోట్లు ఉన్నారని, 0-6 సంవత్సరాల గ్రూపులో 16.1 కోట్ల మంది ఉన్నారని వివరించారు.


సమస్యలు పరిష్కరించండి

శాసనమండలిలో పలువురు సభ్యుల ప్రత్యేక ప్రస్తావనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూపాలపల్లి నియోజకవర్గంలో భూగర్భ జలాలు అడుగుంటి పోతున్నాయని బీఆర్ఎస్ శాసనమండలి నేత మధుసూదనా చారి మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం శాసన మండలిలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అధికారులు ప్రత్యేకంగా పర్య వేక్షిస్తే నష్టనివారణ కొంత వరకు జరుగుతుందని సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పెరిగిన విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని గత ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని నిర్ణ యించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దానికి సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసు కెళ్లాలనీ, మెయిన్ అంగన్ వాడీ లుగా మారిన వాటిలో పని చేస్తున్న వారికి పెరిగిన జీతాలి వ్వాలని కోరారు. అదే విధంగా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజే యాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణిదేవి మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ ప్రయోజనాలపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మహమూద్ అలీ మాట్లాడుతూ మంత్రివర్గంలో ఒక ముస్లీంను తీసుకోవాలని కోరారు. రెసిడెన్షియల్ స్కూళ్ల పరిస్థితి దారుణంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఏ.వీ.ఎన్.రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక పరిస్థితి బాగా లేకపోతే ఉచితాలను నిలిపివేయాలని సలహా ఇచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ హైదరాబాద్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారసత్వ కట్టడాల వద్ద ప్రజలను ఆకర్షించే లైట్స్ అండ్ సౌండ్స్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ రావు మాట్లాడుతూ బహుళ అంతస్తుల భవనాల్లో ఉన్న లిఫ్టుల వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాద్దాలు జరగకుండా ఏదైనా చట్టం ఉంటే పటిష్టంగా అమలు చేయాలనీ, లేకపోతే కొత్త చట్టాన్ని తీసుకురావాలని సూచించారు.



సభ రికార్డులు పరిశీలించండి..

ఎమ్మెల్యే కోవా లక్ష్మి

శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఏం మాట్లాడారో కాంగ్రెస్ నాయకులు సభ రికార్డులు పరిశీలించొచ్చని ఎమ్మెల్యే కోవా లక్ష్మి తెలిపారు. సభలో కాంగ్రెస్ నాయకుల తీరు సరిగ్గా లేదన్నారు. సభ నుంచి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని అడగడం సమంజసం కాదని, జగదీశ్‌రెడ్డి వ్యక్తిగతంగా స్పీకర్‌ను ఎక్కడా దూషించలేదని, కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమై దళిత స్పీకర్‌ను అవమానపరిచారనే మాట ముందుకు వేసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వంలో పత్రిక స్వేచ్ఛ లేకుండా పోయిందని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. తమ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతల ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏ ముఖ్యమంత్రి మాట్లాడని భాష, తిట్లు ఈ ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని అన్నారు.

స్పీకర్‌ను అవమానపర్చారని నిందలు వేయడం సరికాదు

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

శాసనసభ మనందరిది.. ఈ సభలో ఉన్న సభ్యులందరికీ సమాన హక్కులు ఉండాలి.. ఇది కాంగ్రెస్ సభ కాదంటూ తమ సభ్యులు మాట్లాడారు.. అంతేకానీ స్పీకర్‌ను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ నిందలు వేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, వివేకానంద, సుధీర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. స్పీకర్ అంశంపై రాద్ధాంతం చేస్తూ.. దాదాపు నాలుగు గంటలపాటు సభ నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని సభలో తమ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ప్రస్తావించారన్నారు. దీనిపై తమ నాయకుడు కేసీఆర్‌కు వివరించగా.. తాము తప్పు మాట్లాడకున్నా స్పీకర్ హోదాకు గౌరవం ఇచ్చి.. వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేసి సభను సజావుగా నడిపేలా చూడాలని తమకు సూచన చేశారని తెలిపారు. తప్పు చేయకున్నా.. స్పీకర్‌కు క్షమాపణలు చెప్పి సభ నడిచేలా చూడాలని కేసీఆర్ తమకు చెప్పారని అన్నారు. సీఎం ఢిల్లీలో ఉన్నారు.. సభ నడిపిస్తారా లేదా అని స్పీకర్‌ను కోరామని, సభలో జరిగిన



దానిపై రికార్డులు పరిశీలించాలని, ఒకవేళ తప్పుంటే జగదీశ్‌రెడ్డి విచారం వ్యక్తం చేస్తారని చెప్పామన్నారు. తమ సభ్యులు ప్రజల పక్షాన సమస్యలపై మాట్లాడకుండా, ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా చేయడానికే ఈ విధంగా వ్యవహరిస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, విద్యార్థులు, మహిళాలు, కాంట్రాక్టర్ల సమస్యలు అనేకం ఉన్నాయని, కాంట్రాక్టర్లు బిల్లుల కోసం సెక్రటేరియట్ వద్ద ధర్నా చేసే పరిస్థితి నెలకొందన్నారు. ఇవన్నీ అడుగుతామని అసెంబ్లీలో తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నా రన్నారు. దీన్ని బీఆర్ఎస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై అఖిలపక్షాన్ని పిలిచి రికార్డులను పరిశీలించాలని కోరారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కినా, ప్రజాక్షేత్రంలో తమ గొంతు నొక్కలేరని.. ప్రజల పక్షాన వారి సమస్యలపై సర్కారును ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

దళిత సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల శామ్యూల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో దళితమంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కూడా బీఆర్ఎస్ అవమానించిందని అన్నారు. అనంతరం మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డి దురహంకారంతో జుగుప్సాకరంగా, ఏహ్యాభావంతో మాట్లాడారని అన్నారు. కొన్ని వర్గాలు, కొన్ని కుటుంబాలకే గౌరవం అంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ను అకారణంగా వారి పదవీకాలం ముగిసేవరకు శాసనసభ నుంచి సస్పెండ్ చేసిన అంశాన్ని ప్రస్తావించారు. బీఆర్ఎస్ సభ్యులకు ఆపార్టీ అధినేత కేసీఆర్ శాసనసభాపక్ష సమావేశంలో ఇవే నేర్పించారా అని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సభాపతిని ఆ హోదాలో చూడలేక,



ఇంకోరకంగా చూస్తున్నారని విమర్శించారు. కఠిన నిర్ణయం తీసుకోవాలనీ, జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యల్ని ఎథిక్స్ కమిటీ పరిశీలన చేసి ఆయన పదవీకాలం ముగిసేవరకు సభ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. అనంతరం శాసనసభావ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ శాసనసభ గౌరవాన్ని కాపాడటం సభ్యులుగా అందరి బాధ్యత అనీ, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు ముగిసేవరకు ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపాదించారు. స్పీకర్ దీన్ని ఆమోదిస్తూ జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్టు ప్రకటించారు. అనంతరం గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వరరెడ్డికి అవకాశం ఇచ్చారు. ఆ సమయంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వెళ్లిపోయారు.

అటు హాట్‌హాట్..ఇటు సీతక్క గిఫ్ట్

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు చీరలు

తన సిబ్బంది ద్వారా బీఆర్ఎస్ ఎల్పీలో అందజేసిన మంత్రి

తమకు గిఫ్టులేవంటూ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సరదా కామెంట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఓవైపు జగదీశ్‌రెడ్డి ఉదంతంతో అసెంబ్లీ అంతా హాట్‌హాట్‌గా ఉంటే...మరోవైపు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) మాత్రం బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లకు గిఫ్టులు ఇచ్చి సర్‌ప్రైజ్ చేసింది. మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకుని వారికి చీరలను పంపించింది. తన సిబ్బంది ద్వారా బీఆర్ఎస్ ఎల్పీలో ఉన్న మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అందజే యించింది. ఇదేంటి ఇప్పుడు అని ఆరా తీయగా..ఆరోజు కలవలేదు కాబట్టి మేడం ఇప్పుడు పంపారు అంటూ సీతక్క కార్యాలయ సిబ్బంది చెప్పారు. అదే సమయంలో వారికే గిఫ్టులు ఇస్తారా? మాకు ఇవ్వరా? అంటూ కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సరదాగా అనడంతో అక్కడ నవ్వులు పూశాయి.

ప్రశ్నించడమే రాజద్రోహం అనే ధోరణి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ పాలనలో ప్రశ్నించడమే రాజ ద్రోహమనే ధోరణి నడుస్తున్నదని, ప్రజలు అంతా గమనిస్తున్నారని ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. ప్రశ్నించినందుకు ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేశారని, ఇది బాధాకరమన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, మల్లారెడ్డి, కెపి.వివేకనందగౌడ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. గతంలో రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్ట్ విజయారెడ్డి, సరితపై దాడి చేశారని, రాష్ట్రంలో అసలు ఏం పాలన సాగుతుందో తెలియడం లేదని అన్నారు. రేవంత్‌రెడ్డి వద్దే హోంశాఖ ఉందని, ఆయన కనుసైగల్లో జర్నలిస్టులపై దాడి జరుగుతోందని, ముఖ్యమంత్రి ఇంకా స్పందించడం లేదని విమర్శించారు. వేదికలపై మాత్రం మహిళల గురించి గొప్పలు చెబుతున్నారని, రాష్ట్రంలో మహిళా జర్నలిస్టుల అరెస్టును కపిల్ సిబల్ ఖండించారని చెప్పారు. ఇందిరమ్మ పాలన, సోనియమ్మ దీవెన అంటూ మహిళా జర్నలిస్టుల అరెస్టు, మీడియా ప్రతినిధుల మీద జరుగుతున్న దాడులను ఖండిస్తు న్నామన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడారన్నారు. ఏదో రకంగా సభలో తమను ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని, మాట్లాడే అవకాశమూ ఇవ్వడం లేదన్నారు.

పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ఏం చేసింది?

టి.జీవన్ రెడ్డి

- 50 ఏండ్లు మీరేం చేశారో? : శేరి సుభాష్ రెడ్డి
- శాసనమండలిలో పరస్పర ఆరోపణలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనమండలిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. గురువారం శాసన మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా జరిగిన చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలో నీటి కష్టాలకు కేసీఆర్ సొంత తెలివితో వేసిన రీ డిజైన్ కారణమని ఆరోపించారు. పదేండ్లలో గోదావరి, కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకునేందుకు సరైన నిర్ణయాలు తీసుకోలేదని తెలిపారు. ప్రతిపక్షమంటే కేవలం విమర్శలు చేయడమే కాదనీ, సలహాలు, సూచనలు కూడా ఇవ్వాలని అన్నారు. బీఆర్ఎస్ సర్కారు చేసిన అప్పుకు ఏడాదికి దాదాపు రూ. లక్ష కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తున్నదని విమర్శించారు. మిషన్ భగీరథ ఏమైందంటూ ప్రశ్నించారు. పెళ్లికి కళ్యాణలక్ష్మి



ఇచ్చి పిల్లలు పుట్టాక రేషన్ కార్డులు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కొన్ని ఆస్పత్రులు ఇప్పటికీ రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రోగులకు చికిత్స అందించేందుకు నిరాకరిస్తున్నాయనీ, అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకరించాలని డిమాండ్ చేశారు. జేబీఎస్ నుంచి ఉత్తర తెలంగాణ వెళ్లే ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ, భూ బదలాయింపు కింద రక్షణ శాఖ పరిధిలోని భూములను కేటాయించి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి సహకరించాలన్నారు. పదేండ్లు హంగూ ఆర్భాటం, ప్రచారంతో బీఆర్ఎస్ సర్కారు ఒక శాంపిల్ సర్కార్‌ను నడిపిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్, చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు, పంటల మార్పిడికి ప్రోత్సాహం, 56 వేల ఉద్యోగాల కల్పన తదితర కార్యక్రమాలతో ప్రజాపాలన దిశగా అడుగులు పడ్డాయని కొనియాడారు. 56 శాతం మంది బీసీలున్నారని కులగణన చేసి అధికారికంగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రజల సొమ్ముతో సమగ్ర కుటుంబ సర్వే చేసి ఆ రిపోర్టును ఇంట్లో పెట్టుకుంటారా? అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు.

బీఆర్ఎస్ సభ్యులు శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేపథ్యాన్ని వివరించారు. 50 ఏండ్లకుపైగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన కాంగ్రెస్, తెలుగుదేశం సమైక్య పాలకులు తెలంగాణను నిర్లక్ష్యం చేశారని తెలిపారు. దీనిపై మంత్రి కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్దిష్ట కాలం, ఎవరి పాలనలో అంటూ మాట్లాడాలని సూచించారు.

వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వచ్చాక రైతుల పట్ల పాలన బాగుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.లక్ష కోట్లైతే అవినీతి కూడా రూ. లక్ష కోట్లు జరిగిందని ఎలా ఆరోపణలు చేస్తారంటూ శేరి సుభాష్ రెడ్డి ఎదురు ప్రశ్నించారు. ఉమ్మడి పాలనలో తెలంగాణపై వివక్షకు ప్రొఫెసర్ కోదండరాం సాక్ష్యమని తెలిపారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలేవి? అని ప్రశ్నించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఆ అబద్దాలనే గవర్నర్ ప్రసం గంలో ప్రస్తావించారని అభ్యంతరం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

ట్రంప్‌నకు ప్రతిఘటన!



సుంకాల పోరు మొదలైంది. అమెరికా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై బుధవారం నుంచి సుంకం పెంచారు. అంతకు ముందు సోమవారం నుంచే చైనా సుంకాలు అమల్లోకి వచ్చాయి. మహాభారతంలో అర్జునుడు రెండు చేతులతో ఒకే సామర్థ్యంతో బాణాలను సంధించిన కారణంగా సవ్యసాచి అనే పేరు వచ్చింది. అదే మాదిరి అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ మిత్రులు, శత్రువులు అని లేకుండా ఎడాపెడా సుంకాలు విధిస్తున్నాడు. దీనికి ప్రతిఘటన పెరుగుతున్నట్లు పరిణామాలు సూచిస్తున్నాయి. వెనక్కు తగ్గకపోతే బాధితురాలైన ప్రతిదేశం ఒక రోజు అటూ ఇటూగా తన అస్త్రాలను సంధించకమానదు. మొండి వైఖరిని వీడకుండా ముందుకే మునుముందుకే అంటే మాంద్యంలో మునిగేది అమెరికా అని అనేక మంది ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. రాచపీనుగ ఒంటరిగా పోదనట్లు మాంద్యం యావత్ ప్రపంచాన్ని ఏదో విధంగా ఆవరిస్తుంది. గోల్డ్‌మన్ శాచస్ 20శాతం అంటే జెపి మోర్గాన్ 40శాతం అమెరికా మాంద్య అవకాశాలు న్నాయని ప్రకటించింది.


> **ఒక వేళ వచ్చే నెల రెండవ తేదీ నుంచి మన వస్తువుల మీద కూడా ట్రంప్ వేటు పడితే ఒక ప్రధాన ఎగుమతి అయిన ఔషధ పరిశ్రమ తీవ్రంగా ప్రభావితం కావచ్చని చెబుతున్నారు. జనరిక్ మందుల ధరలు పెరిగితే కోట్లాది మంది అమెరికన్ రోగులు, గిట్టుబాటుగాక మన పరిశ్రమలు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ రంగంలోని కార్మికులు, ఉద్యోగులు, వాణిజ్యం కూడా ప్రభావితంగాక తప్పదు.**

తొలుత చైనా, కెనడా, మెక్సికోల మీద పోరు శంఖం పూరించిన ట్రంప్ తర్వాత బ్రిక్స్ దేశాలు, ఐరోపా యూనియన్, ప్రత్యేకించి మనదేశాన్ని కూడా ఆ జాబితాలో కలిపాడు. అంతటితో ఊరుకోలేదు, సుంకాలు తగ్గించేందుకు భారత్ అంగీకరించిందని బహిరంగంగా ప్రకటించాడు.మన విశ్వగురువు మౌనవ్రతం పాటిస్తూ అలాంటిదేమీ లేదని పార్లమెంటరీ కమిటీ ముందు ఒక అధికారితో చెప్పించారు. అదే సమయంలో ఎలన్‌మస్క్ స్టార్‌లింక్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు ప్రకటించాయి. ఇంతవరకు అసలు స్టార్‌లింక్‌కు మనదేశం అనుమతి ఇవ్వకుండానే ఈ ప్రకటనలు వెలువడ్డాయంటే తెరవెనుక ఏదో జరిగిందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఉనికిలో లేని కంపెనీ సేవలు అవి ఎలా అందిస్తాయి ? అమెరికా దిగుమతులపై కెనడా, ఐరోపా యూనియన్ కూడా 25శాతం వంతున ప్రతి సుంకాలు ప్రకటించాయి. మనదేశం మౌనంగా ఉంది. వాణిజ్యాలకు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలు ఉన్నాయి. వాటిని పక్కన పెట్టి పలుకుబడితో వేర్వేరుగా దేశాలు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి.వాణిజ్య పోరులో ఒక దేశం ఎక్కువా తక్కువా అన్నది పక్కన పెడితే ప్రతిదేశం నిబంధనలకు పాతరవేస్తున్నట్లే.

ప్రపంచీకరణ యుగంలో ప్రతిదేశం మరొకదాని మీద ఏదో విధంగా ఆధారపడి ఉన్నందున కర్ర ఉన్నవాడిదే గొర్రె అంటే కుదిరే రోజులు కావివి. మా వస్తువుల మీద పన్నులు వేస్తే మీ కొన్ని రాష్ట్రాలకు సరఫరా చేసే విద్యుత్ నిలిపివేత లేదా పన్నులు వేస్తామని కెనడాలో ఓంటారియో అనే ఒక రాష్ట్ర ప్రధాన మంత్రి కూడా ప్రపంచ అగ్రరాజ్య అధిపతి ట్రంప్‌ను హెచ్చరించాడంటే ఆ ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది. బలవంతుడైన సర్పము చలి చీమలచేత చచ్చినట్లుగా పరిస్థితి ఉందన్నది స్పష్టం. ఒక హానికారక వైరస్ పుట్టుక ఎక్కడైనా ఎటు గాలివీస్తే అటు విస్తరిస్తుంది, తన మన అనే విచక్షణ లేకుండా ఎవ్వరినీ వదలదు.వాణిజ్య పోరు కూడా అలాంటిదే. ఒక వేళ వచ్చే నెల రెండవ తేదీ నుంచి మన వస్తువుల మీద కూడా ట్రంప్ వేటు పడితే ఒక ప్రధాన ఎగుమతి అయిన ఔషధ పరిశ్రమ తీవ్రంగా ప్రభావితం కావచ్చని చెబుతున్నారు. జనరిక్ మందుల ధరలు పెరిగితే కోట్లాది మంది అమెరికన్ రోగులు, గిట్టుబాటుగాక మన పరిశ్రమలు ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ రంగంలోని కార్మికులు, ఉద్యోగులు, వాణిజ్యం కూడా ప్రభావితంగాక తప్పదు.మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న జనరిక్స్ విలువ ఏటా 12.7 బిలియన్ డాలర్లు కాగా దాని వలన అమెరికాకు 219 బిలియన్ డాలర్ల మేర ఆరోగ్య ఖర్చు తగ్గిందని అంచనా.

మన దేశం అమెరికా, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న 36 ప్రాణాధార ఔషధాలపై సుంకాలను పూర్తిగా ఎత్తివేసినప్పటికీ ట్రంప్ సంతృప్తి చెందినట్లు కనిపించటం లేదు. మన వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ అమెరికా వెళ్లి సంప్రదింపులు జరిపిన తర్వాతే ట్రంప్ మనమీద సుంకాల యుద్ధ ప్రకటన చేశాడు.అందరూ నష్టపోతారంటూ ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ చేసిన హెచ్చరికను వాణిజ్యపోరుకు నాందిపలికిన ట్రంప్ తలకెక్కించుకుంటాడా! తగ్గేదేలే అంటూ ముందుకు పోతాడా!! సుంకాల పోరులో అంతిమంగా పరాజితులు వినియోగ దారులే. ఏ దేశం ఎంత పన్ను పెంచితే ఆ మేరకు భారం భరించాల్సిందే. వస్తువుల కొనుగోలు తగ్గించుకుంటే అది ఒక విషవలయంలా మారుతుంది.చివరకు కష్టజీవులనే బలి తీసుకుంటుందన్నది చరిత్ర చెప్పిన సత్యం.

గుజరాత్‌లో క్షీణిస్తున్న ప్రభుత్వ విద్య



గుజరాత్ పాఠశాలలకు సంబంధించి బీజేపీ ప్రభుత్వం ఇటీవల కాలంలో స్వయంగా అసెంబ్లీలో సమర్పించిన గణాంకాలు చాలా ఆందోళనాకరంగా ఉన్నాయి. ఆ గణాంకాల ప్రకారం 1,606 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని తెలుస్తోంది. అంటే ఒకటి నుండి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు అన్ని సబ్జెక్టులను ఒక్క ఉపాధ్యాయుడే బోధిస్తున్నారు. బోధనతో పాటు, పాఠశాల నిర్వహణ బాధ్యత కూడా ఆ ఉపాధ్యాయుడే చూడాలి. అక్కడ 2022లో ఏకోపాధ్యాయ పాఠశాలలు 700. ఇవి ఏడాదిలోనే రెట్టింపు కంటే ఎక్కువయ్యాయి. గుజరాత్‌లో ప్రభుత్వ విద్య క్షీణతను అర్థం చేసుకోవడానికి ఈ గణాంకాలు చాలు.

విద్యారంగాన్ని అత్యంత వేగంగా పూర్తిగా ప్రయివేటీకరిస్తున్న రాష్ట్రం గుజరాత్. వరుస బీజేపీ ప్రభుత్వాలు గవర్నమెంట్ పాఠశాలలను నాశనం చేస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలను పణంగా పెడుతున్నాయి. లక్షలాది మంది పేదలకు నిలయమైన భారత్‌లాంటి దేశంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడలేం. మన దేశంలో పెరుగుతున్న ఆర్థిక, సామాజిక అసమానతలను తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యల్లో ఒకటి-అందరికీ అత్యంత నాణ్యత, అనువైన సౌకర్యాలు కలిగిన విద్యావకాశాలను అందించడం. కానీ పైన చెప్పుకున్న అసమానతలు అత్యంత తీవ్రంగా పెరుగుతున్న గుజరాత్‌లో పాఠశాల విద్య ప్రమాదకర స్థాయికి చేరుకుంది. గుజరాత్‌లోని పాఠశాలల్లో 19 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారిక రికార్డులు తెలియచేస్తున్నాయి. దేశంలోకెల్లా అతి తక్కువ సంఖ్యలో ఉపాధ్యాయ నియామకాలు జరుగుతున్న రాష్ట్రాల్లో గుజరాత్ ఒకటి. అందువల్ల, విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి దారుణంగా ఉంది. గుజరాత్ ప్రభుత్వం పాఠశాలల విలీనం పేరుతో 5,223 స్కూళ్లను మూసివేస్తున్నట్లు 2000 సంవత్సరంలో ప్రకటించింది. వారు దాన్ని వేగంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వవిద్య నుండి గుజరాత్ ప్రభుత్వం పూర్తిగా వైదొలుగుతున్నదని ఈ సంకేతాలన్నీ తెలియచేస్తున్నాయి.

దేశవ్యాప్తంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేసే 'అసర్ నివేదిక 2024' ప్రకారం, గ్రామీణ గుజరాత్‌లోని ప్రతి ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకదానికి నీటి కొరత ఉంది. పావువంతు బడుల్లో మరుగుదొడ్లు లేవు. సగానికి పైగా పాఠశాలలకు విద్యుత్ లేదా కంప్యూటర్ సౌకర్యాలు లేవు. చాలా స్కూళ్లు సింగిల్ రూమ్ లేదా సురక్షితం కాని భవనాల్లో నడుస్తున్నాయి. ఇక విద్య నాణ్యత విషయానికి వస్తే ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. మూడోతరగతి చదువుతున్న పిల్లల్లో డెబ్బై నాలుగు శాతం మందికి రాయడం రాదనే దిగ్భ్రాంతికరమైన గణాంకాలను కూడా ఆ నివేదిక తెలియచేస్తున్నది. ఐదవ తరగతికి చేరుకున్న విద్యార్థుల్లో 54 శాతం మంది, ఎనిమిదవ తరగతిలో 24 శాతం మంది విద్యార్థులకు రాయడం రాదు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉండటం వల్ల, గుజరాత్‌లోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు సంస్థలకు పంపవలసి వస్తోంది.గుజరాత్‌లో పదవ తరగతి కూడా పూర్తి చేయకుండానే పాఠశాలలను వదిలి వెళ్తున్న పిల్లల సంఖ్య ఆందోళనకరంగా ఉంది. 2014లో దాదాపు 17 లక్షల మంది విద్యార్థులు మొదటి తరగతిలో చేరారు. కానీ వారిలో 10 లక్షల 50 వేల మంది మాత్రమే పదవ తరగతికి చేరుకున్నారు. బీజేపీ ప్రభుత్వం గుజరాత్‌ను 6.5 లక్షలకు పైగా పిల్లలు తమ పాఠశాల విద్యను కూడా పూర్తి చేయలేని రాష్ట్రంగా మార్చింది. మొదటి తరగతిలో చేరిన ముగ్గురు పిల్లల్లో ఒకరు మాత్రమే కనీసం ప్లస్ టూ వరకు చదువుతున్నారు. గుజరాత్‌లో బడి మానేసిన పిల్లల రేటు జాతీయ సగటు కంటే చాలా ఎక్కువ.

కానీ ఈ దయనీయమైన ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం కోల్పోయి తమ పిల్లలను ప్రయివేటు విద్యా సంస్థల్లో చేర్పించేవారు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారో చూద్దాం. ఇటీవల గుజరాత్‌లోని సూరత్‌లో ప్రయివేటు విద్యాసంస్థలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థిని ఫీజు చెల్లించలేక ఆత్మహత్య చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో తమ కుమార్తెకు సగటు నాణ్యమైన విద్య కూడా లభించదని, తల్లిదండ్రులు ఆమెను ప్రయివేటు పాఠశాలలో చేర్పించాల్సి వచ్చింది. రోజువారీ కార్మికులుగా, వారు తమ కుమార్తె ఫీజును సకాలంలో చెల్లించడానికి అవసరమైన డబ్బును ఏర్పాటు చేసుకోలేకపోయారు. కొద్ది నెలల క్రితం మరో విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడనే వార్తలు కూడా వెలువడ్డాయి. భారతదేశంలో అత్యల్ప వేతనాలు ఉన్న రాష్ట్రాలలో గుజరాత్ మొదటి స్థానంలో ఉందని కూడా గుర్తుంచుకోవాలి. 2022లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, కేరళలో ఒక భవన నిర్మాణ కార్మికుడు రోజుకు రూ.837 వేతనం సంపాదిస్తాడు. అయితే గుజరాత్‌లో ఇది కేవలం రూ.296 మాత్రమే. వ్యవసాయ, వ్యవసాయేతర ఉపాధి విషయంలో కూడా ఇదే పరిస్థితి. అంత తక్కువ ఆదాయం కలిగిన తల్లిదండ్రులకు, తమ పిల్లల స్కూల్ ఫీజులు భరించలేనంత ఎక్కువగా ఉన్నాయి. గుజరాత్‌లోని కాయకష్టం చేసుకుని బతికేవారు తమ పిల్లలను ప్రాథమిక సౌకర్యాలు లేని, అక్షరాలు కూడా నేర్పించలేని పాఠశాలలకు పంపడమా లేదా ఫీజులు చెల్లించలేని కారణంగా వారి పిల్లల చదువును ముగించడమా అనే రెండింటిలో ఒకదాన్ని ఎంచుకోవలసి వస్తున్నది. గుజరాత్‌లో అమలు చేస్తున్న ఈ ప్రజా వ్యతిరేక విద్యా వ్యవస్థను జాతీయ విద్యా విధానం (ఎన్.ఇ.పి) ద్వారా దేశమంతటా వ్యాప్తి చేయడమే మోడీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

విప్లవ తాత్వికుడు, విముక్తి మార్గ దార్శనికుడు




తెలకపల్లి రవి

వర్ధంతి అంటే మరణానంతరం కూడా వర్ధిల్లే వారసత్వాన్ని సంస్మరించుకోవడం. ఆ మాట పూర్తిగా వర్తించే వ్యక్తి మార్క్స్. పందొమ్మిదో శతాబ్ది ప్రథమపాదంలో పుట్టిన ఆ మహామనీషి సిద్ధాంతాలు ఇరవయ్యవ శతాబ్దాన్ని అనన్య సామాన్యంగా మలచి, ఆ శతాబ్ది చివరలో చిందరవందరలు అధిగమించి 21వ శతాబ్దంలో పునరుజ్జీవం పొందడానికి కారణమైనాయి. అంతకుముందు నడిచింది పాలక వర్గాధిపత్య చరిత్ర. ఆయన భావ ధారతో మొదలైంది పాలకవర్గ ధిక్కార చరిత్ర. మార్క్స్ తత్వాలకూ, సూక్తులకూ పరిమితమైన తాత్వికుల స్థానాన్ని చరిత్ర నిర్మాతల సరసన చేర్చిన అఖండ మేధావి. ప్రపంచాన్ని పరిపరి విధాల నిర్వచించడం కాదు, మార్చాలంటూ విప్లవ శంఖం పూరించిన సాహస సైద్ధాంతికుడు. వాల్టేర్, రూసో, హెగెల్, లెస్సింగ్, హైనే వంటి మహా తాత్వి కులందరూ ఒక్కటిగా రూపుదాలిస్తే మార్క్స్ అవుతాడని మోజెస్ హెస్ ప్రశంస చేసేనాటికి ఆయన వయస్సు కేవలం 23. ఆయన మరణించి ఇప్పటికి 140 ఏండ్లు గడిచిపోయినా మార్క్స్‌నూ మార్క్సిజాన్ని తలుచుకోకుండా ఒక్కరోజు కూడా గడవదు. అంతెందుకు? ఇప్పుడు అమెరికాలో ట్రంప్ రెండవసారి అధికారంలోకి వచ్చి వికృత విధ్వంస విధానాలు అమలు చేస్తుంటే విశ్లేషకులు మార్క్స్ 18 బ్రూమియర్ ఆఫ్ లూయి బోనపార్టీని తలుచుకుంటున్నారు. చరిత్ర ఒకసారి విషాదాంతంగా మరోసారి పరిహాసప్రాయంగా పునరావృతమవుతుందన్న ఆయన వ్యాఖ్యలను అమెరికా అధినేతకు అన్వయిస్తున్నారు.

చరిత్ర తర్కం

దేశ దేశాల్లో ప్రాచీనకాలపు వేదాంతులు మనుషుల గురించి చాలా తత్వాలు పాడారు. మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి గాని ప్రతిచోటా సంకెళ్లతో బంధితుడై వున్నాడని ఫ్రెంచి తత్వవేత్త రూసో వాపోయాడు. ఆ మెట్ట వేదాం తాన్ని బద్దలు కొట్టడానికి ఈ తత్వవేత్త వేదన పారదోలడానికి ఏకకాలంలో మార్గదర్శనం చేశాడు మార్క్స్. ఆయన పుట్టక ముందు శ్రమదోపిడీ, విలువ, వర్గం, విముక్తి వంటి పదాలకు వున్న అర్థం వేరు. కష్టపడేవారిపై, జాలి పేదలపై సానుభూతి చాలామంది చూపించినా పరిష్కారం చేయడం అటుంచి చెప్పడం కూడా సాధ్యం కాలేదు. అనేక మంది శ్రమను అతి కొద్ది మంది చట్టరీత్యా దోచుకోవడం వల్లనే శత సహస్ర కోటీశ్వరులు కాగలుగుతున్నారనే పరమ సత్యం చాటి చెప్పి సిద్ధాంత రూపం ఇచ్చాడాయన. ఇప్పటివరకూ నడిచిన (లిఖిత) చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రేనని తేల్చిచెప్పేశాడు. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి. పోయేదేమీ లేదు సంకెళ్లు తప్ప' అని అభయమిచ్చాడు. ఈ క్రమంలోనే వలస దేశాల స్వతంత్ర కాంక్ష కూడా చూడగలిగాడు. భారత స్వాతంత్ర్య పోరాటం గురించి ఏ విదేశీ మేధావి కన్నా ముందు సమగ్రంగా చర్చించిన వ్యక్తి ఆయనే! సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవ స్థల పరిణామ క్రమాన్ని జమిలిగా చూడాలని గ్రహించాడు గనకనే తర్కాన్ని, చరిత్రనూ మేళవించగలిగాడు. అది అతితర్కం కాదు, అనునిత్యం అధ్యయనంతో ప్రతి పరిణామాన్ని పరిశీలిస్తూ పరిపూర్ణం చేసుకోవాల్సిన గతితర్కం. ఆయన చెప్పిన చరిత్రక్రమం రాజవంశాల అనుక్రమణిక కాదు, మానవాళి మజిలీలను మథనం చేసిన మహా ధ్యయనం. ప్రకృతిలో లాగే మానవ సమాజంలోనూ మార్పులొస్తాయని అందుకు శ్రమజీవులు చోదకశక్తులుగా వుం టారని చెప్పిన సారాంశం మార్క్సిజం. అయితే శ్రమదోపిడీ పాఠాలు వల్లె వేస్తేనో లేక బానిస సమాజం, భూస్వా మ్య సమాజం, పెట్టుబడిదారీ సమాజం, సోషలిజం అని ఒక పరంపరను జపిస్తేనో మార్క్సిజమై పోదు. మార్పు రానూ రాదు. ఆ మూల సూత్రాల ప్రాతిపదికన ఆయా దశల్లో శ్రమ దోపిడీ రూపాలు గాని పీడక వర్గ వ్యూహాలు గాని అర్థం చేసుకుని రాజకీయ బలంతో సంఘటిత శక్తితో ఎదిరించాలి. ఒక్కముక్కలో దీన్నే నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అధ్య యనం అన్నారు. ఆచరణలో దాన్ని ఆచరణలో పెట్టి అనుకున్న విజయాలు సాధించడం, వచ్చిన విజయాలు నిలబెట్టు కోవడం నిరంతర సంఘర్షణ.



> **సోవియట్ యూనియన్‌ను స్థాపించాక మార్క్సిజంతో లెనినిజం కూడా చేరినా పునాది మార్క్సిజమే. ఈ విప్లవానికి ముందు వందేళ్లు, తర్వాతి వందేళ్లలో ప్రపంచం ఎలా మారిందీ మారు తున్నదీ పరిశీలించకుండా మార్క్స్ సూత్రాలు బట్టీ వేస్తే ముందుకు పోగలిగింది వుండదు. మార్క్స్ చెప్పిందే అది. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయండి అని. కాలం మారింది కాబట్టి విప్లవం, కార్మికవర్గం, శ్రమదోపిడీ వంటి పదాలకు అర్థం లేదని ఎవరైనా అంటే అంతకన్నా తప్పువుండదు.'మార్క్స్ ప్రతీకారం: ప్రపంచాన్ని మలుస్తున్న వర్గపోరాటం' అని అమెరికన్ పత్రిక టైమ్ 2013లో ముఖపత్ర కథనం ఇచ్చింది. ప్రపంచ దేశాల్లో అన్నిచోట్ల కన్నా ఎక్కువగా అమెరికాలో ఆర్థిక కేంద్రీకరణ ఎలా పెరుగుతున్న తీరుపై తీవ్ర హెచ్చరికలు చేస్తూ వీటిపై మార్క్స్ చెప్పిన వర్గ పోరాటాలు ప్రజ్వరిల్లడం తథ్యమని హెచ్చరించింది.**

మన కాలపు దీపధారి

అంతులేని దారిద్రాన్ని, అష్టకష్టాలనూ భరిస్తూనే మేధావిగా రచనలు చేయడమే గాక విప్లవకారుడుగా నిరంతరం పోరాడాడు గనకే మార్క్స్ చరిత్ర గమనంలో ప్రజల పాత్రను పసిగట్టగలిగారు. ఆయన 1883లో మరణిస్తే 1917లో అంటే తను పుట్టిన వందేళ్లకు ఆ విప్లవ సిద్ధాంతం లెనిన్ జయప్రదంగా అమలు చేశాడు. వర్గాలనే కూలగొట్టే ఇంత సమూలమైన మార్పు ఇంత త్వరితంగా వచ్చిన దాఖలా చరిత్రలో మరొకటి లేదు. అది మార్క్స్ బోధనల లెనిన్ వ్యూహాల ఔన్నత్యం. సోవియట్ యూనియన్‌ను స్థాపించాక మార్క్సిజంతో లెనినిజం కూడా చేరినా పునాది మార్క్సిజమే. ఈ విప్లవానికి ముందు వందేళ్లు, తర్వాతి వందేళ్లలో ప్రపంచం ఎలా మారిందీ మారు తున్నదీ పరిశీలించకుండా మార్క్స్ సూత్రాలు బట్టీ వేస్తే ముందుకు పోగలిగింది వుండదు. మార్క్స్ చెప్పిందే అది. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయండి అని. కాలం మారింది కాబట్టి విప్లవం, కార్మికవర్గం, శ్రమదోపిడీ వంటి పదాలకు అర్థం లేదని ఎవరైనా అంటే అంతకన్నా తప్పువుండదు.'మార్క్స్ ప్రతీకారం: ప్రపంచాన్ని మలుస్తున్న వర్గపోరాటం' అని అమెరికన్ పత్రిక టైమ్ 2013లో ముఖపత్ర కథనం ఇచ్చింది. ప్రపంచ దేశాల్లో అన్నిచోట్ల కన్నా ఎక్కువగా అమెరికాలో ఆర్థిక కేంద్రీకరణ ఎలా పెరుగుతున్న తీరుపై తీవ్ర హెచ్చరికలు చేస్తూ వీటిపై మార్క్స్ చెప్పిన వర్గ పోరాటాలు ప్రజ్వరిల్లడం తథ్యమని హెచ్చరించింది. పచ్చి మితవాద భావజాల ప్రతీఘాత దాడి, జాతీయ దురభిమానం, భావ ప్రకటనా స్వేచ్ఛపై అణచివేత ఇవన్నీ మార్క్స్ బోధనలను మరింత ముందుకు తెస్తున్నాయి. దేశ దేశాల్లో కమ్యూనిస్టులు, కార్మిక నాయకులు, ప్రజాస్వామికవాదులు, మానవతా మూర్తులు పోరాడుతున్నారు. ఉద్యమాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజాస్వామిక శక్తులు వీటిపై పోరాడుతూనే ప్రభుత్వాలు నిర్వహిస్తున్నారు. సైద్ధాంతిక ఘర్షణలు సాగిస్తున్నారు. కొత్త గుణపాఠాలు నేర్చుకుంటున్నారు. ఇందులో తప్పొప్పులు వుంటాయి. చిన్న పెద్ద విజ యాలూ వుంటాయి. ఎదురు దెబ్బలుంటాయి. కాని మహత్తర త్యాగాలూ వున్నాయి. చెక్కుచెదరని నిబద్ధతలు వున్నాయి. ఈసంక్లిష్ట క్రమాన్ని అవగాహన చేసుకోకుండా శత్రుశక్తులూ మిత్రులనుకునేవాళ్లు కూడా పోరాడే శక్తులను అవహేళన చేయవచ్చు గాని వాటితోనే చరిత్ర ఆగిపోదు.

నిజానికి మార్క్సిజం సైద్ధాంతిక జైత్రయాత్ర కొనసాగుతూనే వుంది. ఈ ముప్పైల్లో పుట్టుకొచ్చిన చరిత్రాంతం, కాలానికి అంతం, దూరానికి అంతం, మహా సిద్ధాంతాల అంతం, ఆధునికత అంతం, సత్యం అంతం అంటూ అంతు పట్టని అంతం సిద్ధాంతాలే సోదిలోకి లేకుండా పోతున్నాయి. మార్క్స్ బోధనలు మార్గదర్శకంగానే వున్నాయి. సామ్రాజ్యవాద, ప్రపంచీకరణ దుష్ఫలితాలు ప్రతివారూ అనుభవిస్తున్నారు. అరగంటకో రైతు ఆత్మహత్య, నయా కంపెనీలు నరాలు తెగిపోయేలా సరికొత్త వెట్టిచాకిరి చేయించుకోవడం కనిపిస్తున్నది. ఉద్యోగాలు రాకపోగా వున్న వాటికే భద్రత లేకుండా పోతున్న తీరు మేధావులనే కలవర పెడుతున్నది. మొదట చెప్పినట్టు ట్రంప్ మలిపాలనలో దేశ దేశాలు ఈ మథనానికి గురవుతున్నాయి. ఇప్పుడు ఎలన్ మస్క్ బుల్లి కుమారుడు అమెరికా అధ్యక్షుని పక్కన కూర్చుని మీడియాకు ఫోజులిస్తున్నాడంటే విదేశాంగ మంత్రి రిబిరే, మస్క్ ట్రంప్ ముందే కీచులాడుకుంటున్నారంటే అంతకన్నా ఉదాహరణ ఏం కావాలి? వరప్రసాదంగా గోచరించిన నూతన సాంకేతిక నిపుణులు కూడా ఎ.ఐ దెబ్బకు విలవిల్లాడక తప్పడం లేదు. వీటిపై మరింత అధ్యయనం చేయడం మార్క్స్ అనుయాయుల కర్తవ్యం. ఉదాహరణకు సిపిఎం మహాసభ ముసాయిదా నయా ఫాసిజంగా పరిస్థితిని వర్ణిస్తే వెంటనే దాడి చేసిన మిత్రులూ శత్రులూ కూడా నిర్దిష్ట అధ్యయనం అనే సూత్రాన్ని విస్మరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాలంచెల్లిన మాటలే చెబుతున్నారని ఎగతాళి చేసేవారు వందేళ్ల కిందటి పదాలను భావాన్ని నేటి సందర్భానికి తగినట్టు అర్థం చేసుకోకుండా అలాగే వాడాలనడం మార్క్స్ శైలికే విరుద్ధం. ఆవిరి యంత్రం నుంచి కృత్రిమ మేధా కాలం వరకూ ఒకే మంత్రం వల్లెవేసే వారు ఈ అంశాన్ని గ్రహించలేరు.

> **మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి గాని ప్రతిచోటా సంకెళ్లతో బంధితుడై వున్నాడని ఫ్రెంచి తత్వవేత్త రూసో వాపోయాడు. ఆ మెట్ట వేదాం తాన్ని బద్దలు కొట్టడానికి ఈ తత్వవేత్త వేదన పారదోలడానికి ఏకకాలంలో మార్గదర్శనం చేశాడు మార్క్స్. ఆయన పుట్టక ముందు శ్రమదోపిడీ, విలువ, వర్గం, విముక్తి వంటి పదాలకు వున్న అర్థం వేరు. కష్టపడేవారిపై, జాలి పేదలపై సానుభూతి చాలామంది చూపించినా పరిష్కారం చేయడం అటుంచి చెప్పడం కూడా సాధ్యం కాలేదు. అనేక మంది శ్రమను అతి కొద్ది మంది చట్టరీత్యా దోచుకోవడం వల్లనే శత సహస్ర కోటీశ్వరులు కాగలుగుతున్నారనే పరమ సత్యం చాటి చెప్పి సిద్ధాంత రూపం ఇచ్చాడాయన. ఇప్పటివరకూ నడిచిన (లిఖిత) చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రేనని తేల్చిచెప్పేశాడు. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి. పోయేదేమీ లేదు సంకెళ్లు తప్ప' అని అభయమిచ్చాడు. ఈ క్రమంలోనే వలస దేశాల స్వతంత్ర కాంక్ష కూడా చూడగలిగాడు.**

అదే బాటలో...

గత ముప్పయేళ్లలో ప్రతికూల పరిణామాలు ఎవరూ కాదనరు. సోవియట్, తూర్పు యూరప్ దేశాల్లో పతనం గాని, దేశంలో బెంగాల్, త్రిపుర వంటి చోట్ల ఓటమి గాని వాస్తవాలే. ఆ ప్రభుత్వాలు వున్నప్పుడు సవాళ్లు లేవని, ఇప్పుడు సర్వం పోయిందని అనుకుంటే అవాస్తవికత అవుతుంది. మార్క్స్ జీవిత కాలంలోనే తొలి కార్మికవర్గ పాలనా వ్యవస్థగా పారిస్ కమ్యూన్ అవతరించి కూలిపోయింది. అయినా సోవియట్ విప్లవం ఆగలేదు. ఇప్పుడు సోవి యట్ లేకున్నా జరిగే పరిణామాలు ఆగడం లేదు. చరిత్ర గమనశీలమైందన్నదే ఆయన ప్రధాన బోధన. వివిధ రూపాల్లో పెట్టుబడిదారీ సంక్షోభాలు, కల్లోలాలూ విరుచుకు పడుతూనే వుంటాయని మార్క్స్ ఎప్పుడో చెప్పింది అడు గడుగునా చూస్తున్నాం. ఇప్పుడు కంపు ట్రంపు దుందుడుకు వ్యూహాలను టారిఫ్ యుద్ధాలనూ మతతత్వ మోడీల కార్పొరేట్ లొంగుబాట్లనూ అర్థం చేసుకోగలం. నయా ఫాసిస్టు తరహా శక్తులు ప్రజావ్యతిరేకులు పంజా విసురుతున్నా ప్రపంచంలో ప్రగతిస్ఫూర్తి గొడ్డుపోలేదు. మార్క్స్ అంటేనే ఒక ఆగని మార్చ్. మేము అమరులను తలుచుకోవడంతో ఆగిపోక వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవడం కోసం పోరడతామని ఆయన అస్తమించిన సమయంలో ఆప్త మిత్రుడైన ఎంగెల్సు అన్నమాట ఇప్పటికీ పరమ సత్యమై నడిపిస్తుంది. మార్క్స్ అంటేనే మార్చ్. అహరహం అధ్య యనంతో అవిశ్రాంత కార్యాచరణతో త్యాగనిరతితో ఆ మహాప్రస్థానం కొనసాగించాల్సి వుంటుంది.

(నేడు కారల్ మార్క్స్ 142వ వర్ధంతి)

గురువులకు గుదిబండగా గురుకులాలు



గుడికందుల సత్యం
9849232515

> **ఉదయం ఎనిమిది గంటలకే పాఠశాలల్లో ఉండాలని కఠిన నిబంధనలు పెడుతూ గురువులను, దాంతో పాటు విద్యార్థులను కూడా తీవ్ర ఒత్తిడిలోకి నెట్టివేస్తున్నారు. డిప్యూటీ వార్డెన్ డ్యూటీ ఉన్నప్పుడైతే వారి ఉద్యోగం కత్తి మీద సాము లాంటిదేనని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. వంటవారు సరిగా పనిచేయకున్నా, పాలు పగిలినా, గ్యాస్ సిలిండర్లు అయిపోయినా, పైపులు లీకైనా, కూరగాయలు అపరిశుభ్రంగా ఉన్నా, నిత్యావసర వస్తువులు నాణ్యత లేకున్నా, టీచర్లే బాధ్యత వహించాల్సి వస్తున్నది. ఇతరులు చేసిన తప్పిదాల మూలంగా వంటలో చిన్న పొరపాటు జరిగినా, వాటర్ కలుషితంగా వచ్చినా సంబంధం లేని బోధన సిబ్బంది పైనే వేటు వేస్తూ, సస్పెండ్ కూడా చేస్తున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు.**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక కేజీ టూ పేజీ పేరుతో గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలను విస్తృతపరిచింది.రాష్ట్రంలో మొత్తంగా వివిధ సామాజిక తరగతుల వారిగా ఏర్పాటు చేసిన గురుకులాలు అన్ని కలుపుకుని 1080 వరకు ఉంటాయి. ఇందులో సుమారు ఆరులక్షల మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.20,897 మంది గురువులు బోధన, బోధనేతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దశాబ్దకాలం తర్వాత కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో 7800 మంది నూతన టీచర్స్‌ని నియమించింది. ఇంకా 6,500 వరకు ఉద్యో గాలు ఖాళీగా ఉన్నవి. ప్రస్తుతం ఒక్కో పాఠశాలలో 550 నుండి 600 మంది విద్యార్థులున్నారు. ఇప్పటివరకు తొంభై శాతం పాఠశాలలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గురుకులాలకు సొంత భవనాల్లేక, అద్దె భవనాల్లో సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు, టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలను ఒకే సమూహంగా విశాల మైన స్థలంలో 2500 మంది విద్యార్థులు చదువుకునే వీలుగా నూతన భవనాలు నిర్మిస్తామని శంకుస్థాపనలు కూడా చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మెనూ కూడా ఒకే విధంగా అమలు చేస్తామని చెబుతున్నది. ఇది ఆచరణలో సాధ్యం అవుతుందా? వేచి చూడాల్సిందే.

ఇదంతా నాణేనికి ఒకవైపు, మరోవైపు విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు వర్ణనాతీతం. విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రీడలు, పౌష్టికాహారం అందాలంటే పాలకులకు దీర్ఘకాలిక లక్ష్యం ఉండాలి. అది లేకపోవడంతో ఆ భారమంతా కూడా గురువులు యోయాల్సి వస్తున్నది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకుని, ట్రైనింగ్ పొందిన టీచర్లతో బోధనేతర (బాధ్యతలు) డిప్యూటీ వార్డెన్, పాఠశాలల్లో ప్లంబింగ్, ఎలక్ట్రికల్, వాటర్ సప్లై, తదితర బోధనేతర పనులు అప్పగించడం, రాత్రిపూట స్టడీ అవర్స్ పేరిట తొమ్మిది గంటల వరకు, (స్టే) పేరుతో పాఠశాలల్లోని నిద్రించడం, ఆదివారం,సెలవు, పండగ రోజుల్లో కూడా వారికి అదనంగా విధులు నిర్వహించాలని చెప్పడంతో వారు తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. కుటుంబానికి సరైన సమయం కేటాయించకపోవం, వారి పిల్లలతో ఏకాంతంగా గడిపే అవకాశం కూడా లేకపోవడంతో 'ఇదేం కొలువురా బాబో' అని బాధపడుతున్నారు. ఇది ఒక్క గురువులకే కాదు, విద్యార్థులకు సైతం శిక్షగానే ఉంటోంది. విద్యార్థులకు చదువు చాలా ముఖ్యమైనదే కానీ దాంతో పాటు మానసిక వికాసం పెంపొందించే కార్యక్రమాలు లేకపోవడం వల్ల వారు కూడా భారంగా ఫీలవుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే పాఠశాలల్లో ఉండాలని కఠిన నిబంధనలు పెడుతూ గురువులను, దాంతో పాటు విద్యార్థులను కూడా తీవ్ర ఒత్తిడిలోకి నెట్టివేస్తున్నారు. డిప్యూటీ వార్డెన్ డ్యూటీ ఉన్నప్పుడైతే వారి ఉద్యోగం కత్తి మీద సాము లాంటిదేనని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. వంటవారు సరిగా పనిచేయకున్నా, పాలు పగిలినా, గ్యాస్ సిలిండర్లు అయిపోయినా, పైపులు లీకైనా, కూరగాయలు అపరిశుభ్రంగా ఉన్నా, నిత్యావసర వస్తువులు నాణ్యత లేకున్నా, టీచర్లే బాధ్యత వహించాల్సి వస్తున్నది. ఇతరులు చేసిన తప్పిదాల మూలంగా వంటలో చిన్న పొరపాటు జరిగినా, వాటర్ కలుషితంగా వచ్చినా సంబంధం లేని బోధన సిబ్బంది పైనే వేటు వేస్తూ, సస్పెండ్ కూడా చేస్తున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. వార్డెన్ డ్యూటీ దినదిన గండంలా ఉంటుందని, రోజువారి స్టాకు రాయడం, తమకు సంబంధం లేని పనులతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టడీ అవర్ పేరిట రాత్రి తొమ్మిది గంటల వరకు స్కూల్లోనే డ్యూటీ చేస్తే ఇంటికి వెళ్లడానికి బస్సులు దొరక్క, రాత్రిపూట ఒంటరి ప్రయాణాలు చేయలేక ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు.



మహిళా టీచర్ల పరిస్థితి మరింత దారుణం. రాత్రి తొమ్మిది గంటలకు ఒంటరి ప్రయాణాలు చేయడం, ఇంట్లో, బయట వేధింపులకు గురవుతూ, నెలసరి సమయంలో కూడా సెలవుల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. బోధన సిబ్బందికి బోధనేతర పనులు అప్పజెప్పడం ఏంటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. కఠినమైన నిబంధనల మూలంగా కొంతమంది మానసిక ఒత్తిడికి గురై గురుకుల ఉద్యోగానికి స్వస్తి పలుకుతున్నారు. ఇతర పాఠశాలల మాదిరిగానే ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు సమయం మార్చాలని చాలారోజులుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే పర్మినెంట్ వార్డెన్లను, కేర్ టేకర్లను నియమించాలని, శిక్షణ పొంది బోధించే టీచర్లకు బోధనేతర బాధ్యతలు అప్పగించవద్దని , కేరళ తరహాలో మహిళలకు పీరియడ్ సెలవులు మంజూరు చేయాలని, ఉపాధ్యాయులు, సంఘాలు ఏండ్లకొద్దీ వేడుకుంటున్నప్పటికీ వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయం. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలంటే టీచర్లపై ఒత్తిడి పెంచడం కాదు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి పర్మినెంట్‌గా పాఠశా లలకు, కళాశాలలకు కేటాయించాలి. భోజన సిబ్బందితో పాటు బోధనేతర సిబ్బందిని కూడా నియమించడం ద్వారా గురువులపై ఒత్తిడి తగ్గించాలి. అలా చేస్తే విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యను బోధించే అవకాశం ఉంటుంది.ఆ దిశగా సర్కార్ చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గురువులు కోరుతున్నారు.

ఆదాచేస్తేనే 'గృహజ్యోతి'

- వేసవి తాపంతో పెరిగిన విద్యుత్ వినియోగం
- 200యూనిట్లకు ఒక్క యూనిట్ ఖర్చయినా మొత్తం బిల్లు కట్టాల్సిందే!
- బిల్లుచెల్లించాకే మళ్లీ 'గృహజ్యోతి' పునరుద్ధరణ
- మధ్యమధ్యలో మీటర్ చెక్ చేసుకుంటే మేలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకల్లో గహజ్యోతి ఒకటి. తెల్ల రేషన్ కార్డు ఉండి, 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించిన కుటుంబాలకు జీరో బిల్లు వర్తిస్తుంది. అంతకు మించి ఒక్క యూనిట్ ఎక్కువ వినియోగించినా మొత్తం బిల్లు చెల్లించాల్సిందే. వేసవిలో ఫ్యాన్లు,కూలర్లు ఇష్టానుసారంగా వినియోగిస్తే యూనిట్లు పెరిగి మొత్తం బిల్లు చెల్లించాల్సి వస్తుంది. పరిమితిగా వినియోగిస్తే 'గహజ్యోతి' పథకం నిరంతరం ఉచిత వెలుగులు నింపుతుంది.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ గహ జ్యోతి పథకంతో సామాన్యులకు ప్రయోజనం చేకూరుతోంది. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి, నెలలో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వినియోగదారులకు జీరో బిల్లులు వస్తుండగా.. అంతకు మించి ఒక యూనిట్ విద్యుత్‌ను వినియోగించినా మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉన్నందుకు ఉచిత విద్యుత్ లబ్ధిదారులు విద్యుత్ పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. 200 యూనిట్లకు మించి ఒక్క యూనిట్ ఖర్చయినా మొత్తం బిల్లు చెల్లించాల్సి వస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 8,97,920 మంది గృహజ్యోతి లబ్ధిదారులుగా ఉన్నారు. కేవలం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే మొత్తం విద్యుత్ సర్వీసులు 4,12,720 ఉండగా 1,28,921 జీరో బిల్లులు జారీ చేసిన సర్వీస్‌లు ఉన్నాయి. ఈ సర్వీసులకు 5.46 కోట్ల రూపాయల సబ్సిడీని ప్రభుత్వం అందించింది. మరోవైపు గత నెలలో 1,28.921 మంది గృహజ్యోతిలబ్ధిదారులకుగాను కేవలం 15వేల మంది 200 యూనిట్లకు మించి విద్యుత్ వాడి జీరో బిల్లు అవకాశాన్ని కోల్పోయారు. ఎండ తీవ్రతతో విద్యుత్ వినియోగం పెరగడంతో వీరంతా 200 యూనిట్లకుగాపై విద్యుత్ వాడారు. ఇప్పుడు వచ్చిన మార్చి నెల బిల్లు చెల్లిస్తేనే మళ్లీ ఎప్పుడైతే వీరు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తారో అప్పుడు మళ్లీ గృహజ్యోతికి అర్హులుగా గుర్తిస్తారు.

పరిమిత వినియోగానికి జాగ్రత్తలు తప్పనిసరి

చాలా మంది కిటికీలు, తలుపులు మూసివేసి ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, విద్యుత్తు దీపాలు వినియోగిస్తుంటారు. సహజ వెలుతురు, గాలి ఉన్న సమయంలో ఫ్యాన్లు, బల్బులు వాడాల్సిన అవసరం ఉండదు. బల్బులు నిరంతరం వినియోగించడం ద్వారా 12 శాతం బిల్లు పెరుగుతుంది. సీజన్ మేరకు ఫ్రిడ్జ్‌లో ఫ్రీజర్ దశలు మార్చుతూ ఉండాలి. ఫ్రిజ్‌లో ఎన్ని వస్తువులు ఉంచినా ఒకే సామర్థ్యంతో పని చేస్తుంది. మంచు పొరలు పావు వంతు పెరిగినట్లు గమనిస్తే వెంటనే డిఫ్రోస్ట్ బటన్ నొక్కి తొలగించుకోవాలి. తద్వారా విద్యుత్తు వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. ఏసీ, కూలర్లు, ఫ్యాన్లు తదితర విద్యుత్తు పరికరాలు బీఈఈ రేటింగ్ 1 నుంచి 6 స్టార్లతో విక్రయిస్తున్నారు. వీటిలో 5 స్టార్‌కు మించినవి కొనుగోలు చేస్తే విద్యుత్తు వినియోగం గణనీయంగా తగ్గించుకోవచ్చు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వంటివి అవసరం లేనప్పుడు ఆఫ్ చేసి ఉంచాలి. ఛార్జింగ్ పూర్తయ్యాక సెల్‌ఫోన్ నుంచి ఛార్జర్ తొలగించాలి. ఎలక్ట్రానిక్ ఉపకరణాలు కుక్కర్, మిక్సీ, వాషింగ్ మిషన్ లాంటివి వినియోగం లేనప్పుడు స్విచ్ ఆఫ్ చేసి ఉంచాలి.ఏసీ, కూలర్లు వినియోగించే క్రమంలో కిటికీలు, తలుపులు పూర్తిగా మూసివేయాలి. లేదంటే బయటి ఉష్ణోగ్రత ప్రవేశించి గది చల్లబడేందుకు ఎక్కువ సమయం తీసుకుంటుంది. ఏసీలు 24 నుంచి 26 డిగ్రీల మధ్యన ఉపయోగిస్తే చల్లదనంతో పాటు విద్యుత్తు ఆదా అవుతుంది. రాత్రి రెండు లేదా మూడు గంటల పాటు ఏసీ ఆన్ చేసి తర్వాత ఆపేసినా తెల్లవారే వరకు పడక గదిలో చల్లదనం ఉంటుంది.

విద్యుత్ ఆదా చేస్తే నెలలో యూనిట్ల ఖర్చు అంచనా....

పరికరం	సామర్థ్యం (వాట్లలో)	రోజుకు వినియోగం (గంటల్లో)	నెలకు ఖర్చయ్యే కరెంటు (యూనిట్లలో)
బోరుమోటార్	300	01	22.50
వాటర్‌హీటర్	3000	01	12
ఏసీ	1500	02	90
వాషింగ్‌మిషన్	300	01	09
ఫ్యాన్	60	15	27
టీవీ	100	05	15
మిక్సీ	450	01	13.25
ట్యూబ్‌లైట్	40	10	01

జాగ్రత్తగా వాడి లబ్ధి పొందాం

- గర్షకుర్తి ఉమ, శివనగర్, కరీంనగర్

గహజ్యోతికి 200 యూనిట్లలోపు వినియోగించాలనే నిబంధన మేరకు గత నెల రోజుల నుంచి విద్యుత్తు పరికరాలు పొదుపుగా వినియోగిస్తున్నాం. ఈ నెల మాకు జీరో బిల్లు వచ్చింది. రూ.300వరకు ఆదా అయింది.

18 యూనిట్ల తేడాతో రూ.1,167 బిల్లు

- ర్యాకం మహేందర్, జ్యోతినగర్

నగరంలోని జ్యోతినగర్‌లో ఉండే మా ఇంట్లో 200 యూనిట్లకు మించి విద్యుత్తు వినియోగించడంతో జీరో బిల్లు పొందలేకపోయాం. 18 యూనిట్లు పెరగడంతో రూ.1,167 బిల్లు వచ్చింది. పొదుపుగా వినియోగిస్తే మాకు కూడా జీరో బిల్లు వచ్చేది. ఈనెల నుంచి విద్యుత్తు ఉపకరణాలు పొదుపుగా వినియోగించి గహజ్యోతి పథకం పొందాలని అనుకుంటున్నాం.

విద్యుత్ ఆదా చేస్తే పొదుపు చేసినట్టే

- గంగాధర్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ

విద్యుత్ ఆదా చేస్తే పొదుపు చేసినట్టే. ఎల్‌డీఈ బల్బులు వినియోగిస్తూ 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకునేలా చూసుకోవాలి. విద్యుత్ వాడకంపై తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభుత్వం అందించే గృహ జ్యోతి పథకానికి లబ్ధి పొందాలి.

పంటలు కాపాడాలని రోడ్డెక్కిన రైతులు

బీఆర్ఎస్ నేతల మద్దతు

నవతెలంగాణ - గంగాధర



రాస్తారోకో చేపట్టిన రైతులు, మద్దతు ప్రకటించిన నాయకులు

ఎండుతున్న పంట పొలాలకు నీరందించి కాపాడాలని డిమాండ్ చేస్తూ గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో రైతులు గురువారం రాస్తారోకో చేశారు. ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా నారాయణపూర్, గంగాధర ప్రాజెక్టులు నింపి తద్వారా గ్రామ గ్రామాన గల చెరువులు, కుంటలు నింపాలని, ఎండుతున్న పంటలు కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డుపై బైటాయించారు. ఎల్లంపల్లి ఎత్తిపోతలు చేపట్టి చెరువులు, కుంటలు నింపకపోవడం వల్లే బావులు, బోర్లలో భూగర్భ జలాల అడుగంటాయని, పంటలకు నీరందకుండా పోయాయని రైతులు ఆరోపించారు. ప్రభుత్వ తప్పిదం వల్లే గ్రామ గ్రామాన నిరందక పంటలు ఎండుతున్నాయని, ప్రభుత్వం బాధ్యత వహించి ఎండుతున్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తక్షణమే ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం కింద నారాయణపూర్, గంగాధర చిన్న తరహా ప్రాజెక్టులను నింపాలని తద్వారా పంటలకు నీరందేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. రైతులు చేపట్టిన రాస్తారోకో, ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మద్దతు ప్రకటించారు. రైతులకు మద్దతు ప్రకటించి రాస్తారోకో, ధర్నాలో కూర్చున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. రైతుల రాస్తారోకో, ధర్నాకు రావడానికి సిద్ధమైన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను పోలీసుల హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం గంగాధర తహసీల్దార్ అనుపమరావుకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందించి రైతుల గోడు వివరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మాజీ సర్పంచులు కంకణాల విజేందర్ రెడ్డి, వేముల దామోదర్, మేచినేని నవీన్ రావు, జోగు సాగర్, మల్లేశం, ఆదిమల్లు, సురేందర్, నాయకులు రవి, కొమురయ్య అఖిల్, గంగయ్య, పెద్ద సంఖ్యలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు

పెండింగ్ జీతాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్

నవతెలంగాణ - కరీంనగర్

ఎలగందుల గ్రామ పంచాయతీలో రెండు నెలల నుంచి 8 నెలలుగా ఉన్న పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వేతనాలు ఇవ్వాలని అడిగిన పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని, కార్మికులను బెదిరింపులకు గురి చేస్తూ చేస్తే పని చేయండి లేదంటే మానుకోండి మీ దిక్కున్న చోట చెప్పుకోండానే దుర్భాషలాడుతున్నడని ఆరోపించారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ వరకు పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని 150 కోట్ల పైచిలుకు గ్రాంట్ విడుదల చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం కార్మికులకు వేతనాలు అందడం లేదని ఆరోపించారు. ఆన్‌లైన్ రికార్డు ప్రకారం పేర్లు నమోదైన కార్మికులకు రూ.9500, కాంటాక్ట్ లేబర్ కింద తీసుకున్న కార్మికులను రూ.7000, రూ.6000ల వేతనమిస్తూ శ్రమదోపిడి గురి చేస్తున్నారని, ప్రభుత్వాలు మారిన పంచాయతీ కార్మికుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెళ్లగందుల పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించనట్లయితే 24వ తేదీ నుంచి, పంచాయతీ కార్యాలయం ఎదుట దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కాసిపాక శంకర్, కార్మికులు మైసలక్ష్మీ అంజలి, జగదీష్, వడ్లూరు లక్ష్మీనారాయణ, సత్తయ్య, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన అదనపు కలెక్టర్



ఈవీఎం గోదాం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్

జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాములను గురువారం అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోడౌన్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదికను పంపిస్తున్నామని తెలిపారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, ఏఓ సుధాకర్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చందు



సెంటర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చందు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జగ్గయ్యపల్లి గ్రామంలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చందు గురువారం సందర్శించారు. ప్రతి మంగళవారం, గురువారం ఆరోగ్య మహిళా శిబిరం నిర్వహిస్తారని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ సంధ్యారాణి, హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్‌గౌడ్, మోహన్‌రెడ్డి, సూపర్వైజర్ కుసుమ కుమారి, ఆరోగ్యశాఖ సిబ్బంది శ్యామల, రామకృష్ణ, ఆశలు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండించండి

సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం

నవతెలంగాణ - కరీంనగర్



రైతులందరికీ రుణమాఫీ చేయాలని, వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేసి ఉపాధి హామీ కూలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో కార్యక్రమం వాయిదా పడింది. అయినా పోలీసు యంత్రాంగం నాయకుల ఇళ్లలోకి వెళ్లి ముందస్తుగా అక్రమ అరెస్టు చేయడాన్ని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా సంఘాల పోరాటాల పై ఉక్కు పాదం మోపడం తగదన్నారు. 19వ తేదీన జరిగే బడ్జెట్ సమావేశాల్లో రైతులు వ్యవసాయ కూలీలు నిరుపేదలకు ప్రాముఖ్యత ఇస్తూ అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పట్టణాల్లో విలీనం చేసిన గ్రామాల్లో సైతం ఉపాధి పనులు కల్పించాలని అన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. గురువారం నగరంలోని జిల్లా కార్యాలయంలో కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగాన్ని విస్మరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంలో గవర్నర్ ప్రసంగంలో విద్యారంగంపై మాట్లాడిన పరిస్థితి లేదు, ఇది చాలా బాధాకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటివరకు కూడా విద్యారంగానికి కనీసం మంత్రి లేకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగం సమస్యలతో కూడుకుపోతున్నా ఏ ఒక్కరు పట్టించుకున్న పరిస్థితి ఈ రాష్ట్రంలో లేదని వాపోయారు. సంక్షేమ హాస్టల్లో అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నా మంత్రులు స్పందించడం లేదన్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా వ్యాప్తంగా విద్యారంగా సమస్యలు పరిష్కరించి ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు అసంపెల్లి వినయ్, సహాయ కార్యదర్శి ఇసాక్, జిల్లా కమిటీ సభ్యులు రాకేష్, మంద రాకేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిల్ అవుతానన్న భయంతో విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ - చొప్పదండి



మృతిచెందిన రోహిత్

ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయితానన్న భయంతో ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో జరిగింది. ఎస్సై గొల్లపల్లి అనూష కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూసాల రోహిత్(17) కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. చదువులో వెనుకబడి పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమో అని బాధపడుతూ ఉండేవాడు. బాధ పడవద్దని రోహిత్ తల్లి చెప్పింది. గురువారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో రోహిత్ పెద్దమ్మ అయినా రావుల అరుణ నిద్రలేచి, చూడగా ఇంటి ముందు రేకుల వరండాలో చీరతో ఉరేసుకుని కనిపించాడు. రోహిత్ తల్లి పూసల కవిత పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ గొల్లపల్లి అనూష కథనం ప్రకారం.. చొప్పదండికి చెందిన తాళ్లపెల్లి అమృతవ్వ (70) కొడుకులు భూమి విషయంలో గొడవల కారణంగా మనస్తాపంతో జీవితంపై విరక్తిచెంది బుధవారం ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నవతెలంగాణ - శంకరపట్నం



షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. శంకరపట్నం మండలం లింగాపూర్, ఎరుకల గూడెం గ్రామానికి చెందిన ముద్రకొల గోపికి చెందిన రేకుల షెడ్డు, గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటల చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయి, ఇంట్లో ఉన్న సామగ్రి, బంగారం, వెండి, 5లక్షల నగదు పూర్తిగా కాలిపోయాయని బాధితుడు లబోదిబోమంటున్నాడు. షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సుమారుగా రూ.20లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వెల్లడించాడు. ప్రభుత్వ సహాయం అందించాలని కోరాడు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



నవతెలంగాణ - తిమ్మాపూర్



మండలంలో రామకృష్ణ కాలనీలో వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్, సూక్ష్మ చిన్న మధ్యతరగ పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఎంఎస్ఎంఈ కరీంనగర్ చాప్టర్ వారి ఆధ్వర్యంలో బీటెక్ మూడవ, నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఎంటర్ ప్రేన్యూర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల జనరల్ సెక్రటరీ డాక్టర్ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఐడియా జనరేషన్, ఐడియా ఇంప్లిమెంటేషన్, టూల్ డిజైన్, ప్రోడక్ట్ డెవలప్మెంట్ మరియు ఫైనాన్షియల్ అంశాల పట్ల అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నవ కల్పనలతో నూతన సంస్థలను స్థాపించుటకు కృషి చేయాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఈడీసీ సెల్ కోఆర్డినేటర్ బి.రామ్మోహన్‌రెడ్డి, కో కోఆర్డినేటర్ ఎం.భరత్, వివిధ విభాగధిపతులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది

డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

నవతెలంగాణ - తిమ్మాపూర్

ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ ఆరోగ్యంగా ఉంటుందని డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. మండలంలోని ఎల్ఎండి కాలనీ లోని దుర్గాబాయి దేశముఖ్ మహిళా ప్రాంగణం, జిల్లా విద్యా శిక్షణ సంస్థ ఆవరణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తిమ్మాపూర్ పరిధిలో ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపు గురువారం నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపులో 180 మంది మహిళలకు ఉచితంగా రక్త పరీక్షలు, బరువు, ఎత్తు పరీక్షించి రక్తహీనత కలిగిన వారికి మందులు అందజేశారు. యోగాసనాలు గురించి వివరించారు. థైరాయిడ్ మరియు పిసిఓస్ కి సంబంధించిన అనారోగ్య సమస్యలపై మహిళలందరికీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఓఎంసిహెచ్ డాక్టర్ సన, డాక్టర్ జవేరియా, దుర్గాభాయి దేశముఖ్ మహిళా ప్రాంగణం మేనేజర్ సుధారాణి, జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ మొండయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుజురాబాద్‌లో పోలీసుల తనిఖీలు



నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో గురువారం టౌన్ సిఐ జితిరుమలగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల ధృవపత్రాలు, బీమా పత్రాలను, లైసెన్సులు తనిఖీలు చేశారు. వాహనాలకు సరైన పత్రాలు లేనివారిపై కేసులు నమోదు చేశారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా లైసెన్సులు, ఆర్సిలు కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్ చేసుకొని ఉండాలని అన్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

నవతెలంగాణ-కోరుట్ల :



విద్యార్థినీ,విద్యార్థులు ఏకాగ్రతతో ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి వెంకట రాజం అన్నారు. కోరుట్ల మండల జోగన్ పల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు గ్రామ అభివృద్ధి కమిటీ, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ నేతృత్వంలో గురువారం ఎగ్జామ్ ప్యాడ్స్ పెన్నులు పెన్సిళ్లు అందజేశారు. అనంతరం సైదు గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించాలని ప్రశాంతంగా చదివి పరీక్షలు రాయాలని మండల స్థాయిలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడుమల భూమా రెడ్డి, పోతవేణి రాజశేఖర్, ముత్యపు రాజశేఖర్, కనికారాపు రాజేశం, పాఠశాల ఉపాధ్యాయులు, కామిని లక్ష్మణ్, మహమ్మద్, పసియుద్దీన్,, తునికి వెంకట సుదీర్, సిహెచ్ యుగధర్ రాజ్, పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రంలో జోరుగా మాస్ కాపీయింగ్..?

సార్లు ఫుల్ కో-ఆపరేషన్ చేస్తున్నారని విద్యార్థుల ఆరోపణ

పరీక్షల అనంతరం చిట్టీలు జేబులో పెడుతూ... నవ తెలంగాణ కెమెరాకు చిక్కిన సిబ్బంది

తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం: జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి బి.నారాయణ



టాయిలెట్స్ వద్ద చిట్టీలతో సిబ్బంది

నవతెలంగాణ-రాయికల్:

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగాఉన్న ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఈనెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పరీక్షల్లో పారదర్శకత కోసం రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. అయితే పరీక్షా కేంద్రాలవద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా కఠినమైన నిఘా ఉంటుందని అనుకుంటే పొరపాటు పడినట్లే... ఎంత నిఘా ఉన్న కొందరు పరీక్షా కేంద్రాల సిబ్బంది స్వయంగా మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇంటర్మీడియట్ ర్యాంకుల కోసం కక్కుర్తి పడి పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా నకలు చిట్టీలు దర్శనమిస్తున్నాయి. ఆయా కళాశాలలకు ర్యాంకులు రావాలని దుర్బుద్ధితో మాస్ కాపీయింగ్‌కు తెరలేపుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



టాయిలెట్స్ కిటికీ వద్ద చిట్టీలు

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు..చూసి రాత పరీక్షలుగా.. మారాయని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గురువారం జరిగిన మ్యాథ్స్ 1-బీ,జువాలజీ,హిస్టరీ, ఒకేషనల్ గ్రూప్స్ పరీక్షలు నిర్వహించగా మ్యాథ్స్1-బీ,జువాలజీకి సంబంధించి మైక్రో జిరాక్స్ పేపర్లు కళాశాల వెనుక భాగంలో ఉన్న టాయిలెట్స్ కిటికీ వద్ద,ప్రహరీ పక్కన కుప్పలుగా కనిపించాయి.పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి చూసి రాతగా నిర్వహణ జరుగుతుంటే కష్టపడి చదివిన విద్యార్థుల పరిస్థితి ఏమిటని పలువురు తల్లిదండ్రులు,విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బుల్లెట్ మోడల్ పేపర్స్‌ని మైక్రో జిరాక్స్ తీయించి కళాశాల వెనుక వైపు ప్రహరీ గోడ అవతల పడేస్తున్నారు.ప్రశ్నపత్రం బయటకెళ్లాక మైక్రో జిరాక్స్ వస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాశాల టాయిలెట్స్ రేకుల క్రింద, టాయిలెట్స్ కిటికీల వద్ద, ప్రహరీల పక్కన మైక్రో జిరాక్స్ పేపర్లు ఆ అనుమానాలను ధృవపరుస్తున్నాయి.

కష్టపడి చదివిన విద్యార్థుల పరిస్థితి ఎంటి..?

చేతులు కాలినాక.. ఆకులు పట్టుకుంటే ఏమి లాభం అన్న చందంగా పరీక్షలు ముగిసిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకుంటారు...? కష్టపడి చదివిన విద్యార్థుల పరిస్థితి ఏమిటి..?చదవని వారికి సైతం మెరిట్ మార్కులు వస్తే... సంవత్సరకాలం కష్టపడి చదివిన విద్యార్థుల పరిస్థితి ఏమిటని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా రాబోయే పరీక్షలనైనా పకడ్బందీగా నిర్వహించాలని మెరిట్ విద్యార్థులు కోరుతున్నారు.

నోడల్ అధికారి బి.నారాయణ

నవతెలంగాణ వివరణ కోరగా...

పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ పై జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ బి. నారాయణను వివరణ కోరగా... మీకు ఎవరు చెప్పారు...? మాస్ కాపీయింగ్ జరుగుతుందని తెలిపిన విద్యార్థితో ఒకసారి మాట్లాడించండి. ఏ సెంటర్లో... ఏ రూమ్ లో... ఎక్కడ అంటూ ఎదురు ప్రశ్నలు వేస్తూనే అక్కడ ఏం జరుగుతుందో నేను స్వయంగా చూడలేదు. మీరు అడిగేది నిజమో..అబద్ధమో..తెలియదు. ఒకవేళ ఆరోపణలు నిజమైతే.. ప్రతిరోజు స్క్వాడ్ ని పంపిస్తాం. గత మూడు రోజులుగా ఆ పరీక్షా కేంద్రానికి స్క్వాడ్ వచ్చారు. అలాంటి సంఘటన జరిగినట్లయితే పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న సిబ్బందిని తనిఖీ చేయమని చెబుతాను. ఆరోపణలు నిజమైతే విద్యార్థుల కదలికలను సీసీ కెమెరాల రికార్డు ద్వారా గమనించి విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం. ప్రతిరోజు ఆ సెంటర్లో స్క్వాడ్ ఉండేలా చూస్తామని తెలిపారు.



కళాశాల వెనుక వైపు ప్రహరీ గోడ పక్కన కుప్పలుగా మైక్రో జిరాక్స్ పేపర్లు

తనిఖీ అధికారులు ఏం చేస్తున్నట్లు..?

మ్యాథ్స్,జువాలజీ సబ్జెక్టులకు సంబంధించిన చిట్టీలు ఆ కళాశాల వెనుక వైపు ప్రాంగణంలో బయట పడ్డాయి.పరీక్ష కేంద్రంలోకి అనుమతిచ్చే ముందే గేటు వద్ద పోలీసులు, పరీక్షా కేంద్రం సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తుంటే....ఈ చిట్టీలు ఎలా వస్తున్నాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.దీన్ని బట్టివిద్యార్థులు చిట్టీలతో వెళ్తున్నా పట్టించుకోవడం లేదనుకోవాలి...? లేదా పరీక్ష ప్రారంభం అయిన తర్వాత పేపర్ బయటకు వెళ్లి..ఆన్సర్లు మైక్రోజిరాక్స్ రూపంలో అయినా వస్తుండాలి..?ఈ విష యంపై నవ తెలంగాణ ప్రత్యేక నిఘా పెట్టగా... ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టుకోలేడు అన్న చందంగా పరీక్షల అనంతరం ఏకంగా సిబ్బందే కళాశాల వెనుకవైపు గల టాయిలెట్స్ పై రేకుల కింది నుండి చాలా కష్టపడి మరి చిట్టీలు తమ జేబుల్లో పెడుతున్న దృశ్యాలు సైతం నవతెలంగాణ కెమెరాకు చిక్కాయి.దీంతో విద్యార్థులు చేస్తున్న ఆరోపణలకు అసలైన ఆధారాలు దొరికాయి.

కన్న కూతురుతో అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రికి 3 సంవత్సరాల జైలు శిక్ష

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన నిందితుడు మేకల స్వామి వయస్సు (36) కన్నకూతురు (మైనర్ బాలిక)తో అసభ్య కరంగా ప్రవర్తించిన ఘటనలో నిందితుడిపై పోక్సో చట్టం కింద జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్.ఐఎం..చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు కి ఆధారాలు సమర్పించగా పీపీ కోర్టు డ్యూటీ అధికారులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా, సాక్ష్యులను విచారించిన న్యాయమూర్తి నీలిమ గురువారం నిందితుడికి 3 సంవత్సరాల జైలుశిక్ష, 5000 జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆర్డీవోకు ఫిర్యాదు...

నవతెలంగాణ-జగిత్యాల టౌన్



తల్లిదండ్రులను పోషించక, వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు కొడుకులపై మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన నిమ్మ నర్సయ్య (75,) నిమ్మ భూమక్క (73) అనే వృద్ధ తల్లిదండ్రులు గురువారం జగిత్యాల డివిజన్ ఆర్డీవో మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్‌ను కలిసి తన గోడు వెళ్ళబోసుకున్నాడు. తమకు ఇద్దరు కొడుకులని పెద్ద కొడుకు మాడ రాజరెడ్డి, చిన్న కొడుకు నిమ్మ వెంకటేష్‌లకు చెరో 2 ఎకరాల 12 గుంటల భూములు పంచి ఇచ్చానని, అంతే కాక చెరో ఒక ఇల్లు కట్టించామని, కాని మాకు ఆ ఇండ్లలో చోటు కల్పించడం లేదని అవేధన వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై స్పందించిన ఆర్డీవో వెంటనే కనికరం లేని ఇద్దరు కొడుకులపై వయో వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం సెక్షన్ 2(బి), సెక్షన్ 4(1), సెక్షన్ 24 ప్రకారం కేసు నమోదుకు, వారికి నోటీసులు జారీకి ఆదేశించారు.

అన్నదానం...

నవతెలంగాణ-కోరుట్ల

మండలంలోని అయిలాపూర్ గ్రామంలో గురువారం రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలై అమ్మవారికి పంచామృతంతో అభిషేకం చేసి పంచ పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు నరేష్, పదాల నారాయణ, సత్యనారాయణ, ప్రస్తుత మాజీ సర్పంచ్ ఏనుగు రాధ సందయ్య, మహిళా భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు

రైతులకు అవగాహన

నవతెలంగాణ-కోరుట్ల

మండలంలోని మాదాపూర్‌లో గురువారం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఎస్ఎస్ 3/100. కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ 100 కేవీఏను బిగించారు. అనంతరం రైతులకు విద్యుత్ వినియోగంలో ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కెపాసిటర్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ గంగారాం, కోరుట్ల ఏడీఈ ఆంజనేయరావు, ఏఈ శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం : జాతీయ ధూమపాన నిషేధ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షా కొండ ప్రథమికో ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధూమపానం వల్ల మనిషి ఆరోగ్యం ఏ విధంగా క్షీణించిపోతుంది దానివల్ల జరిగే నష్టాలను వివరించారు. వారితోపాటు ప్రధానోపాధ్యాయులు అచ్చ విజయభాస్కర్, ఉపాధ్యాయులు రమేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటిపన్ను వసూల్ చేయాలి

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి మున్సిపాలిటీలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇంటి పన్ను వసూళ్ళు వంద శాతం పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. అర్బన్ కాలనీలోని హెల్త్ సెంటర్ నిర్మాణం కొరకు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్,మున్సిపల్ సిబ్బంది అక్షయ్, టీపీవో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పల్లె దవాఖాన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

జగిత్యాల రూరల్ మండలం తక్కలపల్లి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా 20 లక్షలతో నిర్మించనున్న పల్లె దవాఖాన నిర్మాణపనులకు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ స్థల పరిశీలన చేసి, పల్లె దావఖాన నిర్మాణానికి భూమి దానం చేసిన హనుమాన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. జగిత్యాల రూరల్ మండలం హనుమాజీపేట్, బాలపెల్లి గ్రామాల మధ్య 31 లక్షల 50 వేలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక పల్లె దావఖానలు జగిత్యాల నియోజకవర్గానికి మంజూరయ్యాయి. జగిత్యాల జిల్లా నేడు మెడికల్ హబ్‌గా మారిందన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేయడానికి కృషిచేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జగిత్యాల నియోజకవర్గంలో రహదారి అభివృద్ధి పనులకు 104 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయి. 38 కోట్లతో గ్రామీణ రహదారులు, 15.5 కోట్లతో బీటీ రోడ్ల రెన్యువల్, 30 కోట్లతో ఈజీఎస్ రోడ్లు,10 కోట్లతో ఎస్సీ సబ్ ప్లాన్, 10 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్ల సైతం మంజూరు కానున్నాయరని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముస్కు ఎల్లారెడ్డి, దశరథ రెడ్డి, బాల ముకుందం, రవీందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, విక్రమ్, రమణ రెడ్డి, కృష్ణ, అంకం సతీష్, నరేష్, రాం శంకర్, ప్రవీణ్ రావు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ స్థానాల తీర్పులను అధికారులు అమలు చేయడం లేదు

తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు "చుక్క గంగారెడ్డి"

నవతెలంగాణ జగిత్యాల

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా అవినీతే రాజ్యమేలుతుందని ప్రముఖ ఉద్యమ కారుడు, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. గ్రామ స్థాయి నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు అధికారులంతా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును, వారి అవినీతికి అద్దం పడుతున్న తీరును ఆయన విలేఖరులకు వివరించారు.

ఏకంగా జిల్లా ఉన్నతాధి కారులే న్యాయస్థానాల తీర్పులను కూడా గౌరవించడం లేదన్నారు. వాటిని అమలు చేయ డం లేదన్నారు. డబ్బులు వెదజల్లిన వారికి మాత్రం క్షణాల్లో, గంటల్లోనే కావలసిన పత్రాలు అన్నీ జిల్లా ఉన్నతాధికారులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. న్యాయస్థానాల జడ్జిమెం ట్లను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలను, సమాచార హక్కు చట్టాన్ని, సమాచార కమీషన్ తీర్పులను కూడా ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. ఏ కార్యాలయంలో చూసినా అంతా అవినీతే, అంతా నిర్లక్ష్యమే కొట్టొచ్చినట్లు కనబడుతుందన్నారు. "పైసలు ఉన్నోడిదే రాజ్యం అన్నట్లు జిల్లా వ్యాప్తంగా పాలనా వ్యవస్థ కొనసాగుతుందన్నారు. బుగ్గారం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై గత డిసెంబర్ 6న "లోకాయుక్త" న్యాయస్థానం నుండి తీర్పు వెలువడిందన్నారు. బాధ్యులందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ప్రత్యక్షంగా నిధుల దుర్వినియోగాన్ని పరిశీలించి తగిన కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్‌ను లోకాయుక్త ఆదేశించినా నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. సుమారు వంద రోజులు కావస్తున్నా... రుజువైన నిధుల దుర్వినియోగం పై, లోకాయుక్త జడ్జిమెంట్ పై జిల్లా కలెక్టర్ కూడా చర్యలు తీసుకోక పోవడం శోచనీయం అన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు



కోరుట్లలో అన్నదానం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పుల్ల జగన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్,పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థుల సమస్యల పట్ల అనునిత్యం పోరాడుతూ నిజామాబాద్ పార్లమెంటు అభివృద్ధికి ఎంతో కృషి చేసిన మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమాజ సేవలతో జనహృదయాలను గెలుచుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు కోట ప్రభాకర్, పాల్గొన్నారు.

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండలం కేంద్రంలో అంబేద్కర్ చౌక్ వద్ద తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజవర్గ జాగృతి కన్వీనర్ రాజేందర్ రావు, మేడిపల్లి మండల జాగృతి కన్వీనర్ బొంగోని మల్లేశం గౌడ్, యువజన విభాగం జిల్లా కో కన్వీనర్ వెంకటేష్, జాగృతి సీనియర్ నాయకులు కడతల వెంకటేష్ ,మండల్ యువజన కన్వీనర్ బుస రాకేష్, మేడిపల్లి మాజీ ఎంపీటీసీ మకిలి దాసు, పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని అంగడి బజార్ ప్రధాన కూడలిలో జాగృతి నాయకులు కొండ యుగంధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జాగృతి నాయ కులు కొండ యుగం ధర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీగా, జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలిగా సమాజానికి ఎనలేని సేవ చేస్తున్న కల్వకుంట్ల కవిత పేద ప్రజలకు ఏకష్టం వచ్చినా ముందుండి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని, సమాజ సేవ చేస్తూ అభివృద్ధి పనులతో కలకాలం నిలిచి పోయే విధంగా ప్రజల హృదయాల్లో నిలిచారు.

ముందస్తుగా హోలీ సంబరాలు...

నవతెలంగాణ ఇబ్రహీంపట్నం,

మండలంలోని తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుర్రాల విజయలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ హోలీ పండగ చిన్న, పెద్ద తేడా లేకుండా ఆనందంగా జరుపుకుంటారని, హోలీ సంబరాల్లో ఉపయోగించే రంగులు కల్తీ మయమై రసాయనాలతో కూడుకొని ఉంటాయని, వాటివల్ల చర్మవ్యాధులతో పాటు అనారోగ్యానికి గురవుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తులసి వేణుగోపాల్, కల్లూరి నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్గటూర్-నవతెలంగాణ

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పైడిపల్లిలో హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తుగా హోలీ సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులసి ఆగమయ్య, ఉపాధ్యాయులు సతీష్ కుమార్, సునీత హోలీ వేడుకల్లో సంతోషంగా పాల్గొన్నారు. హోలీ పండుగ స్నేహం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని కల్లూరు రోడ్డులోని ఎస్ఆర్ఎస్పీ ప్రభుత్వ గడి పాఠశాల విద్యార్థులు ముందస్తు హోలీ జరుపుకున్నారు. పిల్లలు ఒకరికొకరు ప్రకృతి సిద్ధమైన పువ్వుల రంగులు పూసుకొని ఆటా పాటలతో సంబరాలు చేసుకున్నారు. హోలీ పండుగను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు నునావత్ రాజు మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా అందరూ ఒక్కటై సౌభ్రాతృత్వం సోదరభవంతో కలిసి మెలిసి ఉండాలని ఈ పండు గ ముఖ్య ఉద్దేశ్యం అని ఈ విధంగానే కలిసి మెలిసి జీవితంలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్ణ చందర్, సురేందర్,సురేఖ, ధనలక్ష్మి, సుమలత విద్యార్థులు పాల్గొన్నారు.

స్పీకర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శనిగారపు తిరుపతి

నవతెలంగాణ-మల్యాల

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ రావుపై అహంకారపూరితంగా ఏకవచనంతో అనుచిత వాక్యాలు చేసిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శనిగారపు తిరుపతి అన్నారు. షెడ్యూల్డ్ కుల నాయకులు ఎంతటి ఉన్నత స్థితిలో ఉన్న గాని అవమానం చులకన భావం తప్పడం లేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో షెడ్యూల్డ్ కుల నాయకులను అనేకసార్లు అవమానించారని తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల



లింగ నిర్ధారణ చేసి పుట్టే పసిపాప ఆడపిల్ల నా మగ పిల్లవాడా అని చెప్పడం చట్టరీత్యా నేరమని మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జగిత్యాల ఆర్డీవో శ్రీ ఏ మధుసూదన్ తో కలిసి స్కానింగ్ సెంటర్లను, ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు స్కానింగ్ సెంటర్లలో పేషంట్ల సౌలభ్యం కోసం కనీస వసతులు, వెంటిలేషన్ సౌకర్యం, వెయిటింగ్ హాల్, నిబంధనల ప్రకారం ఉన్నాయా అని చూశారు.స్కానింగ్ మిషన్స్,డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని సరిపోల్చారు. నిబంధనలకు లోబడి అన్ని సక్రమంగా ఉన్నట్లయితే ఆయా కేంద్రాల దరఖాస్తులను అనుమతి కొరకు సిఫారస్ చేస్తామని ఆర్డీవో మధుసూదన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, హెల్త్ సూపర్వైజర్ ఇండివర శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

హోలీని సురక్షితంగా జరుపుకోవాలి : జిల్లా ఎస్పీ

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

హోలీ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని, మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కావున జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో హోలీ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువకులు అత్యుత్సాహం ప్రదర్శించరాదని ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వారి తల్లిదండ్రులకు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులుగా భూమేష్ గౌడ్

నవతెలంగాణ-మేడిపల్లి



భీమారం మండల బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులుగా వెంకట్రావు పేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుధావేణి భూమేష్ గౌడ్, భీమారం గ్రామానికి చెందిన శనిగారపు స్వామి ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య సమక్షంలో,ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పోలాస నరేందర్ నియామక పత్రాలను వేములవాడలో జరిగిన జిల్లా బీసీ సాధికారిత సంఘం విస్తృత స్థాయి సమావేశంలో అందజేశారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

నూతన చైర్మన్‌గా జక్కు రవీందర్ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-ధర్మపురి



ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం 13 మందితో కూడిన నూతన పాలక మండలి ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా గురువారం ఆలయ ప్రాంగణ ప్రాంతంలో ధర్మకర్తలతో ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జక్కు రవీందర్‌ను దేవస్థానం నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో ఆయన తాత్కాలిక ధర్మకర్తల మండలిలో కూడా దేవస్థానం ఛైర్మన్ కొనసాగారు. జక్కు రవీందర్ ఎన్నిక పట్ల ఆర్యవైశ్య సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వేసవిలో ఉపాధి కూలీలకు వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్

నవతెలంగాణ-రాయికల్



వేసవి కాలం దృష్ట్యా పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వీరాపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు.ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీల హాజరు నమోదు వివరాలను పరిశీలించి,కూలీలు చేసిన పనులకు సంబంధించిన కొలతలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం తొందరగా పనులకు రావాలని కూలీలకు సూచించారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఈనెల 31 వరకు 4 లక్షల పని దినాలు కల్పించే లక్ష్యం ఉందని,జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనులకు రావాలన్నారు. ఫారం ఫండ్,నీటి నిల్వ కందకాలు,పర్క్యులేషన్ ట్యాంక్ హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మా, ఏపీవో దివ్య, పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, టెక్నికల్ అసిస్టెంట్ వీణారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, కారోబార్ ప్రశాంత్ కూలీలు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

పట్టణంలోని మంచినీళ్ళ బావి దగ్గర 29, 30 వార్డులకు సంబంధించి 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను, న్యూ హైస్కూల్‌లో 10 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, కృదసు నాగయ్య, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పంబాల రాం కుమార్, మాజీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుమాల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీ దినోత్సవం

నవతెలంగాణ-కోరుట్ల

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో ఆసుపత్రి సూపరంటెండెంట్ డాక్టర్ సునీత ఆద్వర్యంలో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డయాలసిస్ రూంను బెలూన్‌లతో కట్టి ఇంటి పండుగలాగా అందంగా డెకరేట్ చేసి డయాలసిస్ రోగులచే కేక్ కట్ చేయించి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యులు వినోద్ కుమార్, పత్తిపాక గంగాధర్ శ్రీనివాస్, ఆరోగ్య మిత్ర కర్నె శ్రీనివాస్, డయాలసిస్ ఇంచార్జ్ రామకృష్ణ, టెక్నిషియన్లు, వైద్య సిబ్బంది, డయాలసిస్ రోగులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నిరసన


ముస్తాబాద్ లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

నవతెలంగాణ - ముస్తాబాద్ :
జగిత్యాల జిల్లాలో ఆశ వర్కర్‌పై జరిగిన లైంగికదాడిని నిరసిస్తూ మండల కేంద్రంలో వివిధ గ్రామాల ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. దాడిచేసిన వ్యక్తిని ప్రభుత్వం వెంటనే కఠినంగా శిక్షించాలని జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు మంజుల డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యుడు రమణ, సహాయ కార్యవర్గ సభ్యుడు గణేష్, ఆశ వర్కర్లు దేవిక, భాగ్యలక్ష్మి, రాధ, సునీత, జ్యోతి, కార్మిక సంఘం అధ్యక్షుడు బిక్షపతి, హమాలీ, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- 100శాతం ఆస్తిపన్ను వసూలు చేయాలి
- గ్రామాలలో ఆస్తుల రీ అసెస్మెంట్ కు ప్రణాళికాబద్ధంగా చర్యలు
- పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ
- పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై సమీక్ష


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్


సమీక్ష లో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ - సిరిసిల్ల :
గ్రామాలలో ప్రభుత్వ విధులను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. గురువారం కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీ శాఖ పనితీరుపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూలు, ఎల్ఆర్ఎస్. దరఖాస్తుల ఫీజుల వసూళ్లపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలు, ఇండ్ల ఆస్తి పన్ను 100శాతం వసూలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరో 17 రోజులు సమయం మాత్రమే ఉందని, ఆస్తి పన్ను వసూలు లక్ష్యాలను చేరుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా తక్కువ ఆస్తి పన్ను వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ ప్రత్యేకంగా రివ్యూ చేశారు. ఆస్తి పన్ను చెల్లించిన వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలని అన్నారు. గ్రామాలలో అవసరమైన చోట ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తి పన్ను విలువ పెంచాలని, రీ - అసెస్మెంట్ చేసి సరైన ఆస్తుల విలువ ప్రకారం పన్ను వసూలు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో వ్యాపారాల ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సకాలంలో జరిగేలా చూడాలని, ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఎక్కడైనా వ్యాపారాలు నిర్వహిస్తే సీజ్ చేయాలని అన్నారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ పన్ను ముందుగా వసూలు చేయాల్సి ఉంటుందని అన్నారు. గ్రామాలలో మల్టీ పర్పస్ సిబ్బంది వేతనాలు ఎప్పటికప్పుడు పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పరిసరాలలో అపరిశుభ్రత అధికంగా గమనిస్తున్నామని, దీన్ని నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలలో ఉన్న ప్రభుత్వ భవనాల పరిసరాల్లో పరిశుభ్రత పట్ల శ్రద్ధ పెట్టాలని అన్నారు. రోడ్లను రెగ్యులర్ గా శుభ్రం చేయాలని, ప్రతి రోజు ప్రజల నుంచి చెత్త సేకరణ జరగాలని అన్నారు. గ్రామాలలో పెండింగ్ ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు క్లియర్ చేయాలని అన్నారు. ఆమోదించిన ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల నుంచి ఫీజు వసూలు చేయాలని, దరఖాస్తుదారులను ఫాలో అప్ చేస్తూ మార్చి 31 లోపు ఫీజు చెల్లించేలా చూడాలని, ప్రజలు ప్రభుత్వం కల్పించిన 25శాతం రీబెట్ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ చేసుకోక పోతే ఇంటి నిర్మాణం అనుమతులు, ఇతరులకు అమ్మేందుకు ఆస్కారం ఉండదని, ఎల్.ఆర్.ఎస్. చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. సమావేశంలో డిపిఓ షరిపుద్దీన్, డిఎల్పిఓ నరేష్, డిటిసిపిఓ అన్సర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను వేధిస్తే ఆందోళన చేపడతాం...

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల సమ్మయ్య

నవతెలంగాణ - కరీంనగర్ :
మధ్యాహ్న భోజన కార్మికులను వేధిస్తే ఆందోళన చేపడతామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల సమ్మయ్య హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ప్రధానోపాధ్యాయులు వంట వండిన సరుకుల డబ్బుల నుంచి అదనపు పనులు చేసినందుకు విద్యాశాఖ నుంచి డబ్బులు ఇస్తే ఆ డబ్బుల నుంచి మాకు డబ్బులు రావాలని, అలాగే మెనూలో లేని వంటకాలను వండి పెట్టాలని అనేక వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. వేధింపులకు పాలుపడితే తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లాలోని సైదాపూర్ మండలంలో రాయికల్, జాగిరి పల్లెల్లో గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు వంట కార్మికులను అనేక వేధింపులకు గురి చేస్తూ రోజు కూరగాయలు తీసుకొచ్చి వండి పెట్టాలని లేకుంటే మిమ్మల్ని తీసేస్తామని మీకు వచ్చిన డబ్బుల నుంచి మాకు డబ్బులు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజన కార్మికులను రోజు వారీగా మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

'సర్టిఫికెట్ విషయంలో వేధింపులు ఆపాలి'


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్ :
సర్టిఫికెట్ విషయంలో రెవెన్యూ సిబ్బంది వేధింపులకు గురి చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, యువజన సంఘం కార్యదర్శి గూడూరి సురేష్, రాష్ట్ర కార్యదర్శి పోలె శ్రీనివాస్‌తో కలిసి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతూ.. ఇటీవల గురుకుల అడ్మిషన్ నోటిఫికేషన్, కేంద్రీయ విశ్వ విద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేయగా ఇన్కమ్, క్యాస్ట్, రెసిడెన్స్, ఓబీసీ సర్టిఫికెట్లు అప్లికేషన్ చేయవలసి ఉంటుందని, ఈ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ చేసుకొని సంబంధిత రెవెన్యూ ఆఫీసులకు వెళితే అది లేదు ఇది లేదు అనడమే కాకుండా మీరు ఎక్కడ ఉంటున్నారో అక్కడనే చేయించుకోవాలని, ఆన్‌లైన్ ద్వారా చేసిన సర్టిఫికెట్లు ఎక్కడనో పడవేసి తిరిగి మరలా తీసుకువచ్చిన కూడా ఇబ్బందికి గురి చేస్తున్నారని అన్నారు. కరీంనగర్ జిల్లాలోని ఆర్ఐ వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం ఆర్ఐ 'నేను పెట్టను పో' అని కరాకండిగా చెప్పడమే కాకుండా ఏమైనా చేసుకో అని, ఎవరికైనా చెప్పుకో అని తనకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నాడు అని అన్నారు. వారిపై చర్య తీసుకుని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, నిరుద్యోగ జాబ్ అప్లికేషన్ దృష్టిలో పెట్టుకొని వాటిని సకాలంలో ఆన్‌లైన్ ద్వారా ప్రింట్ వచ్చేలా చూడాలని సమన్వయంగా విజ్ఞప్తి చేశారు.

వివేకానంద విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ


పతకాలతో విద్యార్థులు

నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్‌లోని స్థానిక భగత్ నగర్ వివేకానంద విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు సిల్వర్ జోన్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో 8 బంగారు, 5 రజత పతకాలు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇ.స్నేహిత్ వర్మ, పి.హాసిని, పి.శాన్వి, ఎస్.శివస్మరణి, అమత మిస్త్రి, హర్షిత్ కౌర్, జి.అదితి వైశాలి, ఎ.సాహస్ బంగారు పతకాలు, జె.అద్వైత్, జీ.మిలిని వైశాలి, జి.కార్తీక వైశాలి, టి.భవిష్య, నితీష్ కుమార్ మిస్త్రి రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మెన్ కొమురయ్య సౌగాని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ సాగర్, ఏవో తుంగాని సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్
సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జెడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పదోతరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులను మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దూస రఘుపతి, ఉపాధ్యాయుడు దేవయ్య, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ పాల్గొన్నారు.

హోలీ పండుగను ఆనందంగా జరుపుకోవాలి

- బలవంతంగా రంగులు చల్లిన, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు
- సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే


మాట్లాడుతున్న ఎస్పీ మహేష్. బి. గితే

నవతెలంగాణ - సిరిసిల్ల :
హోలీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో, సురక్షితంగా జరుపుకోవాలని.. రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం, పరిచయం లేని వ్యక్తులపై బలవంతంగా రంగులు చల్లిన, గొడవలు సృష్టించిన కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. హోలీ వేడుకల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా డ్రంక్అండ్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని, యువకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హోలీ వేడుకలు ముగిసిన తరువాత స్నానాల కోసం అధిక నీటి ప్రవాహం, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దు అని సూచించారు. పండుగ వేళ ఇతరులపై బలవంతంగా రంగులు వేసిన,గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురిచేసిన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి అని ఎస్పీ సూచించారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్లో విద్యా రంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ సిరిసిల్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్, మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కనీసం మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని సంవత్సరాల నుండి స్కాలర్‌షిప్‌లు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. అదేవిధంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి, విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లకు పక్క భవనాలు నిర్మించాలన్నారు. లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్, గర్ల్స్ కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు సాయి, భరత్, శివ, నాయకులు రాహుల్, శ్రీధర్, సాయికుమార్, మధు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా విస్తృతస్థాయి సభను విజయవంతం చేయండి

జిల్లా కార్యవర్గ సభ్యులు రమణ


కరపత్రాలను విడుదల చేసిన నాయకులు

నవతెలంగాణ - ముస్తాబాద్ :
సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16న సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ అంబా భవాని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు రమణ కోరారు. దానికి సంబంధించిన కరపత్రాన్ని మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌక్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన అనంతరం మొట్టమొదటిసారిగా ముఖ్య అతిథిగా జాన్ వెస్లీ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. వారిని సిరిసిల్ల మానేరు బ్రిడ్జి వద్ద నుంచి పెద్ద ఎత్తున సిరిసిల్ల పట్టణంలో బైక్‌ర్యాలీతో స్వాగతం పలుకుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లాలో కార్మికవర్గం, రైతాంగం, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలపై చర్చించి.. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై రాబోయే రోజుల్లో పోరాటలకు సంబంధించినటువంటి ఉద్యమ కార్యచరణ రూపొందించుకొని పార్టీ నాయకులు కార్యకర్తలు అందరికి వారు దేశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. విజయవంతం చేయాలని మండల కార్మికులను ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు అన్నల్దాస్ గణేష్, మండల నాయకులు గీస బిక్షపతి, నరేష్, రమేష్, దేవయ్య, బాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

16న సీపీఐ(ఎం) బైక్ ర్యాలీ, సభను విజయవంతం చేయండి

సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మూషం రమేష్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :
ఈ నెల 16న సిరిసిల్లలో నిర్వహించే సీపీఐ(ఎం) బైక్ ర్యాలీ, అనంతరం జరిగే సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూ నగర్ భవాని ఫంక్షన్‌హాల్‌లో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జాన్‌వెస్లి తొలిసారిగా సిరిసిల్లకు వస్తున్న సందర్భంగా వారికి ఘన స్వాగతం పలకడంలో భాగంగా తంగళ్లపల్లి బ్రిడ్జి వద్ద నుండి వందలాది మందితో బైక్ ర్యాలి నిర్వహిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు సూరం పద్మ, మండల కార్యదర్శి గొర్రె మల్లేశం, నాయకులు పిట్ల ఎల్లయ్య, సింగిరెడ్డి వేణు, లక్ష్మణ్, కుమ్మరి సత్తయ్య, పల్లెకొండ చారి, కుమ్మరి శేఖర్, దాసరి మధు, దాసరి సత్తయ్య పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు


ఎస్పీ ని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బిఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన గీతే మహేష్ బాబా సాహెబ్‌ని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, మాజీ కౌన్సిలర్లు మంచే శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, మజీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎండి సత్తార్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న సిఐ, ఎస్సై

నవతెలంగాణ - చందుర్తి :
మండలంలోని మాల్యాల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఆశినిపర్తి దేవయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి గల్ఫ్ అభివృద్ధి కమిటీ పదివేలా 2వందల రూపాయలను సి.ఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ఆంజయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదం బాబు, గంగాధర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల నర్సింగ్ హోమ్‌లో క్రిటికల్ కేర్ ప్రారంభం



నవతెలంగాణ - ముస్తాబాద్ :
మండల కేంద్రంలోని తిరుమలలో నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ చంద్రశేఖరరావు అనురాధ, డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ శశి ప్రియ అత్యాధునికమైన క్రిటికల్ కేర్ విభాగాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, బిజెపి మండల అధ్యక్షుడు అంజాగౌడ్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ శ్రీకాంత్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ


సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి.

నవతెలంగాణ - ముస్తాబాద్ :
మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ పార్టీ నాయకుడు కొండం రాజిరెడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మెరుగైన విద్యకోసం అమెరికాలో ఉన్న ఎన్నారైలతో మాట్లాడి 5 కంప్యూటర్లను తెప్పించాడు. వాటిని గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వామికి అందజేశారు.

ఎల్లారెడ్డిపేట మండలంలో రెండు నూతన గ్రామ పంచాయతీలు


సమావేశంలో మాట్లాడుతున్న దొమ్మాటి నర్సయ్య

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :
ఎల్లారెడ్డి పేట మండలంలో నూతనంగా రాచర్ల బాకురుపల్లె, సేవాలాల్ తండాలు గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశించినట్లు గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా అదనంగా మరో రెండు గ్రామపంచాయతీలకు ప్రభుత్వం గవర్నర్‌కు సిఫారసు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం పంపిన బిల్లును గవర్నర్ ఆమోదించడంతో మరో రెండు గ్రామపంచాయతీలకు మండలంలో అవకాశం ఏర్పడిందన్నారు. ఇదే వారంలో కొత్త గ్రామ పంచాయతీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో ఉంటుందని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కెకె.మహేందర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, బండారి బాల్‌రెడ్డి అన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ


జయంతి వేడుకులు నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలో కవయిత్రి ఆత్కూరి మొల్లమాంబ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్ల పంపిణీ చేశారు. కుమ్మరి మండల అధ్యక్షుడు యాసరవేణి దేవరాజు, దరిపెల్లి రమేష్, వాసరవేణి రాజు, రాపోలు బాబు, ఆరికాల బుక్షపతి, మధు, కిష్టయ్య, బాలయ్య పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండించండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్


మాట్లాడుతున్న అజయ్

నవతెలంగాణ - కరీంనగర్ :
రైతులందరికీ రుణమాఫీ చేయాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ కూలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి 600 చెల్లించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో కార్యక్రమం వాయిదా పడింది. అయినా పోలీసులు నాయకుల ఇళ్లలోకి వెళ్లి ముందస్తుగా అక్రమ అరెస్టు చేయడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్ తీవ్రంగా ఖండించారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి జిందా ప్రసాద్ అరెస్టుల ద్వారా ఉద్యమాన్ని ఆపలేరు అని తెలిపారు.

రిటైర్డ్ తహశీల్దార్‌పై కేసు నమోదు..?

నవతెలంగాణ - చందుర్తి : ఓ రిటైర్డ్ తహశీల్దార్‌ను స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం విచారించారు. సి.ఐ తెలిపిన వివరాల ప్రకారం 2005లో చందుర్తి తహశీల్దార్‌గా పని చేసిన బాలయ్య మాల్యాల గ్రామానికి చెందిన పత్తిపాక దేవరాజ్ అనే రైతుకు చెందున భూమిని మరో వ్యక్తికి అక్రమ భూ పట్టా చేశాడని రెండు నెలల కిందట స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారించి కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

వంద శాతం ఇంటి పన్నులు వసూళ్లు పూర్తి చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య

నవతెలంగాణ-మంథని



మండలంలోని గ్రామపంచాయతీలలో ఇంటి పన్నుల వసూళ్లు వంద శాతం పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అధికారులను ఆదేశించారు. మంథని మండలంలోని గుంజపడుగు, నాగారం,మల్లెపల్లి,ఎక్లాస్ పూర్,సూరయ్యపల్లి, గ్రామపంచాయతీలలో జరుగుతున్న ప్రత్యేక పాశుద్ధ్య కార్యక్రమాలను ఆయన అకస్మికంగా సందర్శించి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం సక్రమంగా జరగాలని,గ్రామాలలో సేకరించిన తడి,పొడి చెత్తని సెగ్రిగేషన్ షెడ్డులో వేరుచేసి నాణ్యమైన కాంపోస్టును తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి కే.సతీష్,మండల పంచాయతీ అధికారి శేషయ్యసూరి,సంబంధిత పంచాయతీ కార్యదర్శులు,సిబ్బంది, పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-జూలపల్లి /ధర్మారం

ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఒరేం సౌజ్ఞశ్రీ, ఉష రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు. వీరు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 14 నుంచి 16 వరకు వనపర్తి జిల్లాలో జరిగే అండర్ -14 బాలికల ఫుట్బాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరపున పాల్గొంటారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

డీఎల్‌పీవో వేణుగోపాల్

నవతెలంగాణ-ఎలిగేడు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వేణుగోపాల్

గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పరిష్కారం కోసం అధికారులందరూ కృషి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్ ఆదేశించారు. గురువారం మండలంలోని సుల్తాన్ పూర్, ఎలిగేడు, ముప్పిరితోట, లోకపేట గ్రామాల్లో డీఎల్‌పీవో పర్యటించి ప్రత్యేక పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నిధులు, పథకాలు సక్రమంగా అమలయ్యేల చూసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో నిర్మించిన సిగ్రీగేషన్ షెడ్లను నిర్లక్ష్యం చేయకుండా సేంద్రియ ఎరువుల తయారుపై దృష్టి సారించాలన్నారు. బకాయి పన్నులను వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఈ నెల 31లోపు తగిన రుసుము చెల్లిస్తే 25 శాతం సబ్సిడీ వర్తిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో భాస్కర్ రావు, ఎంపీవో ఎండి.ఆరిఫ్, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, అంజలి, శిరీష, మాసోద్దీన్, పున్నమయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఏడో రోజు ఇంటర్మీడియట్ పరీక్షలు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలంలో ఏడో రోజు గురువారం ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగాయి. మ్యాథ్స్ 1బి పరీక్షకు మొత్తం 60 మంది విద్యార్థులకు గాను 59 మంది హాజరై పరీక్ష వ్రాశారు. ఒక విద్యార్థి గైర్హాజరయ్యాడు. జువాలజీ పరీక్షకు 36 మంది విద్యార్థులకు గాను 34 మంది హాజరై పరీక్ష వ్రాయగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. హిస్టరీ పరీక్షకు 12 మంది విద్యార్థులకు గాను 09 మంది హాజరై పరీక్ష వ్రాయగా ముగ్గురు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 21 మంది విద్యార్థులకు గాను 20 మంది హాజరై పరీక్ష వ్రాయగా, ఒక విద్యార్థి గైర్హాజరయ్యాడు.

నేటి డయల్ యువర్ డీఎంను విజయవంతం చేయండి

నవతెలంగాణ-మంథని

మంథని ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డియర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంథని డిపో మేనేజర్ శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని పట్టణంతో పాటు పలు గ్రామాల ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.కార్యక్రమంలో ప్రజలు ప్రయాణికులు తమ తమ సలహాలు, సూచనలు 732825923 నెంబర్లలో తెలపాలని ఆయన పేర్కొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

నవతెలంగాణ-మంథని



మంథని మండలం అక్కపెల్లి గ్రామానికి చెందిన పెయ్యల రాజేశ్వరి అనారోగ్య వైద్య చికిత్సకు సంబంధించిన రూ.75 వేల ఎల్‌వోసీ పత్రాన్ని మంత్రి శ్రీధర్ బాబు సహాయకులు అందజేశారు.

వన్యప్రాణులను వేటాడిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-ముత్తారం:



వన్యప్రాణులను వేటాడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మంథని ఫారెస్ట్ రేంజ్ అధికారి రమేష్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వన్య ప్రాణాలను వేటాడిన ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి కేతిరి అంజిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. వన్య ప్రాణాలైన రెండు కొండ గొర్రెలను వేటాడి వాటి మాంసాన్ని విక్రయించి, వాటికి సంబంధించిన తలలు, కాళ్లను ఫ్రిజ్‌లో భద్రపరచగా, పక్కా సమాచారం మేరకు ఫారెస్ట్ అధికారులు ముత్తారం పోలీసులతో కలిసి అతని ఇంటిలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అంజి ఇంట్లోని ఫ్రిజ్‌లో రెండు కొండ గొర్రెలకు సంబంధించిన తలలు, కాళ్లు లభ్యం కాగా, వాటిని స్వాధీనం చేసుకొని, అంజిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఎవరైనా వన్యప్రాణులకు హానీ కల్పించిన, వాటిని వేటాడిన చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నర్సయ్య, అధికారులు అఫ్జల్ అలీ, సోని కిరణ్, పవన్, ప్రదీప్, శ్రీకాంత్ ఉన్నారు.

2వ డివిజన్‌ను సందర్శించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:



రామగుండం కార్పొరేషన్ 2వ డివిజన్ అన్నపూర్ణ కాలనీలో సీపీఐ(ఎం) నాయకులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సెంట్ మ్యాథ్యూస్ స్కూల్ రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వేసినప్పటికీ పూర్తిస్థా యిలో గుంతలు పూడ్చలేదని, అలాగే చర్చికి వెళ్లే దారిలో చౌరస్తా వద్ద డ్రైనేజీ నీరు నిలిచిపోయి కాలనీవాసులు దుర్వాసన భరించలేకపోతున్నారని, చర్చికి ఎదురుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పని ప్రారంభించి మధ్యలోనే నిలిపి వేశారని, చాలా వీధుల్లో రోడ్లు చెడిపోయి గుంతలు ఏర్పడ్డాయని, మిషన్ భగీరథ పైప్ లైన్ ఉన్నప్పటికీ నీరు ఇవ్వడం లేదని, భాగ్యనగరం గోపయ్య ఇంటి ఏరియాలో రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉందని, వాహనాల రాకపోకలు కూడా ఇబ్బంది ఏర్పడుతుందని, వర్షాకాలంలో రోడ్డు మొత్తం నీరు నిండిపోయే పరిస్థితి ఉందని ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికా రులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, గుంటి నాగభూషణం, కె.రాజయ్య, ఎం.సాంబయ్య తదితరులున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వీణావాణికి చార్జి మెమో జారీ

నవతెలంగాణ-జూలపల్లి

వద్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుడిపాటి (ఊకంటి) వీణావాణికి విధుల నిర్లక్ష్యం, దుష్ప్రవర్తన వంటి పలు అభియోగాలపై పెద్దపల్లి జిల్లా విద్యాధికారి ఛార్జ్ మెమో జారీ చేశారని ఫిర్యాదుదారుడు అమరగాని ప్రదీప్ కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఛార్జ్ మెమో నకలు కాపీలను మీడియాకు విడుదల చేశారు. గత కొన్నేళ్లుగా గుడిపాటి వీణావాణి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై, ప్రభుత్వ ఉద్యోగిగా విధులను నిర్లక్ష్యం చేస్తూ, ప్రభుత్వధనాన్ని నిబంధనలకు విరుద్ధంగా దోచుకుంటూ, చేస్తున్న అవినీతి అక్రమాలపై తాను పోరాడుతున్నానని పేర్కొన్నారు. తనపైన వీణవాణి రాళ్లతో దాడి చేసిన విషయమై ఆధారాలతో సహా ఫిర్యాదు చేయగా విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఇంటి అద్దె పొందుతున్న విషయమై కూడా వీణావాణికి జిల్లా విద్యాధికారి చార్జ్ మెమో ఇచ్చారన్నారు. పది రోజుల్లో ఈ విషయాలపై లిఖితపూర్వక సంజాయిషీ ఇవ్వాలని, తదుపరి శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఆ మెమోలో పేర్కొన్నారని తెలిపారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ద్వారా కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమారస్వామి

నవతెలంగాణ-గోదావరిఖని:



వినతి అందజేస్తున్న వేల్పుల కుమారస్వామి

సింగరేణి ఆర్జీ 1లోని సివిల్ విభాగం సెక్టార్ 2లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ద్వారా జీరో అకౌంట్ ఖాతా ఓపెన్ చేసి దాని ద్వారా కార్మికులకు జీతాలు చెల్లించాలని సిఐటియు అనుబంధ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంబంధిత కాంట్రాక్టర్ రమేష్‌కు సిఐటియు నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులు గతంలో ప్రమాదవశాత్తు మరణించినప్పుడు వారి కుటుంబాలకు సింగరేణి యాజమాన్యం గానీ, కాంట్రాక్టర్లు గానీ తగిన నష్టపరిహారం ఇచ్చేవారు కాదని అన్నారు. నామ మాత్రంగా నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్న పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితులు మారాలని సిఐటియు అనేక సందర్భాల్లో మృతదేహాలను పట్టుకుని కుటుంబ సభ్యులతో రాత్రి, పగలు తేడా లేకుండా ఆసుపత్రుల ముందు, జీఎం ముందు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి, బంద్ పిలుపులు ఇచ్చి అధికారులతో, కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి మరణించిన కాంట్రాక్టు కార్మికుని కుటుంబానికి నష్ట పరిహారం ఇప్పించిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. ఈ పరిస్థితులు మారాలని, పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్నట్లుగా నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు చేసిన పోరాట ఫలితంగా సింగరేణి యాజమాన్యం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు అధికారులతో చర్చించగా, అందుకు బ్యాంకు అధికారులు తమ బ్యాంకులో ఖాతా తీసుకున్న కాంట్రాక్టు కార్మికుడు ప్రమాదంలో మరణించిన యెడల అతని కుటుంబానికి 30 లక్షలు రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వడానికి బ్యాంకు అధికారులు అంగీకరించి సుమారు సంవత్సరం గడుస్తున్నా ఆర్జీ 1లో కాంట్రాక్టర్లు మాత్రం ఇంకా బ్యాంకు ఖాతాలు ప్రారంభించి, దాని ద్వారా జీతాలు చెల్లించడం లేదని అన్నారు. కాంట్రాక్టర్లు బ్యాంకు ఖాతాలు ప్రారంభించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఒకవేళ కార్మికునికి ఏదైనా నష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అన్నారు. ఇప్పటికైన కాంట్రాక్టర్లు కార్మికుల, వారి కుటుంబ సభ్యుల శ్రేయస్సు కోసం ఆలోచించి వెంటనే హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ద్వారా జీరో అకౌంట్ ఖాతా ఓపెన్ చేసి దాని ద్వారా జీతాలు చెల్లించాలని కాంట్రాక్టర్, అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు జూపాక సాగర్, మధు, సారయ్య, శంకరయ్య, గౌరయ్య, వెంకటేష్, వినయ్, రాజేష్, వేణు, అనిల్, తదితరులున్నారు.

మాజీ ఉపసర్పంచ్ సతీష్‌కు పరామర్శ

నవతెలంగాణ-మంథని

మాజీ ఉపసర్పంచ్,హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీష్ తండ్రి ఇటీవల మృతి చెందగా గురువారం పెద్దపల్లి మాజీ ఎంపీ డాక్టర్ చేలిమల సుగుణ కుమారి పరామర్శించారు. శంకరయ్య మృతికి గల కారణాలను ఆమె అడిగి తెలుసుకుని,చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె వెంట డాక్టర్ మారుపాక రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్న మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్

నవతెలంగాణ-గోదావరిఖని:



రామగుండంను అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బిఆర్ఎస్ నేత కౌశిక హరి అడుగడుగునా రాక్షసుల్లా అడ్డు పడుతున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, గోదావరిఖని పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓ వైపు మాజీ ఎమ్మెల్యే చందర్, మరో వైపు బిఆర్ఎస్ నేత కౌశిక హరి అవంతరాలు సృష్టిస్తూ ప్రజలను గంధరగోళానికి గురి చేయాలని చూస్తున్నారని, తోడుదొంగలిద్దరూ కలిసి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తే నమ్మడానికి ఎవ్వరూ లేరని వారిద్దరిని ఉద్దేశించి విమర్శించారు. ఇప్పటికే ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఈ ప్రాంతంలో సబ్ రిజిస్టర్ ఆఫీస్, ఇంటిగ్రేటెడ్ హాల్, డివిజన్‌కు ఒక కోటి నిధులను తెప్పించారని అన్నారు. అలాగే సింగరేణి యాజమాన్యాన్ని ఒప్పించి 15 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పూనుకున్నారని తెలిపారు. ప్రజలకు అవసరమైన పనులు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు నోటికి వచ్చినట్టు మాట్లాడడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు దీటి బాలరాజు తదితరులున్నారు.

15 నుంచి ఏఐ ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన

విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

నవతెలంగాణ-పెద్దపల్లి



మార్చి 15 నుంచి జిల్లాలలో ఎంపిక చేసిన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ఏఐను వినియోగిస్తూ సులభతరంగా విద్యాబోధన చేసేందుకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ కార్య దర్శి యోగితా రాణా అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణ, విద్యాశాఖ సంచాలకుల నరసింహారెడ్డి తో కలిసి ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధన పై జిల్లా కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ మాట్లాడుతూ, ఫిబ్రవరి నెలలో సర్కార్ బడిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద 6 జిల్లాలో ప్రారంభించామని, అది మంచి ఫలితాలు ఇచ్చినందున రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని మార్చి 15 నుంచి ప్రారంబిస్తున్నామని అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పీఎం షేక్, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

సీఎంవో పోస్టుకు కాంట్రాక్టు పద్ధతి రద్దు చేయాలి

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణిలో ప్రైవేటీకరణకు ఆజ్యం పోసే విధంగా కాంట్రాక్ట్ బేసిక్‌లో ఉన్నత పదవుల్లో (చీఫ్ మెడికల్ ఆఫీసర్) అధికారులను నియమించే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, సిఎంఓ పోస్టుకు కాంట్రాక్టు పద్ధతి రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగారపు లింగమూర్తి డిమాండ్ చేశారు. గతంలో కూడా సింగరేణిలో ప్రధాన విభాగంలో ఒక దళిత వర్గానికి చెందిన అధికారి బాధ్యతలు చేపట్టే నేపథ్యంలో ఆ విభాగాన్ని ఐదు విభాగాలుగా విభజించిన చరిత్ర సింగరేణికి ఉందని అలాంటి వివక్షతో కూడిన చర్యనే చీఫ్ మెడికల్ ఆఫీసర్ పోస్టును ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే విధంగా చేపడుతుందని భావించవలసి వస్తుందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం తక్షణమే ఇలాంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనియెడల కలిసివచ్చే దళిత సంఘాలు, ఇతర కార్మిక సంఘాల నాయకులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మంథని

మన సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచస్థాయిలో చాటిన ఘనత కల్వకుంట్ల కవితక్కకే దక్కుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు.మాజీ ఎంపీ,మాజీ ఎమ్మెల్సీ,జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకల్లో బాగంగా గురువారం మంథని పట్టణంలోని రాజగృహాలో వేడుకలునిర్వహించారు.ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కూతురు అయినా ఒక సాధారణ నాయకురాలిగా కవితక్క తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుందన్నారు. ప్రతి గ్రామంలో బతుకమ్మ ఆటలు ఆడుకునేవారని, కానీ జాగృతి సంస్థ ద్వారా కవితక్క అంగరంగ వైభవంగా బతుకమ్మసంబరాలు నిర్వహించి విశిష్టతను చాటారని,తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మకు పునర్జీవం ఇచ్చారని ఆయన కొనియాడారు.

విద్యా ప్రమాణాలు పెంచడంపై శ్రద్ధ పెట్టాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నవతెలంగాణ-పెద్దపల్లి



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచడం పై కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మంథని మండలం ప్రాథమిక, ప్రాథమికోన్నత హెడ్మాస్టర్లతో ఎఫ్ఎల్ఎన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పాఠశాలల సమర్థ నిర్వహణ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుల పటిష్ఠ పర్యవేక్షణతోనే సాధ్యమవుతుందని అన్నారు.పాఠశాలల్లో గుణాత్మక విద్య మెరుగుపరచడానికి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుల పర్యవేక్షణ గురించి కీలకమైన సూచనలు కలెక్టర్ అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలుగు ఇంగ్లీష్ లలో రాసి, చదివే సామర్థ్యాలను పెంచాలని, గణితం లో కనీస సామర్థ్యం ఉండేలా దృష్టి సారించాలని అన్నారు. మండలంలో కొన్ని పాఠశాలలు చక్కగా పనిచేస్తున్నాయని అభినందించారు. విద్యా సంవత్సరం ముగిసే లోగా ప్రతి పాఠశాలలో 60 నుండి 80% వరకు ప్రతి విద్యార్థికి చదవడం రాయడంతో పాటు గణితంలో కనీస సామర్థ్యాలు పెంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పిఎం షేక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:



తెలంగాణ శాసన సభ బిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో శాసన మండలి సభ్యురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పూలబొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకంటి చందర్ ఆకాంక్షించారు.

చావా ఉచిత చిత్ర ప్రదర్శన

నవతెలంగాణ-గోదావరిఖని:

మనకు అనేక విధాలుగా స్ఫూర్తినిచ్చే గొప్ప ఉదాహరణ ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం అని బిజెపి రామగుండం ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి అన్నారు. బిజెపి రామగుండం ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో గోదావరిఖని ఊర్వశి థియేటర్‌లో గురువారం ఉచితంగా చావా చిత్ర ప్రదర్శనను నిర్వహించారు. ముందుగా గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి ఊర్వశి థియేటర్ వరకు బిజెపి నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. ర్యాలీ అనంతరం ఊర్వశి థియేటర్‌లో చావా చిత్రాన్ని ఆమె కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సినిమా ద్వారా యువతకు ఆత్మవిశ్వాసం, ధైర్యం కలిగేలా స్ఫూర్తిని అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పిడుగు కష్ణ, తోట కుమారస్వామి, మండల అధ్యక్షులు కోడూరి రమేష్, తడగొండ నర్సయ్య, సిలువేరు అంజి, భాస్కర్, అందే రాజ్ కుమార్ చారి, బండారి శ్యామ్ కుమార్, పంగ రవి, మామిడి వీరేశం, జక్కుల ప్రవీణ్, జక్కన బాలు, పద్మ, అపర్ణ, పంగ రవి, జనగామ శివరాం, మెరుగు శ్రీనివాస్, తిరుపతి, బుంగ మహేష్ తదితరులున్నారు.

సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నిరసన

నవతెలంగాణ-గోదావరిఖని:

సభ్యత లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని పాలించడం మన దురదృష్టమని, రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదని, చీప్ మినిస్టర్ అని బిఆర్ఎస్ నేత కౌశిక హరి, టిబిజికెఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రాంమ్మూర్తి విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డి మాజీ సిఎం కెసిఆర్‌పై మాట్లాడిన తీరును వ్యతిరేకిస్తూ గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి చావు నోట్లో తలపెట్టి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను ప్రత్యేక రాష్ట్రాని నెరవేర్చిన ఉద్యమ నేత, పదేళ్ల ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని బంగారుమయంగా తీర్చిదిద్దిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుని సిఎం రేవంత్ రెడ్డి తన వక్ర బుద్ధితో ఇప్పుడు స్ట్రక్చర్ మీదున్నాడు...రేపు మార్చరీకి పోతాడని అనడాన్ని తీవ్రంగా ఖండించారు. ఏ మనిషి కూడా సాటి మనిషిని అనని దుర్మార్గపు మాటలు రేవంత్ రెడ్డి అన్నారని, కాంగ్రెస్ పార్టీ డిఎన్ఎలోనే సంస్కారం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి శంకర్, మద్దికుంట శంకర్, పున్నం శశి కుమార్, నూనె కొమరయ్య, చెల్పూరి సతీష్, బొగ్గుల సాయి, నిమ్మరాజుల రవి, గడపురం కల్యాణ్ రాజు, చల్ల రవీందర్ రెడ్డి, బొడ్డు సురేందర్, గోపి సురేష్, ఉప్పు సాయి పాల్గొన్నారు.

ముందస్తుగా హోలీ వేడుకలు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో గల శార్వాణి విద్యానికేతన్‌లో గురువారం ముందస్తు హోలీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రంగులు జల్లుకుంటూ హోలీ వేడుకలను జరుపుకున్నారు. హెచ్ఎం శ్రీనివాస్ విద్యార్థులకు హోలీ పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

సుల్తానాబాద్-నవతెలంగాణ



కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు టి.కే.శ్రీనివాస్ కోరారు. రామాయణాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించిన కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను గురువారం సుల్తానాబాద్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు టీ.కే. శ్రీనివాస్ మాట్లాడుతూ రామాయణాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించిన గొప్ప కవయిత్రి, కుమ్మర కుల ఆడపడుచు కవయిత్రి మొల్లమాంబ 16వ శతాబ్దం కు చెందినదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నల్లవెల్లి ప్రభాకర్, టి.కే. రమేష్,టి.కే.సాయిలు,టి.కే.లచ్చయ్య, టి.కే. రాజేశం, టీకే. సత్యనారాయణ,నాంపల్లి రవీందర్, నాంపల్లి విజయ్ కుమార్, విజ్జగిరి సంజువ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ట్వినింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమం

నవతెలంగాణ-ఓదెల

ట్వినింగ్ అఫ్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పొత్కపల్లిలో చాలా అట్టహాసంగా, కన్నుల పండుగగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పొత్కపల్లి కాంప్లెక్స్ పరిధిలోని యూపీఎస్ రూప్ నారాయణపేట, యుపిఎస్ మడక, యుపిఎస్ ఇందుర్తి, యూపీఎస్ గూడెం, సీపీఎస్ పొత్కపల్లి, జీపీఎస్ పొత్కపల్లి, ఎంపీపీఎస్ గొల్లపల్లి, స్థానిక వశిష్ఠ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుండి సుమారుగా 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పొత్కపల్లిలో చదువుతున్న విద్యార్థులు పాఠశాలలో ఉన్నటువంటి వివిధ సౌకర్యాల గురించి ఇతర పాఠశాలల విద్యార్థులకు వివరించారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, ఐఎఫ్పి బోర్డ్స్, సైన్స్ ల్యాబ్, స్పోర్ట్స్ రూం, లైబ్రరీ తదితర సౌకర్యం ల గురించి పూర్తిగా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పొత్కపల్లి లో చదివే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం కార్పోరేట్ స్థాయి సౌకర్యాలను కల్పిస్తుందని, సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థిని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ఇక్కడే చదువుకొని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాష బోయిన సాంబయ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు,సంబంధిత అతిథి పాఠశాలల ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపు కౌంటర్లు

మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-కోల్‌సిటీ

మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ప్రజలు పన్నులు చెల్లించడానికి వీలుగా ఈ నెలలో అన్ని సెలవు దినాల్లోనూ నగర పాలకసంస్థ కార్యాలయంలోని కౌంటర్లు యధాతథంగా పని చేస్తాయని అదనపు కలెక్టర్,రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ అరుణ శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈ నెల 31 లోగా ఆస్తి పన్నులు, నల్లాబిల్లులు, లైసెన్స్ రుసుంలు వార్డు అధికారుల వద్ద చెల్లించే సౌలభ్యంతో పాటు మీ సేవా కేంద్రాల్లో, మున్సిపల్ వెబ్ సైట్ ఈ మున్సిపల్ తెలంగాణ.గవ్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ డిజిటల్ పేమెంట్ ఇంటి వద్ద నుండి కూడా చేయవచ్చని తెలిపారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన సింగరేణి విద్యార్థులు

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ

ఇంటర్ నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్ పరీక్షలలో ఆర్జీ-2 సింగరేణి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు.2024 -25 విద్యా సంవత్సరంలో యూనిఫైడ్ కౌన్సిల్ వారి చేత నిర్వహించిన ఈ పరీక్షలో 533 మంది విద్యార్థులు పాల్గొనగా సెక్టర్-3 కి చెందిన 8 మంది గోల్డ్ మెడల్స్ సాధించారు.ఈ సందర్భంగా వారిని ఏరియా జీఎం బి.వెంకటయ్య ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ, సెక్రటరీ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది నిరంతరం ప్రతి పాఠశాలలో రాబోయే సంవత్స రాలలో కూడా కొనసాగుతుందని అలాగే క్రమశిక్షణ తో కూడిన విద్యను అందించాలని సూచించారు.

ప్రగతి పాఠశాలలో ఓపెన్ హౌస్ డే

నవతెలంగాణ-రామగిరి



రామగిరి మండలం సెంటనరీ కాలనీలోని ప్రగతి పాఠశాలలో ఓపెన్ హౌస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అబాకస్ వరల్డ్ బెస్ట్ టీచర్, గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత ఏ. గంగాధర్ ఓపెన్ హౌస్ డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని తమ పిల్లల యొక్క విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి,ఇన్‌చార్జీ రాము,టీచర్స్ ఇందిరా,అనిస,కోమలత, పాల్గొన్నారు.

జేఎన్టీయూ వైస్ ఛాన్స్‌లర్ దంపతులకు సన్మానం

నవ తెలంగాణ-రామగిరి



జేఎన్టీయూ హైద్రాబాద్ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ టి.కిషన్ కుమార్ రెడ్డి గురువారం మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పర్యటించారు. ఇటీవలనే విసిగా పదవీ బాధ్యతలు స్వీకరిం చిన కిషన్‌కుమా ర్‌రెడ్డి సతీమణి సుజనతో కలిసి మొట్టమొదటిసారి మంథని కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ వీసీ దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడామైదానంలో ఇటీవల నిర్మించిన బాస్కెట్బాల్ కోర్టును ప్రారంభించారు. క్రీడామైదానాన్ని తిలకించి కళాశాల క్రీడాకారులతో మాట్లాడారు. క్రీడామైదానాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలతో పాటు సమస్యలు తీరుస్తానన్నారు. విద్యార్థులకు ప్లేస్మెంట్స్ వచ్చేలా పలు చర్యలు తీసుకుంటానన్నారు. కళాశాల ఆవరణలో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా వీసీ దంపతులను కళాశాల యాజమాన్యం గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జీ లైబ్రేరియన్ రమణ, జూనియర్ అసిస్టెంట్లు, కాంట్రాక్టు అధ్యాపకులు, ఔట్సోర్సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తె మట్టెలు అందజేత



నవతెలంగాణ-గోదావరిఖని:

ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీలో నివాసముండే నిరుపేద కుటుంబానికి చెందిన యువతి హారిక వివాహం జనగామలోని శ్రీ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో గురువారం జరిగింది. ఆ యువతి వివాహానికి గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి తిమ్మయ్య క్రాంతి కుమార్ రెడ్డి పుస్తె మట్టెలు, పెళ్లి వస్త్రాలను అందజేశారు. పుస్తె మట్టెలు, పెళ్లి బట్టలు అందజేసిన క్రాంతి కుమార్ రెడ్డికి యువతి హారిక, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

9

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కరీంనగర్

శుక్రవారం | మార్చి 14, 2025 | www.navatelangana.com

ఎస్‌యూలో ముగిసిన సదస్సు..

నవతెలంగాణ - కరీంనగర్



శాతవాహన విశ్వ విద్యాలయంలో రెండు రోజుల 'డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్-ఎక్కి క్యాటలిస్ట్ ఇన్ సస్టైనబుల్ బిజినెస్ డెవలప్మెంట్' సెమినార్ ముగింపు సభ గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ యు.ఉమేష్ కుమార్, విశిష్ట అతిథులుగా ప్రొఫెసర్ కే.ప్రతాప్‌రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి, ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ ఐసీఎస్-ఎస్ఆర్- ఎస్ఆర్సీ హైదరాబాద్, విశిష్ట అతిథులు ప్రొఫెసర్ జాస్తి రవి రిజిస్టర్ శాతవాహన యూనివర్సిటీ, ప్రొఫెసర్ చెన్నప్ప రిజిస్టర్ పాలమూరు విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ ఆకుల రవి డీన్ కామర్స్ డిపార్ట్మెంట్ శాతవాహన విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ ఇన్ కామర్స్ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ డి.హరికాంత్ మాట్లాడుతూ.. రెండు రోజుల సెమినార్‌కి మొత్తం 114 రీసెర్చ్ పేపర్స్ పంపించారని, అందులో 74 పేపర్ ప్రెసెంటర్స్ తమ రీసెర్చ్ పేపర్స్‌ని వివరిస్తూ వివిధ అంశాలపై రీసెర్చ్ వివరణను ఇస్తూ సమాజానికి ఉపయోగపడే అంశాల గురించి చర్చించారని అన్నారు. ముఖ్యంగా 10మంది ఎంకామ్, ఎంబీ విద్యార్థులు రీసెర్చ్ పేపర్లను ప్రదర్శించారని హర్షం వ్యక్తం చేశారు. ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి డిపార్ట్‌మెంట్ కూడా ఇలాంటి సెమినార్లు నిర్వహించడానికి ముందుకు రావాలని, అప్పుడే విద్యార్థులకు బయట ప్రపంచంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కలుగుతుంద న్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడున్న ప్రస్తుత సమయంలో సెమినార్ అంశం 'డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్' అనేది చాలా ముఖ్యపాత్ర పోషిస్తుందని, ప్రజలకు దీనిపై చాలా అవగాహన, దానిలో ఉన్న లోపాలను కూడా సవరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలకి ఐసియస్సార్ తరపున సహాయ సహకారాలు ఎప్పుడూ అందించడానికి ముందు ఉంటామని, విద్యార్థులకు ఇది ఎంతో సహాయపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈ.మనోహర్, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎన్వీ శ్రీరంగ ప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ బి.నరేష్, డాక్టర్ టి.కృష్ణ కుమార్, సావిత్రి, అధ్యాపకులు, పేపర్ ప్రెసెంటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అవగాహన పార్కుతో ప్రమాదాల నివారణ

కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ - తిమ్మాపూర్



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ట్రాఫిక్ పార్కు సందర్శించడం ద్వారా పిల్లలకు అవగాహనతో పాటు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో గల పిల్లల ట్రాఫిక్ అవగాహన పార్కును జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి గురువారం సందర్శించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ పార్కులో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ ట్రాఫిక్ పార్కు సందర్శించేలా చూడాలని తెలిపారు. చిన్నప్పటి నుండే ట్రాఫిక్ అవగాహన వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. అనంతరం ఇక్కడ ఉన్న క్యాంటీన్‌ని పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా రవాణా శాఖ కమిషనర్ పురుషోత్తం, డిటివో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవిఐ రవికుమార్, తహసీల్దార్ విజయ్, ఎంపీడీవో విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు..

వ్యవసాయ కార్మిక సంఘం

జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు

నవతెలంగాణ - శంకరపట్నం



రైతులందరికీ రుణమాఫీ చేయాలని, వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేసి ఉపాధి హామీ కూలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో కార్యక్రమం వాయిదా పడిందన్నారు. అయినా పోలీసు యంత్రాంగం గురువారం నాయకుల ఇళ్లలోకి వెళ్లి ముందస్తుగా అక్రమ అరెస్టు చేయడం సరికాదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు తీవ్రంగా ఖండించారు.

జాతీయ సదస్సు కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ - హుజురాబాద్ టౌన్



హుజురాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఈ నెల 27, 28 తేదీలలో కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాదేవి, సదస్సు సమన్వయకర్త డాక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సు కరపత్రాన్ని శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య యు.ఉమేశ్ కుమార్ తన చాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు.

కేసీఆర్‌కు వెంటనే సీఎం క్షమాపణలు చెప్పాలి

బీఆర్ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణారావు

నవతెలంగాణ - మానకొండూర్



మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చెసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణారావు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలన్నారు. సమావేశంలో నాయకులు శేఖర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, పంజాల శ్రీనివాస్ గౌడ్, శాతరాజు యాదగిరి, పిట్టల మధు, మురళీ, గడ్డం సంపత్, కిరణ్, సందీప్, వెంకటస్వామి, అంజి పాల్గొన్నారు.

అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడుగా పొన్నం రవిచంద్ర

నవతెలంగాణ - కరీంనగర్



నేపాల్‌లో ఈ నెల 19 నుండి 25 వరకు జరగనున్న ఐఎఫ్ఎఫ్ఎస్ డాన్ క్విక్సోట్ అంతర్జాతీయ 8వ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడుగా ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పొన్నం రవిచంద్ర నియమితులయ్యారు. వారం రోజులపాటు నేపాల్ దేశంలోని ఖాట్మండులో జరగనున్న ఈ చిత్రోత్సవానికి రవిచంద్రతో పాటు నేపాల్‌కు చెందిన రక్షయ సింగ్ రాణా, స్పెయిన్ దేశానికి చెందిన జోవాన్ మార్క్ మొంటియల్ దీయాజ్‌ను నియమించినట్లు ఫెస్టివల్ చైర్ పర్సన్ కె.పి. పాఠక్ తెలిపారు.

ములకనూరు మోడల్ స్కూల్‌లో 'ఉడాన్ విక్టరీ వైబ్స్'



నవతెలంగాణ - చిగురుమామిడి

మండలంలోని ములకనూరు మోడల్ స్కూల్‌లో 'ఉడాన్ - విక్టరీ వైబ్స్' పేరుతో 10వ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపే ప్రత్యేక కార్యక్రమాన్ని 9వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో 10వ తరగతి ఎంతో కీలకమైనదని, మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

చివరి ఆయాకట్టువరకు నీరు అందించాలి

నవతెలంగాణ - వీణవంక



వీణవంక మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో చివరి ఆయకట్టు వరకు నీరు అందటం లేదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసినటువంటి పంట, ఎండిపోయే కాలం వచ్చిందని, పెట్టిన పెట్టుబడి రావడం లేదని, నీళ్ళు రాకుంటే చావు దిక్కని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పంట చివరి దశలో ఉన్నటువంటి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోతరవేన సతీష్, శ్రీను, రాజు, చంద్రమౌళి, కిషన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అజ సమ్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



నవతెలంగాణ - హుజూరాబాద్ టౌన్

హుజూరాబాద్ మున్సిపాలిటీలో గురువారం 5వ, 19వ వార్డులో తడి చెత్త, పొడి చెత్త విభజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పాల్గొని ప్రజలకు చెత్త సేకరణ, విభజన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా 5 వార్డ్ మాజీ కౌన్సిలర్ అపరాధ ముత్యం రాజు కమిషనర్ సమ్మయ్యను సన్మానించారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలసిన జేపసి నాయకులు

నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ కే.సమ్మయ్యను జేఏసీ ప్రతినిధులు గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని సమస్యల గురించి వివరించారు. సమస్యలను తెలుసుకున్న కమిషనర్ త్వరలోనే వాటిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హుజురాబాద్ జేఏసి చైర్మన్ ఆవునూరి సమ్మయ్య కన్వీనర్ వేల్పుల రత్నం, నాయకులు పొడిశెట్టి వెంకటరాజం, పులి జగన్నాథం ఉన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

నవతెలంగాణ - హుజురాబాద్

తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం హుజురాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతోత్సవ వేడుకలను గురువారం ఘనంగా జరిపారు. రాష్ట్ర కుమ్మరి సంఘం ఉపాధ్యక్షుడు నాంపల్లి ప్రభాకర్ ప్రజాపతి హాజరై మాట్లాడారు. గొల్లపల్లి రవీందర్ ప్రజాపతి, మోతే జగన్ ప్రజాపతి, మందారం నరేష్ ప్రజాపతి, మోతే రవి ప్రజాపతి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అల్ఫోర్స్ హోలీ సంబురాలు

నవతెలంగాణ - కరీంనగర్



రంగుల పండుగ హోలీని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలకు విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చిట్యాలపెల్లిలో ఉచిత హెల్త్ క్యాంప్

నవతెలంగాణ - చొప్పదండి



మండలంలోని చిట్యాలపెల్లిలో సన్‌రైజ్ హాస్పిటల్ సౌజన్యంతో క్యాంపు మేనేజర్ కొత్తూరి రాజేందర్, కోఆర్డినేటర్ సతీష్, మాజీ సర్పంచ్ గుడిపాక సురేష్ ఆధ్వర్యంలో గురువారం మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. డాక్టర్లు సాయికిరణ్, అఖిల 120మందికి ఈసీజీ, షుగర్, వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరవధిక దీక్షలు

నవతెలంగాణ - మానకొండూర్

మండలంకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక దీక్షలు గురువారం 2వ రోజు కొనసాగాయి. మండల ఇన్‌చార్జి పాముల రమణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం వెంటనే అమలు చేసి, ఇటీవల వెలువడిన ఉద్యోగ ఫలితాలలో మాదిగల వాటా 11శాతం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కపెల్లి పౌల్, నాయకులు కనకం సమ్మయ్య, జిల్లాల శ్రీనివాస్, ఎనగండుల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ - గంగాధర

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత చేపట్టకుండా ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ గంగాధర తహసీల్దార్ ఆఫీస్ ముందు ఎమ్మార్పీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ నిరసన దీక్షలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కూర్చుని మద్దతు ప్రకటించారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దోమకొండ శ్రీనివాస్, మండల ఇంచార్జి బెజ్జంకి నరేష్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు గంగాధర కొమురయ్య, మండల గౌరవ అధ్యక్షుడు గంగాధర మల్లేశం, అంబేద్కర్ సంఘం నాయకులు ద్యావ శ్రీనివాస్, లింగాల దుర్గయ్య, న్యాతరి శివశంకర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - శంకరపట్నం

ఎస్సీ వర్గీకరణ కోసం శంకరపట్నం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన దీక్ష గురువారం 2వ రోజు కొనసాగింది. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్ మాదిగ, మండల ఉపాధ్యక్షుడు ఆడెపు భూమయ్య మాదిగ, నాయకులు కనకం శంకర్, దాసరపు భద్రయ్య బొజ్జ రవి, రామగిరి భూమయ్య, సముద్రాల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు

పట్టణ సీఐ వరగంటి రవి

నవతెలంగాణ - జమ్మికుంట



పట్టణ, మండల ప్రజలకు హోలీ, రంజాన్ పండుగ సందర్భంగా పట్టణ సీఐ వరగంటి రవి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో స్థానికులతో, బిర్యానీ పాయింట్ సెంటర్ వారితో సమావేశం ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటల వరకు బిర్యాని పాయింట్ మూసివేయాలని, హోలీ రోజున వాహనాలపై ఇద్దరి కంటే ఎక్కువ వెళ్లకూడదని అన్నారు. వాహనాలపై వెళ్లే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉండాలని, ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో హోలీ సంబరాలు జరుపుకోవాలని సూచించారు.

బేతిగల్‌లో వన భోజనాలు

నవతెలంగాణ - వీణవంక : వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో గ్రామ దేవతల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈ నెల 3 నుంచి 6 వరకు ఘనంగా నిర్వహించారు. అనంతరం గురువారం బేతిగల్ గ్రామస్తులు వనభోజనాలుకు తరలి వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి వంట అండుకొని, తిని ఇండ్లకు వెళ్లారు.

విగ్రహాల ఆవిష్కరణకు ఎమ్మెల్యే చొరవ చూపాలి

మండల జాయింట్ యాక్షన్ కమిటీ

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండల కేంద్రంలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు ఎమ్మెల్యే చొరవ చూపాలని మండల జెపిసి నాయకులు అన్నారు. పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కుల సంఘాలతో కలిసి చేస్తున్న రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నది. ఈ దీక్షలకు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులడ రెడ్డి గాని రాజు, బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నం లక్ష్మణ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మెదడు వ్యాధి బారినపడి కోలుకున్న రోగి

- స్ట్రెప్టోకోకస్ బాక్టీరియా ముప్పు
- జర్నలిస్టులకు ఉచిత ఓపి సేవలు
- ప్రముఖ న్యూరోఫిజిషయన్ మోహన్‌కృష్ణ

నవతెలంగాణ - కరీంనగర్



ఓ అరుదైన మెదడు వ్యాధి సోకడంతో జ్వరం, తలనొప్పి, తలతిరగడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలతో బాధపడుతన్న పెద్దపల్లి జిల్లాకు చెందిన 41 ఏళ్ల రమేష్ తమ యశోద ఆస్పత్రిలో చేరారని.. అత్యవసర చికిత్సతో రోగి పూర్తి ఆరోగ్యాన్ని తిరిగి పొందారని యశోద హాస్పిటల్ ప్రముఖ న్యూరో ఫిజిషియన్ మోహనకృష్ణ, క్రిటికల్ కేర్ హెచ్‌ఓడి కే.సీ.మిశ్ర తెలిపారు. గురువారం నగరంలోని యశోద హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రోగిపై నిర్వహించిన ఎంఆర్ఐ స్కాన్‌లో మెదడు కుడి వైపున తీవ్రమైన గడ్డకట్టడంతో పాటు పరీక్షల్లో ప్రోటీన్ స్థాయి పెరిగి, గ్లూకోజ్ తగ్గినట్లు గుర్తించినట్లు తెలిపారు.మెదడు పనితీరును తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉండటంతో, వెంటనే యాంటీబయాటిక్స్, యాంటీ ఎపిలెప్టిక్స్ తదితర అత్యవసర చికిత్సలు అందించినట్లు తెలిపారు. తమ వైద్య బృందం అప్రమత్తంగా వ్యవహరించి సమయానికి సరైన చికిత్స అందించడంతో రోగి కోలుకున్నాడని తెలిపారు. తీవ్రమైన మెనింగోఎంటెఫాలిటిస్ ప్రాణాంతకం కావొచ్చు. అయితే, దీనిని సమయానికి గుర్తించి, సముచిత చికిత్స అందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని స్పష్టం చేశారు. స్ట్రెప్టోకోకస్ అగలక్టియే బాక్టీరియా సాధారణంగా గర్భిణులు, నవజాత శిశువులను ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. కానీ, తక్కువ రోగనిరోధక శక్తి ఉన్న వ్యక్తులే కాకుండా, ఆరోగ్యంగా కనిపించే యువకులను కూడా ఈ బ్యాక్టీరియా లక్ష్యంగా చేసుకోవచ్చని హెచ్చరించారు. స్వల్పంగా అనిపించిన ఆరోగ్య సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా, అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సలహా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రోగి బంధువులు మాట్లాడుతూ రమేష్ పరిస్థితిని చూసి కరీంనగర్, పెద్దపల్లిలో ఏ డాక్టర్ ముందుకురాలేదని వెంటనే హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తీసుకెళ్లామని అక్కడి వైద్య బృందం, మోహనకృష్ణ, మిశ్రా వైద్యులు తమ సమస్యను వెంటనే గుర్తించి మెరుగైన వైద్యం అందించడం ద్వారా తమ భర్త కొత్త జీవితాన్ని గడుపుతున్నట్లు తెలిపారు. అనంతరం కరీంనగర్ యశోద బ్రాంచ్ నిర్వహకులు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఉచిత ఓపి సేవలు అందివ్వనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతోనే చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధి

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్

నవతెలంగాణ - చొప్పదండి



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతోనే చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రవి శంకర్ రైతుల గురించి ఒక్కరోజు అయినా పట్టించుకున్న చరిత్ర లేదని మండిపడ్డారు. నారాయణపూర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయించేందుకు తాము ధర్నాలు చేసినప్పుడే స్పందించారని.. కానీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైతుల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన నాయకత్వంలో ఏ రైతు నీటి కొరత సమస్యతో బాధపడాల్సిన అవసరం లేకుండా సమయానికి నీరు విడుదల చేయబడుతోందని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని అన్నారు.

'వ్యక్తిగత ఆరోపణలు మానుకోవాలి'

నవతెలంగాణ - మానకొండూర్

కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు విసిరిన సవాల్‌ను స్వీకరించి వారు నిర్దేశించిన సమయానికి వచ్చి కొంత సేపు వేచి ఉన్నామని, సవాల్ విసిరిన కాంగ్రెస్ నాయకులు రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తన 25 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఏనాడూ ఎవరిపై వ్యక్తిగత ఆరోపణలు చేయలేదన్నారు. కేవలం ఎమ్మెల్యే మెప్పు కోసం కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయనవెంట నాయకులు శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, మధు, సంపత్, కిరణ్, సందీప్ తదితరులున్నారు.

ఘనంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని మొగిలిపాలెం గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు,పట్టు వస్త్రాలను ఆలయ ధర్మకర్తలు సమర్పించారు. అనంతరం అన్నప్రాసద కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ మొరపల్లి సుస్మితరమణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కొమురయ్య, వసంతరావు, ఆగమరావ్, సతీష్‌రెడ్డి, సురేష్ రెడ్డి, పాశం అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా పాడ్లు పంపిణీ



నవతెలంగాణ - తిమ్మాపూర్ : విద్యార్థులు ఇష్టపడి చదవాలని బీఆర్ఎస్ పార్టీ తిమ్మాపూర్ మండలం అధ్యక్షులడ, నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ రావుల రమేష్ అన్నారు. 'రమేష్ అన్న చిరుకానుక' పేరుతో తిమ్మాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు పరీక్షలు రాయడానికి ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెట్టం రమేష్, నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మానేరు పాఠశాల వార్షికోత్సవం..

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న అనంతరెడ్డి

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు గ్రామంలోని మానేరు ఉన్నత పాఠశాల 4వ వార్షికోత్సవం గురువారం పూడూరు గ్రామంలోని ఎల్కే గార్డెన్స్‌లో అట్టహాసంగా జరిగింది. పాఠశాల విద్యార్థుల కోలాహలం మధ్య దరోహర 2025 పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, కరీంనగర్ ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ..విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మానేరు విద్యాసంస్థలు దోహదపడుతాయన్నారు. కొడిమ్యాల మండలం గోపాల్ రావ్ పేట గ్రామంలో పుట్టిన తాను విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధనను అందించాలనే ఉద్దేశ్యంతో పూడూరు గ్రామంలో అత్యున్నత ప్రమాణాలతో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవంతంగా నాలుగు వసంతాలు పూర్తి చేసుకున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు కడారి సునీత రెడ్డి, కడారి కృష్ణారెడ్డి, లింగాగౌడ్, రవి, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మున్సిపల్ పరిధి ఆబాది జమ్మికుంటలోని జడ్.పి.హెచ్ పాఠశాలలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన సందర్భంగా బిఆర్ఎస్ విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు కొమ్ము నరేష్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. నాయకులు జవాజి అనిల్, వేల్పుల శ్రీకాంత్, చింతల కౌశిక్, పాతకాల అజయ్, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణను బీఆర్ఎస్ తుప్పు పట్టించింది

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ తుప్పు పట్టించిందని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇప్పుడిప్పుడే ఆ తుప్పును వదిలిస్తూ ముందుకెళుతున్నట్టు తెలిపారు. రైతుల పొలాలు ఎండిపోతుంటే, టన్నెల్‌లో కార్మికుల ప్రాణాలు పోతుంటే, ప్రజలు కష్టాల్లో ఉంటే బీఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తూ పైశాచికానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగానికి కేసీఆర్ రావడం కాదని, అసెంబ్లీలో చర్చలకు రావాలని సవాల్ విసిరారు. డీలిమిటేషన్ అనేది లిమిటేషన్ ఫర్ సౌత్ అని విమర్శించారు. గురువారం నాడిక్కడ తుగ్లక్ రోడ్ 23వ అధికారిక నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. పాలనకు అలవాటు పడ్డ అధికారులు, రాత్రికి రాత్రే వ్యవస్థనే సెట్ చేయాలంటే? కుదరదని, అలా చేస్తే ఒక్కసారిగా సిస్టమంతా కొలాప్స్ అవుతుందని చెప్పారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ ఏ ఒక్క పాలసీని రూపొందించలేదని అన్నారు. తాను టూరిజం, రెవెన్యూ, ఇలా అనేక పాలసీ రూపకల్పనలో బిజీగా ఉన్నట్టు చెప్పారు. ఇక చరిత్రలో ఎవరూ చేయలేని... ఎస్సీ వర్గీకరణ, కుల గణన, రూ. 2 లక్షల వరకు రుణమాఫీలను చేసి చూపినట్టు తెలిపారు. 2029 ఎన్నికలకు వెళ్లేప్పుడు ప్రజలే ఈ విషయాలన్నీ గమనిస్తారని అన్నారు. లీడర్ రేవంత్ చెప్తే చేస్తాడు, చెప్పినవి చేశాడు కదా అని వాళ్లే మనకు అండగా నిలుస్తారని చెప్పారు.

ఏనాడైనా మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రాజెక్టులపై ప్రశ్నించారా...?

తెలంగాణ అభివద్ధికి బీజేపీ అడ్డుపడుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. నిధులు, ప్రాజెక్టుల విషయంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 'కేంద్ర మంత్రివర్గంలో పనిచేసే వాళ్ల సొంత రాష్ట్రాల సమస్యలను లేవనెత్తాలి. ఆయా రాష్ట్రాలకు అండగా నిలవాలి. కానీ మన మంత్రి కిషన్‌రెడ్డి మాత్రం రాష్ట్రానికి సంబంధించిన అంశాలేమీ పట్టించుకోరు' అని విమర్శలు గుప్పించారు.

కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారు?. మూసీ, త్రిబుల్ ఆర్, మెట్రో ఇలా ఎన్నో ప్రాజెక్టుల విషయంలో కేంద్రంతో ఆయన ఏమైనా మాట్లాడారా?. మెట్రో విషయంపై కేంద్రంతో ఆయన ఎందుకు మాట్లాడటం లేదు?.' అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్‌లపై కిషన్ రెడ్డి... ప్రధాని మోడీతో మాట్లాడి అనుమతులు తెప్పిస్తే, రుణాలిచ్చేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయి. రాష్ట్ర అభివద్ధికి బీజేపీ అడ్డుపడుతుందని చెప్పడానికి కేంద్ర మంత్రుల తీరే నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో అప్పు ఉంది కాబట్టే ఆ అప్పుపై తాను మాట్లాడుతున్నట్టు చెప్పారు. రూ.7లక్షల అప్పు ఉన్న విషయాన్ని ప్రజలకు చెప్పకపోతే ఎలా అని ప్రశ్నించారు.

నేనేంటో హైకమాండ్‌కు తెలుసు...

తానేంటో పార్టీ హైకమాండ్‌కు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీ కుటుంబంతో తనకు సాన్నిహిత్యం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన కొట్టివేశారు. అవసరమైతే ఖర్గే, రాహుల్ గాంధీలతో మాట్లాడి... తనకు కావాల్సింది తెచ్చుకునే సామర్థ్యం ఉందన్నారు. 'ఎవరో ఏదో అనుకుంటున్నారని నేను పట్టించుకోను. గాంధీ కుటుంబంతో మీరు, అందరూ అనుకునే దానికంటే ఎక్కువే సాన్నిహిత్యం ఉంది. నేనెవరో తెలియకపోతే పీసీసీ చీఫ్ నన్ను సీఎంని ఎలా చేస్తుంది?. కలిసిన ప్రతిసారీ ఫొటోలు తీసుకోవాల్సిన అవసరం లేదు. ఫొటోలు ఉంటేనే వారితో సాన్నిహిత్యం ఉందనుకోవడం తప్పు' అని అన్నారు.

బీజేపీది హిడెన్ ఎజెండా...

హిందీ జాతీయ భాష ఏమీ కాదని, దేశంలో ఎక్కువ మంది మాట్లాడుతున్న భాష మాత్రమేనని సీఎం న్నారు. అటువంటి హిందీ భాషను దేశ ప్రజలపై రుద్దడంలో బీజేపీది రహస్య ఎజెండా అని వ్యాఖ్యానించారు. మూడు భాషల విధానాన్ని సీఎం రేవంత్ తప్పుబట్టారు. 'అసలు హిందీ జాతీయ భాష ఏంటి? మీరు అనుకుంటే సరిపోతుందా? హిందీ అనేది దేశంలో ఎక్కువ మంది మాట్లాడే భాష. ఆ తర్వాత అత్యధికంగా తెలుగు, బెంగాల్ మాట్లాడుతారు. మీరు హిందీ మాట్లాడతారు కదా? అందరూ అదే మాట్లాడాలి అంటే ఎలా?. అందుకే హిందీ భాషను మనపై రుద్దడంలో ఏదో రహస్య ఎజెండానే ఉంది' అంటూ మండిపడ్డారు.

ఎమ్మెల్సీతో విజయశాంతికి న్యాయం..

ఎమ్మెల్సీతో విజయశాంతికి సముచిత న్యాయం చేసినట్టు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకు ఆమె ఎన్నికల్లో పోటీ చేయలేదన్నారు. పార్టీ గెలుపుకోసం క్యాంపెయిన్ చేశారని, నిబద్ధతతో ఎంతో కాలంగా కష్టపడి పని చేశారని గుర్తు చేశారు. అందుకే ఆమెకు ఎమ్మెల్సీ ఇచ్చినట్టు చెప్పారు. మరోవైపు మహిళా రిజర్వేషన్ల అమలులోనూ ఆమెకు ఎమ్మెల్సీ ఇవ్వడం సరైందిగా భావిస్తున్నట్టు తెలిపారు. పదవుల విషయంలో తాను ఈక్వేషన్స్ చూడనని సీఎం స్పష్టం చేశారు. 'నేను అధికారంలోకి వచ్చాక పార్టీ డీసీసీలు, అనుబంధ సంస్థలకు చెందిన 37 మందికి చైర్మెన్ పదవులు ఇచ్చాం.' అని చెప్పారు.

ఓన్ ట్యాక్స్ రెవెన్యూలో తెలంగాణ నెంబర్ వన్...

ఓన్ ట్యాక్స్ రెవెన్యూ కలెక్షన్లలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని సీఎం చెప్పారు. ద్రవ్యోల్బణం 1.3కి తగ్గిందని చెప్పారు. అలాగే రాష్ట్రంలో నిరుద్యోగం 8.8 శాతం నుంచి 6.1 కు తగ్గించినట్లు వివరించారు. ఈ లెక్కలు సోషల్ ఎకనామిక్ సర్వే, కేంద్ర ప్రభుత్వ గణాంకాలని తెలిపారు. సీఎంగా తెలంగాణకు భారీ పెట్టుబడులు తెచ్చానని గుర్తు చేశారు. డీలిమిటేషన్‌తో యూపీలో పార్లమెంట్ సీట్లు 80 నుంచి 120 పెరిగితే, తమిళనాడులో 39 నుంచి 60కి మాత్రమే పెరుగుతాయన్నారు.

అంటే.. యూపీలో 40 సీట్లు పెరిగితే, తమిళనాడులో 21 సీట్లు మాత్రమే పెరుగుతాయని, ఇలా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. తెలంగాణలో వినూత్నంగా రైజింగ్ తెలంగాణ "భారత్ సమ్మిట్" పేరుతో కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామాతో పాటు సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సమ్మిట్ నిర్వహించాలి అంటే కేంద్ర ప్రభుత్వం "పొలిటికల్ క్లియరెన్స్" ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. అందుకోసమే విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్‌తో భేటీ అవుతున్నట్టు వెల్లడించారు.

దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గిస్తే సహించం

దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాన్ని సహించబోమని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. 'మేం (దక్షిణాది రాష్ట్రాలు) దేశానికి ఎంతో సేవ చేశాం. దక్షిణాది రాష్ట్రాల నుంచి బీజేపీకి పెద్దగా ప్రాతినిధ్యం లేదు. దక్షిణాది రాష్ట్రాల్లో ఓటమితో ఈ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది. మాపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకుంటాం' అని స్పష్టం చేశారు. బీజేపీ కుట్రలను ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ సూత్రప్రాయంగా ఇప్పటికే నిర్ణయించిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకొని తాను చెన్నై సమావేశానికి హాజరవుతానని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ రాష్ట్రంలోనూ చర్చలు జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు అన్ని పార్టీల నేతలను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి జానారెడ్డిలకు సూచించినట్టు వెల్లడించారు. తాము నిర్వహించే సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నామని, ఆయన సమావేశంలో పాల్గొని అక్కడ వెల్లడైన అభిప్రాయాలను కేంద్రమంత్రి వర్గం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

సల్మాన్ ఖుర్షిద్‌తో సీఎం భేటీ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే తెలంగాణ రైజింగ్ ఇంటర్నేషనల్ సమ్మిట్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. తుగ్లక్ రోడ్‌లోని సీఎం అధికారిక నివాసంలో జరిగిన ఈ భేటీలో కేంద్ర మాజీ విదేశాంగ శాఖ మంత్రి సల్మాన్ ఖుర్షిద్, ఏఐసీసీ శాశ్వత ఆహ్వానితులు గురుదీప్ సింగ్ సప్పల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో ఎంపీలు మల్లు, చామల, అనిల్ కుమార్ యాదవ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి నాయుడు, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్, ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌లు పాల్గొన్నారు. సుమారు అరగంట పాటు రైజింగ్ తెలంగాణ సమ్మిట్ పై ఈ మీటింగ్‌లో చర్చించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరే దిశలో ఎదురయ్యే అంశాలు, సమ్మిట్ ఏర్పాటుపై మంతనాలు చేశారు.

బూర్గులకు సీఎం రేవంత్ నివాళి

హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన తొలి సీఎం బూర్గుల రామకృష్ణారావు అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా ఢిల్లీలోని తుగ్లక్ రోడ్‌లో ఆయన చిత్రపటానికి సీఎం పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, సీఎంగా, రెండు రాష్ట్రాలకు గవర్నర్‌గా, సాహితీవేత్తగా, బహు భాషావేత్తగా బూర్గుల బహుముఖ ప్రజ్ఞ కనబర్చారని కొనియాడారు. ఈ ప్రోగ్రాంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్‌కు మద్దతుగా నిలవండి :విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

రాబోయే 25 ఏండ్లలో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం నాడిక్కడ కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో హైదరాబాద్ లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వివరాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల నిర్వహణతో తెలంగాణ రైజింగ్‌ను ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి జై శంకర్‌ను సీఎం కోరారు. తెలంగాణ రైజింగ్‌ను విదేశాల్లో భారత్ కార్యక్రమాల్లోనూ ప్రచారం చేయాలని, దౌత్య, లాజిస్టిక్ సహాయంతో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని కేంద్ర మంత్రి జైశంకర్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూలు, భువనగిరి లోక్‌సభ సభ్యులు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ కుట్రను తిప్పికొడతాం

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రంలోని బీజేపీ సర్కార్ చేస్తోన్న కుట్రను తిప్పికొడతామని, ఇందుకు కావాల్సిన కార్యాచరణ చేపడతామని తెలంగాణ సీఎం. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది నియోజకవర్గాల పునర్విభజన కాదని, దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను కుదించే బీజేపీ ప్రయత్నమని విమర్శించారు. ఈ పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కలిగే నష్టాలు.. చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు చెన్నైలో ఈ నెల 22న జరిగే సమావేశానికి హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డిని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆహ్వానించారు. ఈ లేఖను ఆ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.ఎన్.నెహ్రూ ఆధ్వర్యంలోని డీఎంకే ప్రతినిధి బృందం గురువారం నాడిక్కడ రేవంత్ రెడ్డికి అందజేసింది. ఈ భేటీలో డీఎంకే ప్రత్యేక ప్రతినిధి ఎకెఎస్ విజయన్, డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి, డీఎంకే ఎంపీలు ఏ.రాజా, ఎస్.ఆర్. ఇళంగో, కళానిధి వీరస్వామి, అరుణ్ నెహ్రూలు ఉన్నారు. అయితే 2026 తరువాత చేపట్టే జనగణన వరకు నియోజకవర్గాల పునర్విభజన చేపట్టకూడదని నిబంధనలున్నా... కేంద్ర ప్రభుత్వం మాత్రం అంతకుముందు గానే ఈ ప్రక్రియను తెరపైకి తెచ్చిందని తమిళనాడు సీఎం స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనపై తమ రాష్ట్రంలో ఇప్పటికే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామని లేఖలో వెల్లడించారు. ఈ విషయంలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, పంజాబ్ రాష్ట్రాలతో కూడిన ఐక్య కార్యాచరణ కమిటీలో (జేఏసీ) చేరేందుకు అంగీకారం తెలపాలని సీఎంను కోరారు. భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు జేఏసీలోకి తెలంగాణ కాంగ్రెస్ తరపున ఒక ప్రతినిధిని నియమించాలని లేఖలో సూచించారు.

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి

నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం ద్వారా అమ్మడాన్ని వెంటనే ఆపాలని యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి ప్రాంతంలోని ఈ 400 ఎకరాల భూమిని టీఎస్ఐఐసీ ద్వారా మార్చి 8 నుంచి 15వ తేదీ మధ్య వేలం వేయబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కార్పొరేట్ సంస్థలకు ఈ భూములు అమ్మడం ద్వారా రూ.18వేల కోట్లు సమీకరించాలని నిర్ణయించింది. దాంతో భూముల వేలం ఆపాలని డిమాండ్ చేస్తూ గురువారం యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వేలం వేయాలనుకున్న ఆయా భూముల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎంతో విలువైన భూములను కలిగి ఉందని, ఆ భూముల్లో ప్రధానంగా పురాతన కాలం నాటి పెద్ద పెద్ద కొండలు చరిత్రకు సాక్ష్యంగా ఉన్నాయని తెలిపారు. యూనివర్సిటీ భూములను వేలం ద్వారా విక్రయించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు సంక్షేమ ప్రభుత్వమని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు ప్రధానంగా ప్రభుత్వ భూములను అమ్మేందుకు కుట్ర చేస్తోందన్నారు. భూముల పరిరక్షణకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆనాటి చారిత్రాత్మక సాక్ష్యాలకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఒక కేంద్రంగా ఉందని గుర్తు చేశారు. ప్రధానంగా రాకాసి కొండలు, పెద్దపడ్ గుట్టలు ఉన్నాయని, వాటిని ఇప్పటికీ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వాళ్లుపరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వానికి సూచనలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ భూములు అమ్మితే చరిత్ర కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం దశలవారీగా పోరాటం నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తన ఆలోచన విరమించుకుని యూనివర్సిటీ భూములను పరిరక్షించేందుకు ముందుకు రావాలని వారు ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌లో వ్యక్తి దారుణహత్య

- అనంతరం చోరీకి పాల్పడిన దుండగుడు
- రూ.40 వేల నగదు, లిక్కర్ బాటిళ్ల చోరీ
- రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఘటన

నవతెలంగాణ-షాబాద్



(ఫైల్)

మద్యం దుకాణంలో చోరీకి వచ్చిన దుండగుడు పర్మిట్ రూమ్‌లో నిద్రిస్తున్న వ్యక్తిని హత్య చేసి, కొంత నగదు, లిక్కర్ బాటిళ్లను ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండల కేంద్రంలోని శ్రీ దుర్గా వైన్స్ షాప్ పక్కనున్న కూల్ పాయింట్‌లో పనిచేస్తున్న భిక్షపతి అలియాస్ ప్రవీణ్ (35) అక్కడే నిద్రించేవాడు. కాగా, ఎప్పటి లాగానే పని ముగించుకొని బుధవారం రాత్రి పర్మిట్ రూమ్‌లో పడుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి పక్కనే ఉన్న వైన్స్‌లో దొంగతనానికి పాల్పడ్డాడు. వైన్స్ వెనకాల ఉన్న గోడకు రంధ్రం చేసి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.40 వేల నగదుతో పాటు, లిక్కర్ బాటిళ్లు, షాపులో ఉన్న సీసీ కెమెరా డివైజ్‌ను ఎత్తుకెళ్లాడు. దీన్ని గమనించిన భిక్షపతి దుండగుడిని అడ్డుకున్నాడు. దాంతో చేతిలో ఉన్న ఇనుపరాడుతో భిక్షపతి తలపై దుండగుడు కొట్టడంతో తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, క్రైమ్ ఏసీపీ శంకర్‌రెడ్డి, సీసీఎస్, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, రమణారెడ్డి, డాగ్ స్క్వాడ్, క్లూ టీం బృందాలతో నిందితుని ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్ర

- ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి
- 400 ఎకరాల వేలం ప్రక్రియను నిలిపేయాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్ర జరుగుతున్నదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. భూములను విక్రయించాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 400 ఎకరాల భూమిని వేలం ప్రక్రియ వేయడాన్ని నిలుపుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శేరిలింగంపల్లి మండలంలోని గచ్చిబౌలి ప్రాంతంలో హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమిని ఈనెల ఎనిమిది నుంచి 15 వరకు వేలం వేయబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. టీజీఐఐసీ సంస్థ ద్వారా కార్పొరేట్ సంస్థలకు ఈ భూములను విక్రయించి రూ.18 వేల కోట్లు సమీకరించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ భూములను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేసిందనీ, విద్యార్థుల తిరుగుబాటుతో ఆ నిర్ణయాన్ని విరమించుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పేరుతో కాంగ్రెస్ పేద విద్యార్థులు చదువుతున్న వర్సిటీ భూములను లాక్కుని కార్పొరేట్లకు ధారాదత్తం చేసే చర్యలను మానుకోవాలని కోరారు. ప్రభుత్వమే కోర్టుకు వెళ్లి భూములను విక్రయించేలాగా అనుకూల తీర్పు తీసుకొచ్చి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నదని విమర్శించారు. పక్షులున్నాయనీ, వృక్ష జాతులున్నాయనీ, పర్యావరణం, సాంస్కృతిక వాతావరణం కలిగిన ఆ భూములను కార్పొరేట్లకు అప్పగిస్తే జీవవైవిధ్య దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ అభివృద్ధి కోసం భూములను కొనసాగించాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెనక్కి తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్

హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రభుత్వం అని చెప్తూ ప్రభుత్వ విద్యాసంస్థల భూములను ఎలా విక్రయిస్తుందని ప్రశ్నించారు.

విద్యార్థుల శ్రేయస్సు కోసం, వారి పరిశోధనలు జరుపుకోవడానికి ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. కానీ అమ్మకానికి పెట్టడం సరైంది కాదని తెలిపారు.ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కార్పొరేట్లకు అమ్మే నిర్ణయాన్ని మానుకోవాలి : పీడీఎస్‌యూ విజృంభణ

హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ సంస్థలకు అమ్మే నిర్ణయాన్ని మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర అధ్యక్షులు రాయిసీడం బాపూరావు, ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ పేద అణగారిన వర్గాల విద్యార్థులు చదువుకునే వర్సిటీ భూములను లాక్కోవడమంటే వారిని విద్యకు దూరం చేయడమేనని విమర్శించారు.

హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని నిలిపేయాలి

- ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి : సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూముల విక్రయాన్ని నిలిపేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. వర్సిటీ భూముల పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం ఆయన లేఖ రాశారు. హెచ్‌సీయూ ఆవిర్భావ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వే నెంబర్ 25 కింద 2,300 ఎకరాల స్థలాన్ని పరిశోధన, విద్యారంగ అభివృద్ధికి కేటాయించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ భూమిని వేలం వేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని తెలిపారు. గచ్చిబౌలి ప్రాంతంలో ఉన్న 400 ఎకరాలను స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణానికి మార్కెట్ విలువ కంటే చాలా తక్కువకు కేటాయించిందని పేర్కొన్నారు. అయితే తగిన అభివృద్ధి చేయడంలో ఆ కంపెనీ విఫలమవ్వడంతో ఆ భూములను ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల ద్వారా తిరిగి పొందిందని వివరించారు. ప్రస్తుతం ఈ భూమిని రూ.18 వేల కోట్ల (అంచనా విలువ)కు 2025 మార్చి 8 నుంచి 15 తేదీల మధ్యన వేలం వేస్తున్నట్టు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. వర్సిటీలోని పర్యావరణ, అకడమిక్, సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగిన ఇటువంటి స్థలాన్ని ప్రయివేట్, కార్పొరేట్ శక్తులు స్వార్థ ప్రయోజనాలకు ధారాదత్తం చేయడమే అవుతుందని విమర్శించారు. విద్య, పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ప్రస్ఫుటం చేస్తున్నదని తెలిపారు. ఒక వైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రయివేటీకరణను, సంపదను మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం విమర్శిస్తున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్సిటీ భూముల వేలాన్ని ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్నదని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలనీ, ఈ భూములను వర్సిటీకి కేటాయించి విద్య, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.

విరామ వ్యూహం

డిఫెన్స్‌లో బీఆర్ఎల్పీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను బీఆర్ఎస్ సభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఏకవచనంతో సంబోధించడం శాసనసభలో పెద్ద దుమారాన్నే లేపింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల విమర్శలు, ప్రతి విమర్శల నేపథ్యంలో స్పీకర్ సభను 11.35 నిమిషాలకు వాయిదా వేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు తిరిగి సభ ప్రారంభమైంది. ఆ నాలుగు గంటల విరామ సమయంలో శాసనసభ లాబీల్లో పెద్ద తతంగమే జరిగింది. మంత్రులు, కాంగ్రెస్ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డితోనూ ఈ అంశంపై చర్చించారు. మంత్రి శ్రీధర్‌బాబు జరిగిన ఘటనను ఢిల్లీలోని సీఎంకు పూసగుచ్చినట్టు వివరించినట్టు తెలిసింది. మరోవైపు ఇటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎల్పీనేత కేసీఆర్‌తో మాట్లాడి సలహాలు తీసుకున్నారు. జగదీశ్‌రెడ్డిని ఒక మెట్టు దిగాలని కేసీఆర్ సూచించినప్పటికీ...ఆయన దానికి అంగీకరించినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సభ వాయిదా పడ్డ తర్వాత జగదీష్‌రెడ్డిపై చర్యలు తీసుకుంటారా? లేదా? అధికార పార్టీ ఏం చేయబోతున్నది. దాన్ని బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొబోతున్నది. అసలు ఆయా ఛాంబర్లో ఏం చర్చిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తమ వ్యూహాలకు ఎలా పదును పెడుతున్నారు అనేది శాసనసభ లాబీల్లో ఉత్కంఠగా మారింది. స్పీకర్‌పై జగదీష్‌రెడ్డి వ్యక్తిగతంగా కామెంట్ చేయడంపై అధికార పార్టీ సీరియస్‌గా తీసుకుంది. అయితే జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేయాలా? వద్దా? అనే విషయంలో కాంగ్రెస్ మాత్రం ప్లాన్‌గానే నడిపిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌పై గవర్నర్ ప్రసంగ కాపీలను చించివేశారనే కారణంగా వేటేసిన విషయం విదితమే. వారిని సస్పెండ్ చేసిన సమయంలో బీఆర్ఎస్ సర్కారు చెప్పిన కారణాలను కూడా హస్తం పార్టీ పరిశీలించింది. ఈ సందర్భంగా కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ సస్పెన్షన్ కలిసొచ్చింది. దీంతోపాటు జగదీష్‌రెడ్డి ఏకవచన వ్యాఖ్యల ఫుటేజ్ పరిశీలించింది. పక్క ఆధారాలతో జగదీష్‌రెడ్డిపై చర్యలకు కాంగ్రెస్ పార్టీ పూనుకున్నది. సభలో సస్పెన్షన్లు ఉండవన్న హామీ నేపథ్యంలో పలుకోణాల్లో చర్చించామని చెబుతున్నారు. ప్రతిపక్ష పార్టీకి హెచ్చరికలు జారీ చేస్తూనే...జగదీశ్‌రెడ్డిని బడ్జెట్ సెషన్ వరకు సస్పెండ్ చేసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ సభ్యులు జగదీశ్‌రెడ్డి ఏకవచన వ్యాఖ్యలపై ఆ పార్టీ అంతర్మథనం చెందినట్టు తెలిసింది. బీఆర్ఎస్ కూడా ఓ మెట్టు దిగాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ విషయంపై క్లారిటీ కోసం ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఫోన్ చేసి అభిప్రాయాన్ని తీసుకున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. జగదీశ్‌రెడ్డి ఏకవచన వ్యాఖ్యలపై కేసీఆర్ సీరియస్ అయినట్టు తెలిసింది. జగదీశ్‌రెడ్డి స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని సూచించారు. ఇదే విషయాన్ని బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ ప్రసాద్‌కుమార్ వద్దకు వెళ్లి క్షమాపణలు కోరుతామంటూ రాయబారం నడిపారు. సభలో ఏకవచన వ్యాఖ్యలు చేసి...లోపల సారీ చెప్పడమేంటనే అధికార సభ్యులు తప్పుపట్టారు. జగదీశ్‌రెడ్డి కూడా ఉద్దేశ పూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేశారని అధికార కాంగ్రెస్ భావించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ తర్జన భర్జనల మధ్య సభ తిరిగి ప్రారంభమైంది. కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డిని పూర్తిగా సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై అహంకారపూరితంగా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఈ క్రమంలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడుతుందన్నారు. తమ పార్టీకి చెందిన సభ్యులు పూర్తిగా సస్పెండ్ చేయాలంటూ కోరినా ప్రభుత్వం మాత్రం ఆయన్ను ఈ సెషన్ వరకు మాత్రమే సస్పెండ్ చేయాలని ప్రతిపాదించారు. దానికి స్పీకర్ ఆమోదం తెలిపారు. ఈ సెషన్ వరకు సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

క్షేత్రస్థాయిలో హైడ్రా కమిషనర్ పరిశీలన

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ అల్వాల్ మండలం తిరుమలగిరి విలేజ్ లోతుకుంటలో ప్రభుత్వ భూమి కబ్జాను పరిశీలించారు. కంటోన్మెంట్‌లోని జనరల్ భూమి రికార్డ్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానిదిగా నమోదు కాగా, ప్రయివేటు వ్యక్తులు తమదని చెప్పడంతో హైడ్రా కమిషనర్ పరిశీలించారు. వందకు పైగా ఎకరాలున్న ఈ భూమిలో ఎలాంటి కట్టడాలకూ అనుమతులివ్వరాదని అధికారులకు కమిషనర్ సూచించారు. గండిమైసమ్మ మండలం దుండిగల్ విలేజ్‌లోని బుబ్బఖాన్ చెరువు దిగువన వున్న లింగం చెరువు కాలువ పరిసరాలను పరిశీలించారు. బుబ్బఖాన్ చెరువు అలుగు, తూముల నుంచి వరద నీరు వెళ్లకుండా నాలను కబ్జాచేసి నిర్మాణాలు జరిగాయని, దీంతో వరద ముంచెత్తుతోంది స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. నాలా సమస్యను పరిష్కరించాలని కోర్టు ఆదేశాల నేపథ్యంలో మీరంతా కలిసికట్టుగా నిర్ణయానికి రావాలని, స్థానికులకు, రియల్ ఎస్టేట్ సంస్థలకు కమిషనర్ సూచించారు. అనంతరం హఫీజ్‌పేట దగ్గర ప్రభుత్వ భూమి కబ్జాను పరిశీలించారు. టీడీఆర్ కింద లబ్ధిపొంది ప్రభుత్వ భూమిని కబ్జా చేశారా అనే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమయంలో పలుచోట్ల పలువురు స్థానిక సమస్యలే కాకుండా వారి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మరికొందరు కబ్జాల బారి నుంచి తమ భూములు, ఇండ్లను కాపాడుతున్న వైనానికి కమిషనర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ కరీంనగర్
మానవి
www.navatelangana.com
శుక్రవారం
14 మార్చి 2025

మెకానిక్ దీదీ

కోల్‌కతా అత్యంత పెద్ద గ్యారేజీలతో నిండిన నగరం. వాటిలోని ఒక ఆటో గ్యారేజీ దుకాణం అన్నింట్లోనూ ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ గ్యారేజీ ప్రత్యేకత ఏమిటంటే 52 ఏళ్ల మహిళా మెకానిక్ సోనాలి మిస్త్రీ దాన్ని నడుపుతున్నారు. పగలూ, రాత్రి అవిశ్రాంతంగా పనిచేస్తూ ద్విచక్ర వాహనాలను మరమ్మతు చేస్తుంటారు. మొత్తం నగరంలో ఈ వృత్తిలో ఉన్న ఏకైక మహిళ ఆమే కావడం ఓ విశేషం. అందుకే అందరూ ఆమెను గౌరవంగా 'మెకానిక్ దీదీ' అని పిలుచుకుంటారు.

52 ఏండ్ల సోనాలి మిస్త్రీ... సమాజం మహిళలకు విధించిన నిబంధనలను సవాలు చేస్తున్నారు. ద్విచక్ర వాహన మెకానిక్‌గా కోల్‌కతాలో గుర్తింపు తెచ్చుకున్నారు. 26 ఏండ్లుగా ఈ వృత్తిలో కొనసాగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చేతిపనులలో ప్రావీణ్యం సంపాదించుకున్నారు. మంచి మెకానిక్‌గా పేరు సంపాదించుకుని 'మెకానిక్ దీదీ'గా ప్రజల మనసుల్లో నిలిచిపోయారు.

పట్టుదలతో ముందుకు సాగి

సోనాలి తన భర్త నుండి మెకానిక్ పని నేర్చుకున్నారు. ఇప్పుడు ఆమె కోల్‌కతాలోని అన్వర్ షా రోడ్‌లో ఒక గ్యారేజీ నడుపుతున్నారు.



తను నేర్చుకోవడమే కాకుండా తర్వాతి తరానికి కూడా ఇందులో శిక్షణ ఇవ్వాలని ఆమె కలలు కంటున్నారు. పురుషాధిక్య రంగంలో సోనాలి ప్రయాణం 26 ఏండ్ల కిందట ప్రారంభమైంది. రెంచ్‌లు, యాక్సిల్ టూల్స్, సాకెట్లు, ఇతర పరికరాలతో ఫిడేలు వేయడంతో ఆమె తన పనిని ప్రారంభించారు. పేదరికం, కష్టాల మధ్య ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ పట్టుదలతో ముందుకు సాగి నైపుణ్యం కలిగిన మెకానిక్‌గా మారారు.

యువతీయువకుల కోసం

నిరుపేద కుటుంబంలో పుట్టిన సోనాలి వైవాహిక జీవితం తర్వాత కూడా అదే పేదరికంతో పోరాడారు. భర్త శంకర్ నుండి మెకానిక్ పనులు నేర్చుకుని క్రమంగా ఆ వృత్తి పట్ల మక్కువను పెంచుకున్నారు. ప్రారంభంలో ఆమె ఇంటి పనులను, అటు వర్క్‌షాప్‌లో పనిని సమతుల్యం చేసుకోవడంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. చివరికి సర్దుబాటు చేసుకున్నారు. భార్యభర్తలు కలిసి డబ్బు ఆదా చేసి అన్వర్ షా రోడ్‌లో సొంత గ్యారేజీని ప్రారంభించారు. తను సరిగ్గా చదువుకోలేకపోయినా సోనాలి తన పిల్లలకు మంచి విద్యను అందించాలని నిర్ణయించుకున్నారు. అంతేకాదు మెకానిక్‌లో తమ కెరీర్‌ను కొనసాగించడానికి ఆసక్తి ఉన్న యువతీయువకులకు పోషించగల శిక్షణా సంస్థను స్థాపించాలనేది సోనాలి కల. ఇలా ఆమె తన నైపుణ్యాలను తర్వాతి తరంతో పంచుకోవాలనుకుంటున్నారు. ఈ రంగంలో వారు విజయం సాధించడానికి అవసరమైన సహకారం అందించానుకుంటున్నారు.

ఓ మహిళగా కష్టమన్నారు

డాక్టర్ రుక్మణి కృష్ణమూర్తి... భారతదేశపు తొలి మహిళా ఫోరెన్సిక్ శాస్త్రవేత్త. చాలా మందికి ఫోరెన్సిక్ సైన్స్ (నేర పరిశోధన) అంటే ఏమిటో కూడా తెలియని సమయంలో ఆమె ఈ రంగంలోకి ప్రవేశించారు. అప్పటి వరకు పురుషులకు మాత్రమే అవకాశం ఉన్న ఆ రంగంలోకి కుటుంబం వద్దంటున్నా ఎదిరించి మరీ అడుగు పెట్టారు. తన నైపుణ్యంతో ఎన్నో అంతుచిక్కని సమస్యలకు పరిష్కారం చూపి శభాష్ అనిపించుకున్నారు. మహిళలు ఏదైనా సాధించగలరు అని నిరూపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఛేదించి పట్టుదలతో ముందడుకు వేసి నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచిన ఆమె పరిచయం...



రుక్మణి స్నేహితుడు ఒకరు ఆమె కళాశాలలోని కెమిస్ట్రీ ల్యాబ్‌ను ఫోరెన్సిక్ పరిశోధన కోసం ఉపయోగించడంతో, ఆమెలో కూడా ఈ అంశం పై ఆసక్తి పెరిగింది. 1974లో బొంబాయిలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో సాధారణ రీసెర్చ్ అసిస్టెంట్‌గా చేరి 2008లో పదవీ విరమణ చేసేనాటికి సంస్థ డైరెక్టర్‌గా 8 ఏండ్లు విధులు నిర్వహించారు. 1974లో సంస్థలో చేరినప్పుడు ఆమె ఏకైక మహిళ అయినప్పటికీ, లాబొరేటరీ వీడి వెళ్లిపోయినప్పుడు మొత్తం సిబ్బందిలో 20 శాతం మహిళలు ఉండడం విశేషం. ప్రస్తుతం డాక్టర్ రుక్మణి ముంబైలోని హెలిక్ అడ్వైజరీ లిమిటెడ్ చైర్‌పర్సన్, ముఖ్య కార్య నిర్వహణాధికారి (సిఈఒ) మాత్రమే కాక గుజరాత్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీలో అకడమిక్ కౌన్సిల్ సభ్యురాలు. ఆమె పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శనం చేయడంతో పాటు ఫోరెన్సిక్ సైన్స్‌పై రెండు పుస్తకాలు కూడా రాశారు.

ఫోరెన్సిక్స్‌ను కెరీర్‌గా

రుక్మణి కృష్ణమూర్తికి రసాయన శాస్త్రంలో(కెమిస్ట్రీ) మాస్టర్స్ డిగ్రీ ఉంది. అప్పట్లో మూడు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోగా అన్నింటిలోను ఉద్యోగం వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్లరికల్ ఉద్యోగం, ముంబైలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో టీచింగ్‌తో పాటు రీసెర్చ్ అసిస్టెంట్‌గా కూడా అవకాశం వచ్చింది. అయితే మొదటి నుండి ఫోరెన్సిక్ పరిశోధనలో ఆసక్తి ఉన్న ఆమె బొంబాయిలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో చేరారు. ఆమె నాగ్‌పూర్‌లో ఎం.ఎస్సీ చేశారు. కుటుంబం నుండి వ్యతిరేకత ఉన్నప్పటికీ సోదరుడి మద్దతు, ప్రోత్సాహంతో చివరికి ఫోరెన్సిక్ లాబొరేటరీలో చేరారు.

మొదట్లో అనుమతించలేదు

'ఈ రంగంలో అమ్మాయిలు పనిచేయడం కష్టం, మీరెందుకు చేరాలనుకుంటున్నారు' అని అప్పటి ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ అడగ్గా తనకు ఈ రంగంలో ఆసక్తి ఉందని ఆమె స్థిరంగా బదులిచ్చారు. నియామక లేఖలో, ఆమెకు కేటాయించిన విధి నేరం జరిగిన ప్రదేశాన్ని, అవసరాన్ని బట్టి కోర్టును సందర్శించడం. కానీ డైరెక్టర్ మొదట్లో ఆమెను అనుమతించలేదు. ఎందుకని అడిగితే ఒక మహిళగా మీరు సైట్‌లను సందర్శించడం కష్టమని ఆయన అన్నారు. కానీ ఆమె పట్టుబట్టి యువ ఫోరెన్సిక్ శాస్త్రవేత్తగా నేర దృశ్యాలను సందర్శించడం ప్రారంభించారు. చిన్నతనం నుండి రుక్మణి ఎంతో ధైర్యంగా ఉండేవారు. ఇంట్లో కూడా అబ్బాయిలతో సమానంగా అన్ని పనులు చేసేవారు. తర్వాతి కాలంలో రుక్మణి మహారాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆరు ప్రపంచ స్థాయి ఫోరెన్సిక్ ప్రయోగశాలలను స్థాపించారు.

ఫోరెన్సిక్ బృందంతో కలిసి





విధి నిర్వహణలో భాగంగా ఆమె చేపట్టిన మొదటి కేసు వరకట్న మరణం. ఈ కేసులో ఒక వ్యక్తి భార్యపై కిరోసిన్ పోసి తగలబెట్టడంతో, ఆ మహిళ అనుభవించిన బాధను ఊహించుకుని తాను చాలా బాధపడ్డారు. అలాగే ఫిబ్రవరి 13, 1976న జరిగిన భయంకరమైన మాతుంగ రైలు అగ్నిప్రమాద సంఘటనలో 24 మంది ప్రయాణికులు మరణించారు. ఆ కేసులో ఆమె కూడా ఫోరెన్సిక్ బృందంలో ఉన్నారు. ఒక ప్రయాణీకుడు కిరోసిన్ డబ్బాతో ప్రయాణిస్తుండగా అందులోని కిరోసేన్ లీక్ అయ్యి, మరొక ప్రయాణీకుడు అశ్రద్ధగా కాల్చేసిన సిగరెట్ ముక్కను దానిపై విసరడంతో మంటలు చెలరేగినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ సంఘటన తర్వాత ఆ బృందం ఇచ్చిన సలహా ప్రకారం ప్రజా రవాణా వ్యవస్థలో పెట్రోల్, కిరోసిన్ వంటి మండే స్వభావం గల వస్తువులను తీసుకెళ్లడంపై ప్రభుత్వం నిషేధం విధించింది.

ముంబై బాంబు పేలుళ్ల కేసు

1993 ముంబై బాంబు పేలుళ్ల తర్వాత జరిగిన విధ్వంసాన్ని కళ్లారా చూసిన ప్రత్యక్ష సాక్షి ఆమె. అప్పట్లో ముంబై ఫోరెన్సిక్ లాబొరేటరీ డిప్యూటీ డైరెక్టర్ పదవిలో ఉన్న ఆమె మరుసటి రోజు తన పని ప్రారంభించారు. బాంబు పేలుడు జరిగిన అన్ని ప్రదేశాల నుండి నమూనాలను సేకరించి మూడు నెలలు కష్టపడి సమగ్ర నివేదికను రూపొందించారు. దర్యాప్తు కోసం అనుసరించిన సాంకేతికత పద్ధతి అంతర్జాతీయ స్థాయిలో వుందని డాక్టర్ రుక్మణి తన బృందానికి అభినందనలు తెలిపారు. 2000 తొలినాళ్లలో జరిగిన స్టాంపు పేపర్ల కుంభకోణానికి సంబంధించిన అబ్దుల్ కరీం తెల్గి కేసులో డాక్టర్ రుక్మణి కూడా ముఖ్యమైన పాత్ర పోషించారు. మూడేండ్లు శోధించి నేరస్తుడు ఉపయోగించిన కాగితం ప్రభుత్వ పత్రం కంటే భిన్నంగా ఉందని కనుగొన్నారు. ఈ కేసులో సుప్రీంకోర్టు వారి పనితీరును ప్రశంసించింది. ఆ తర్వాత ఆమె అనేక హత్యా రహస్యాలను ఛేదించారు. అంతేకాదు ఎసిటిక్ అన్హైడ్రేట్ అమ్మకాలను నియంత్రించడం ద్వారా మాదకద్రవ్యాల వ్యాపారాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషించారు.

సామాజిక సేవలో

ప్రస్తుతం రుక్మణి ప్లాస్టిక్ రహిత ప్రపంచం కోసం మద్దతు ఇచ్చే సంస్థలలో పని చేస్తున్నారు. అలాగే పేద పిల్లలకు విద్యను అందిస్తూ అనేక సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వన్యప్రాణుల ఫోరెన్సిక్స్‌పై ఆమె అభిప్రాయం అడిగితే మన దేశంలో ఈ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. చట్టపరమైన ప్రక్రియలలో ఆధారాలకు సంబంధించి మానవ ఫోరెన్సిక్ విశ్లేషణ అంటే ఏమిటో బాగా నిర్వచించబడిన ప్రమాణాలు ఉన్నప్పటికీ వన్యప్రాణుల ఫోరెన్సిక్ కేసులను పరిష్కరించడానికి అవసరమైన మోర్ఫోమెట్రీ, మాలిక్యులర్ లాంటి ఇతర పద్ధతుల ఆధారంగా జాతులు, వివిధ జంతు సమూహాలను గుర్తించడానికి సాంకేతికత ఇంకా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.



- యేచన్ చంద్ర శేఖర్,
8885050822

ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఎన్నికయ్యారు. వీరు కాకుండా అరుగురు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. దీంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ఉపెందర్‌రెడ్డి ప్రకటించారు

స్టార్‌లింక్ ఒప్పందాన్ని ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

చట్టాలను ఉల్లంఘించినట్లే అవుతుందని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. భారతదేశంలోని లక్షలాదిమంది టెలికం వినియోగదారులను పణంగా పెట్టి ఉపగ్రహ స్పెక్ట్రమ్ వినియోగంలో ఆధిపత్యం చెలాయించేందుకు జియో, ఎయిర్‌టెల్, స్టార్‌లింక్‌లు ఒక కూటమిగా ఏర్పడుతున్నాయి. పైగా, ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను ప్రత్యేకంగా వ్యూహాత్మక వినియోగాలకే అంటే రక్షణ, ఇస్రో కార్యకలాపాలకు కేటాయించాల్సి వుంది. ఇది కేవలం స్పెక్ట్రమ్ కేటాయింపునకు సంబంధించిన సమస్యే కాదు, ఒక దేశానికి వుండే ఆర్బిటల్ స్లాట్‌ల సంఖ్యకు సంబంధించిన సమస్య కూడా. కీలకమైన ఆర్బిటల్ స్లాట్‌లను స్వాధీనం చేసుకోవడానికి ఎస్‌యు1.హెచ్ ఉపగ్రహాలను అనుమతించడమే కాదు, మన జాతీయ వనరులను మ్యాపింగ్ చేసుకోవడానికి, వాణిజ్యపరంగా విలువైన డేటాను సేకరించుకునేందుకు కూడా వీటిని ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు, వాతావరణం, పంటల పరిస్థితి, అలాగే వ్యూహాత్మకమైన లేదా రక్షణ డేటా వంటి వాటిని సేకరించడమనేది మన జాతీయ, భద్రతా ప్రయోజనాలకు వ్యతిరేకం కాగలదు. ముఖ్యంగా ఇస్రో, ఇతర భారతీయ సంస్థలకు ఇలా చేయగల సత్తా వుంది. ఇటువంటి టెలికం సర్వీసులు దేశ రక్షణకు చాలా కీలకమైనవి. అమెరికా ఆధ్వర్యంలో రష్యాతో చర్చలు జరిపేలా ఉక్రెయిన్ అధ్యక్షుడిపై ఒత్తిడి తెచ్చేందుకు, అలాగే ఉక్రెయిన్ ఖనిజ వనరులను తమకు అప్పగించాలన్న అమెరికా డిమాండ్లను అంగీకరించేలా చేసేందుకు ఉక్రెయిన్ మిలటరీకి స్టార్‌లింక్ సేవలను నిలిపివేస్తామని అమెరికా బెదిరించిన విషయం మనకు తెలిసిందేనని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఒక అమెరికా కంపెనీ అధికంగా వ్యూహాత్మకంగా ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను, ఆర్బిటల్ స్లాట్‌లను స్వాధీనం చేసుకోవడానికి అనుమతించడం, రోదసీ గుత్తాధిపత్యాన్ని సృష్టించడమంటే మన జాతీయ సార్వభౌమాధికారం, భద్రతపై రాజీపడడమేనని సీపీఐ(ఎం) విమర్శించింది.

'మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను'

వాషింగ్టన్ : షాంపైన్, వైన్ సహా అన్ని రకాల మద్యం దిగుమతులపై 200 శాతం పన్ను విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలను హెచ్చరించారు. అమెరికా విస్కీపై యూరోపియన్ యూనియన్ 50 శాతం సుంకాన్ని విధిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరికలు చేశారు. 'యూరోపియన్ యూనియన్ అధికారులు ప్రపంచంలోనే అత్యంత శత్రువులుగా వ్యవహరిస్తూ అవమానకరంగా పన్నులు వేస్తున్నారు. అమెరికాను దెబ్బతీయడమే వారి ఏకైక లక్ష్యం. విస్కీపై యాభై శాతం సుంకాన్ని వసూలు చేస్తున్నారు. దీనిని తక్షణమే తొలగించకపోతే మేము కూడా ఫ్రాన్స్, ఇతర యూరోపియన్ యూనియన్ దేశాల నుండి వస్తున్న అన్ని రకాల వైన్స్, షాంపైన్లు, ఆల్కహాల్ ఉత్పత్తులపై త్వరలోనే 200 శాతం సుంకం వేస్తాం. అని పేర్కొన్నారు.

బీహార్ ఎన్నికల కోసం సీతమ్మ

పాట్నా : బీహార్‌లో ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ బీజేపీ అప్పుడే మత రాజకీయాలకు తెర లేపుతోంది. హిందూ ఓట్లను తనకు అనుకూలంగా సంఘటితం చేసేందుకు సీతాదేవి ఆలయ పునరుద్ధరణ నినాదాన్ని అందుకుంది. మిథిల ప్రాంతంలోని సీతామర్హిలో ఈ ఆలయం ఉంది. దీనిని పునరుద్ధరించి, పూర్వ వైభవం తీసుకురావడం ద్వారా దానిని ఎన్నికల అంశంగా మార్చేయాలని కమలదళం ప్రయత్నిస్తోంది.

ఎండుతున్న పంటలు

(మొదటిపేజీ తరువాయి)

బోర్లు వేసి లక్షల రూపాయలు అప్పుల పాలయ్యారని అన్నారు. మార్చి 16న సీఎం స్టేషన్ ఘన్‌పూర్‌కు వస్తున్న సందర్భంగా ఎండిన పంటలను పరిశీలించి రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎం.కనకారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయకపోవడంతో రైతులకు, ప్రజలకు నీరందే పరిస్థితి లేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును పట్టించుకోలేదని, రైతులను ఉద్ధరిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా మాటలు చెప్పడం తప్ప పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దేవాదుల ప్రాజెక్టుకు పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయించి మొత్తం పనులు పూర్తి చేసి, చివరి ఆయకట్టు వరకు నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో తొమ్మిది రిజర్వాయర్లు నింపి కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపి జిల్లాలో భూగర్భజలాలు పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే రైతాంగం పక్షాన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఈ. అహల్య, సింగారపు రమేష్, రాపర్తి సోమయ్య, బొట్లశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజయేందర్, పుత్కనూరి ఉపేందర్, బోడ నరేందర్, చిట్యాల సోమన్న, మండల కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పలు జిల్లాల్లో పర్యటించిన సీపీఐ(ఎం), రైతు సంఘం బృందాలు

సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో మండలంలోని ముదిమాణిక్యం, ఇటిక్యాల, నాద్లపూర్, కోడాకల్ గ్రామాల్లో సీపీఐ(ఎం) బృందం ఎండిపోయిన వరి పంటలను పరిశీలించింది. సింగూరు ఎడమ కాలువ నీరు వదిలి రైతాంగాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా బృందం సభ్యులు డిమాండ్ చేశారు. సిద్దిపేట మండలం చేర్యాల మండల పరిధిలోని తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలాయ పల్లి, అర్జున్ పట్ల తదితర గ్రామాల్లో ఎండిన వరి పంటలను సీపీఐ(ఎం), రైతు సంఘం నాయకులు పరిశీలించారు. నాగపురి, సుభాష్ గూడెం గ్రామాల్లో తెలంగాణ రైతు సంఘం బృందం ఎండిపోయిన వరి చేనులను పరిశీలించింది. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి ముందు చూపు లేకపోవడం వల్ల దేవాదుల ప్రాజెక్టులను నీళ్లతో నింపకపోవడంతో గ్రామాల్లో చెరువులు, కుంటలు, బోర్లు అడుగంటి వరి పంటలు మొత్తం ఎండిపోయాయని అన్నారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి వరి పంటలు వేస్తే నోటికాడికొచ్చిన వరి పంటలు పూర్తిగా ఎండిపోయి అప్పుల పాలైన పరిస్థితి ఉందన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కాల్వలపల్లి గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఎండిన వరి పంట పొలాలను పరిశీలించారు. కల్వలపల్లి గ్రామంలో 160 ఎకరాల్లో వరి చేలు ఎండిపోయాయని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండ శ్రీశైలం తెలిపారు.

గొంతునొక్కే యత్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అనని మాటల్ని అన్నట్టుగా చెప్పి అబద్దాల ఆధారంగానే ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారకరామారావు ఆరోపించారు. దీనికి నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలి బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బడ్జెట్ సమావేశాల్లో బీఆర్‌ఎస్ ఉంటే కాంట్రాక్టులు, కమీషన్లు, ఢిల్లీకి మూటల విషయాలు చర్చకొస్తాయనే భయంతోనే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా గురువారం నెక్లెస్‌రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం ముందు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన నిరసన తెలిపారు. అరిగిపోయి గ్రామఫోన్ రికార్డు మాదిరిగా సీఎం నుంచి మంత్రుల దాకా ప్రజాపాలన, ఇందిరమ్మ ప్రభుత్వం అఇ చెబుతున్నారనీ, కానీ, వాస్తవానికి వాళ్లది నియంతృత్వ ప్రభుత్వమని విమర్శించారు. గవర్నర్ ప్రసంగంలో పసలేని విషయాల మీద, అందులో చెప్పిన పచ్చి అబద్దాల మీద తమ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సభలో మాట్లాడటం మొదలుపెట్టిన ఆరు నిమిషాల లోపే ఉద్దేశపూర్వకంగానే ఇటు మంత్రులు, అటు కాంగ్రెస్ సభ్యులు రన్నింగ్ కామెంట్రీ చేస్తూ ప్రసంగానికి అంతరాయం కలిగించారని విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, ఆరుగ్యారెంటీల వాగ్దానాల భంగంపై ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే తట్టుకోలేక నీతి బాహ్యంగా, నిస్సిగ్గుగా కేవలం అబద్దాల మీద ఆధారపడి అనని మాటల్ని అనట్టు చిత్రీకరించి సస్పెండ్ చేశారని విమర్శించారు. ఆయన ఒక్క అన్ పార్లమెంటరీ మాట కూడా వాడలేదని తెలిపారు. స్పీకర్ తమకు తండ్రి లాంటివారనీ, అందరి తరపున అక్కడ ఉన్న తమరే హక్కుల్ని కాపాడాలని ఆక్రోశం వ్యక్తం చేశారని తెలిపారు. స్పీకర్‌ను ఎక్కడా అగౌరవపర్చలేదని స్పష్టం చేశారు. నియంతృత్వ పోకడలతో ఐదుగంటల పాటు సభను వాయిదా వేసి ఢిల్లీలో ఉన రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు ఈ చర్య తీసుకున్నారని విమర్శించారు. జగదీశ్‌రెడ్డిని వివరణ అడగకముందే, ఏం తప్పు చేశారో చెప్పకుండానే సస్పెండ్ చేశారని విమర్శించారు. స్పీకర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేసి సభను సజావుగా నడిపేలా చూడాలి కేసీఆర్ తమకు ఆదేశించారని తెలిపారు. కేసిఆర్ గారి ఆదేశాలతో స్పీకర్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిని కలిసి జగదీశ్వర్ రెడ్డి ఇష్యూమీద అన్ని పార్టీల అభిప్రాయం తీసుకొని మూడ్ ఆఫ్ ది హౌస్ తెలుసుకోవాలని కోరామన్నారు. స్పీకర్ కార్యాలయంలో అన్ని పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేస్తే ప్రతిష్టంభనను తొలగించడానికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పామన్నారు. స్పీకర్ మీద ఉన్న గౌరవంతో విచారం వ్యక్తం చేసి సభ సజావుగా జరగడానికి సహకరిస్తామని స్పీకర్‌కు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రికి చెప్పామని తెలిపారు. ఇవేమీ పట్టించుకోకుండా ఏకపక్షంగా బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకూ సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన 125 అడుగుల డాక్టర్ బాబాసాహెబ్ విగ్రహాన్ని సంకెళ్లతో బంధించిన ఒక నీచమైన ప్రభుత్వమన్నారు. 20 శాతం కమీషన్లను ఢిల్లీకి మూటలు పంపడం మీద ఉన్న దృష్టి రాష్ట్రంలోని పేదలకు మేలు చేయాలనే విషయంలో ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. తమ పార్టీ సభ్యుడి గొంతు ఈరోజు నొక్కినందుకు తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతకింత అనుభవిస్తుందనీ, భవిష్యత్తులో తప్పకుండా వారికి ప్రజాకోర్టులో శిక్ష పడుతుందని హెచ్చరించారు.

ఆర్‌ఎస్‌ఎస్ కోసమే జమిలీ

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లంఘించటంలో పలు న్యాయపరమైన చిక్కులు తీసుకొస్తాయనీ, పరోక్షంగా అధ్యక్ష తరహా పాలనకు దారి తీస్తుందని పలు ప్రశ్నలను, అనుమానాలను లేవనెత్తాయి. ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్‌ను ఏకపక్షంగా నియమించటం కూడా ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నది. ఈయనకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మంచి సంబంధాలు కూడా ఉండటం గమనార్హం. ఆర్‌ఎస్‌ఎస్ చిరకాల వాంఛ అయిన హిందూ రాష్ట్రను దేశంలో తీసుకురావటానికి మోడీ సర్కారు ప్రయత్నాలు తీవ్రం చేస్తున్నది. ఈ ప్రక్రియ సాఫీగా సాగాలంటే సీఈసీగా తాము చెప్పినట్టు వినే వ్యక్తి ఉండాలని కేంద్రం భావించింది. ఇందులో భాగంగానే సీఈసీగా పదవి నుంచి దిగిపోయిన రాజీవ్ కుమార్ స్థానంలో జ్ఞానేశ్ కుమార్‌ను మోడీ తీసుకొచ్చారని విశ్లేషకులు అంటున్నారు. స్వతంత్ర రాజకీయ సంస్థగా ఉండాల్సిన ఎన్నికల సంస్థను కేంద్రంలోని మోడీ సర్కారు పలు సందర్భాలలో స్వేచ్ఛగా పని చేయనివ్వలేదనీ, పలు ఎన్నికల్లో ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా పని చేసిందని ప్రతిపక్ష పార్టీలు పలు సందర్భాలలో ఆరోపణలు చేసిన విషయం విదితమే. ఓటర్ల జాబితాలో చేరికలు, తొలగింపులపై కూడా ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇది అసలైన ప్రజాతీర్పుపై ప్రభావాన్ని చూపుతుందని అంటున్నాయి. జమిలీ ఎన్నికలు జరపాలంటే రాజ్యాంగ సవరణలు అవసరం. ఇందుకు పార్లమెంటులోని ఉభయ సభల్లో కనీసం మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. దీనిని సూపర్‌మెజారిటీ అంటారు. అంటే.. లోక్‌సభలో 362 మంది, రాజ్యసభలో 167 మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. అయితే, కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి అంత బలం లేదు. లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది సభ్యులే ఉన్నారు. అంతేకాదు, గతేడాది సెప్టెంబర్‌లో జమిలీ ఎన్నికల బిల్లును కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. అదే ఏడాది డిసెంబర్‌లో పార్లమెంటు ముందుకు బిల్లును తీసుకొచ్చింది. లోక్‌సభలో 269 మంది అనుకూలంగా, 198 మంది వ్యతిరేకంగా ఈ బిల్లుకు ఓటు వేశారు. దీంతో జమిలీ అసాధ్యమనీ, కావాల్సిన మెజారిటీని మోడీ సర్కారు సాధించలేకపోయిందని ప్రతిపక్ష పార్టీలు అంటున్నాయి.

ఎల్లోర్‌కుమ్ ఎల్లామ్

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేసింది. గత సంవత్సరం లోగోలో రూపాయి చిహ్నం దేవనాగరి లిపిలోనే ఉంది. 'ఈ సంవత్సరం దేవనాగరి లిపి కంటే తమిళానికే మేము ప్రాధాన్యత ఇచ్చాం' అని సీఎంఓ వర్గాలు తెలిపాయి. కాగా ఈ ఏడాది తమిళానికి ప్రాధాన్యత ఇవ్వాలని అనుకుంటున్నామని డీఎంకే ప్రతినిధి సవరణన్ అన్నాదురై చెప్పారు. త్రిభాషా సూత్రంపై కేంద్రం, తమిళనాడు ప్రభుత్వాల మధ్య వివాదం తీవ్రమవుతున్న తరుణంలో డీఎంకే ప్రభుత్వం ఈ చర్య తీసుకోవడం గమనార్హం. ద్విభాషా సూత్రాన్ని (తమిళం, ఆంగ్లం) అనుసరిస్తున్న తమిళనాడు త్రిభాషా సూత్రాన్ని గట్టిగా వ్యతిరేకిస్తోంది. అంతేకాక త్రిభాషా విధానాన్ని సూచిస్తున్న జాతీయ విద్యా విధానాన్ని కూడా నిరసిస్తోంది. తమిళనాడు బడ్జెట్‌ను శుక్రవారం రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టబోతున్నారు. ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు నేతృత్వంలోని బడ్జెట్ కమిటీ లోగో మార్పుపై నిర్ణయం తీసుకున్నదని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. 'మా భాషను, మా నాగరికతను పార్లమెంటులో కూడా అపహాస్యం చేస్తుంటే మేము దానిని రక్షించుకోవద్దా?' అని డీఎంకే నేత ఒకరు ప్రశ్నించారు. కాగా లోగోను మార్చాలన్న నిర్ణయానికి ముఖ్యమంత్రి స్టాలిన్ ఆమోదముద్ర వేశారు. తమిళనాడు ప్రభుత్వం మార్చిన రూపాయి చిహ్నానికి డీఎంకే ఎమ్మెల్యే కుమారుడు రూపకల్పన చేశారు. ఆయన ప్రస్తుతం ఐఐటీ గౌహతి డిజైన్ విభాగానికి అధిపతిగా కొనసాగుతున్నారు.

ట్రంప్ మెహర్బానీ కోసమే..

(మొదటిపేజీ తరువాయి)

న్యూఢిల్లీ : స్టార్‌లింక్‌తో ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో భాగస్వామ్యంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం ప్రధాని మోడీకి పలు ప్రశ్నలు సంధించారు. ఈ ఒప్పందాలను ఎలన్ మస్క్ ద్వారా అమెరికా అధ్యక్షులు ట్రంప్‌కు అనుకూలంగా మలిచేందుకు ప్రధాని మోడీ కుట్ర పన్నారని అన్నారు."అక్షరాలా 12 గంటల్లోనే ఎయిర్‌టెల్ , జియో రెండూ స్టార్‌లింక్‌తో భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. దీంతో భారతదేశంలోకి స్టార్‌లింక్ సులభంగా ప్రవేశించగలిగింది. అయితే గత కొంతకాలంగా వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలన్నింటినీ పక్కకు పెట్టి ఈ ఒప్పందం చేసుకోవడం గమనార్హం. స్టార్‌లింక్ యజమాని ఎలమన్ మస్క్ ద్వారా ట్రంప్ దయ పొందేందుకు ప్రధాని మోడీ స్వయంగా ఈ భాగస్వామ్యాలను ఏర్పాటు చేశారనేది స్పష్టంగా తెలుస్తుంది" అని అన్నారు. కానీ చాలా ప్రశ్నలకు ప్రధాని మోడీ సమాధానమివ్వాల్సి వుందని స్పష్టంచేశారు. ఈ ఒప్పందంతో జాతీయ భద్రత పరిస్థితి ఏమిటని ప్రధానిని ప్రశ్నించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో కనెక్టివిటీని స్టార్ లింక్ లేదా భారతీయ భాగస్వాములైన ఎయిర్‌టెల్, జియో సంస్థలు నియంత్రిస్తాయా ? ఇతర ఉపగ్రహ ఆధారిత కనెక్టివిటీ ప్రొవైడర్లు భారత్‌లోకి ప్రవేశించడానికి అనుమతిస్తారా? అయితే ఏ నిబంధనలపై అనే దానిపై ఆందోళన లేవనెత్తారు. స్టార్‌లింక్ ప్రవేశంతో భారతదేశంలో టెస్లా తయారీ ప్రణాళికలకు మధ్య ఏదైనా సంబంధం ఉందా? అని ప్రధాని మోడీని నిలదీశారు.

రేపటినుంచి ఒంటిపూట బడులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల్లో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఒంటిపూట బడులు వచ్చేనెల 23 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు యధావిధిగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని వివరించారు. అయితే పదో తరగతి పరీక్షా కేంద్రాలుండే పాఠశాలల్లో మాత్రం ఈనెల 21 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు మధ్యాహ్నా ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఆదేశాలను అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు అమలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాలని ఆర్జేడీలు, డీఈవోలను కోరారు. వచ్చేనెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయి.

నవచిత్రం

ఊహించిన దానికంటే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది


ప్రశాంతి తిపిర్నేని, దీప్తి గంటా

హీరో నాని వాల్ పోస్టర్ సినిమా ప్రెజెంట్ చేస్తున్న మూవీ 'కోర్ట్' - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు.
ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు.
ప్రీమియర్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాతలు ప్రశాంతి తిపిర్నేని, దీప్తి గంటా మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

చాలా లేయర్స్ ఉన్నాయి

దీప్తి గంటా మాట్లాడుతూ, 'నాని, ప్రశాంతి స్క్రిప్ట్ విని ఓకే చేశారు. నేను ఆన్ సెట్ ప్రొడ్యూసర్‌గా జాయిన్ అయ్యాను. నేను స్క్రిప్ట్ మొత్తం చదివాను. డైరెక్టర్ జగదీష్ చాలా బాగా రాసుకున్నాడు. చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నీ బాగా కనెక్ట్ చేసుకున్నాడు. జగదీశ్ ఈ సినిమాని చాలా రీసెర్చ్ చేసి రాశాడు. అందుకే సినిమా చాలా నేచురల్‌గా వచ్చింది. పోక్సో చట్టం గురించి ఆయన చాలా డీటెయిల్ ప్రెజెంట్ చేశాడు. 'హిట్ 3' స్టేక్స్ చాలా పెద్దవి.. కానీ నాని ఈ సినిమా నచ్చకపోతే 'హిట్ 3' చూడొద్దని చెప్పడం మాకే షాక్ అనిపించింది. నేను, ప్రశాంతి.. డైరెక్టర్ శైలేష్ వంక చూశాం.(నవ్వుతూ) తనకి నమ్మకం ఉంది కాబట్టే ఆ మాటని కాన్ఫిడెంట్‌గా చెప్పారు. నేను 'మీట్ క్యూట్' డైరెక్ట్ చేసిన తర్వాత యుఎస్ వెళ్ళిపోయాను. ఈ సినిమా కోసం మళ్ళీ వచ్చాను. కొన్ని ఐడియాలు ఉన్నాయి. వాటిని స్క్రిప్ట్‌గా డెవలప్ చేయాలి' అని అన్నారు.

అది మాకు మంచి కాంప్లిమెంట్

'నాని, నేను ఇద్దరం కథ వింటాం. అయితే మా నమ్మకం అంతా నాని జడ్జిమెంట్ మీదే ఉంటుంది. ఆయన పెద్దగా లెక్కలేమీ వేయరు. ఒక కథ థియేటర్లో చూడాలనిపించేలా ఉంటే ఓకే చేస్తారు. ప్రీమియర్స్‌కి యునానిమస్‌గా ఎక్స్ లెంట్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ అఫ్ చూసి 'వావ్' అన్నారు. సెకండ్ హాఫ్ కోసం ఈగర్‌గా వెయిట్ చేశారు. సెకండ్ హాఫ్ లోని హైలెట్స్ కూడా ఆడియన్స్‌కి చాలా నచ్చాయి. రెస్పాన్స్ చాలా బావుంది. మేము అనుకున్నదాని కంటే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇలాంటి జోనర్ సినిమాని ఆదరించి బిగ్ సక్సెస్ చేయడం చాలా ఆనందంగా అనిపిస్తోంది. కొంత మంది లాయర్స్ ప్రీమియర్ చూసి, చాలా బాగా ఉందని ప్రశంసించారు. ' అని ప్రశాంతి తిపిర్నేని చెప్పారు.




సరికొత్త ఎలిమెంట్‌తో 'దిల్ రూబా'

హీరో కిరణ్ అబ్బవరం నటించిన కొత్త సినిమా 'దిల్ రూబా'. శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మించాయి.
రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం హోలీ పండుగ సందర్భంగా నేడు (శుక్రవారం) గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.
ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, 'ఈ సినిమా గురించి వీలైనంతగా మిమ్మల్ని కలిసి చెబుతూ వస్తున్నాం. ఈ రోజు ప్రీమియర్స్ పడుతున్నాయి. ఈ సినిమా ఫస్ట్ 30 మినిట్స్ సరదగా వెళ్తా, ఆ ముప్పై నిమిషాల తర్వాత కథలోకి తీసుకెళ్తుంది. ఈ కథలో ప్రేమ ఒక్కటే కాదు స్నేహం, ఫాదర్-సన్, ఫాదర్-డాటర్ రిలేషన్.. ఇలా అన్ని ఎమోషన్స్ ఉంటాయి. ఎక్స్ లవర్ మళ్లీ ఆ ప్రేమికుడి జీవితంలోకి వచ్చి, అతని ప్రెజెంట్ లవ్‌ను కలిపే ప్రయత్నం చేయడం అనేది ఇందులో కొత్తగా ఉంటుంది. మాజీ ప్రేయసి, ప్రేమికుడు అంటే శత్రువులా చూడాల్సిన పనిలేదు. వారితోనూ స్నేహాన్ని కొనసాగించవచ్చు అనే ఫీల్ గుడ్ ఎలిమెంట్ మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. మీరు మీ ఫ్యామిలీతో వచ్చి హాయిగా ఈ సినిమా చూడొచ్చు. ఎలాంటి ఇబ్బందికర డైలాగ్స్, సన్నివేశాలు ఉండవు. ఈ మూవీలో నటించిన తర్వాత నటుడిగా ఇంకాస్త పరిణితి సాధించా అనిపించింది. ఫైట్స్ విషయంలో చాలా సంతృప్తిగా ఉన్నాను. మా డైరెక్టర్‌కు ఈ సినిమా తర్వాత మంచి పేరొస్తుంది.



ఈ కిట్టు ఎవరు?


విజయ్ ఆంటోనీ

హీరోగా, నిర్మాతగా, లిరిసిస్ట్‌గా, దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా, ఎడిటర్‌గా ఇలా అన్ని రకాలుగా సత్తా చాటుకున్నారు విజయ్ ఆంటోనీ. ఆయన ప్రస్తుతం తన కెరీర్‌లో ప్రతిష్టాత్మకమైన 25వ చిత్రం 'భద్రకాళి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతోన్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది.
విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్ మీద మీరా విజయ్ ఆంటోని సమర్పణలో అరుణ్ ప్రభు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.
తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. 'పిల్లి కూడా ఒక రోజు పులి అవును.. అబద్దం, అహంకారం అంతం అవును'.. అంటూ ప్రారంభమైన ఈ టీజర్‌లో విజయ్ ఆంటోని అసలు ఏ పాత్రను పోషిస్తున్నాడో అర్థం కాకుండా ఉంది. ఒకసారి ఫ్యామిలీ మెన్‌లా కనిపిస్తున్నారు.. మరోసారి గ్యాంగ్ స్టర్‌లా అనిపిస్తున్నారు.. ఇంకో సందర్భంలో ఉన్నతాధికారిలా కనిపిస్తున్నారు.. అసలు ఈ కిట్టు ఎవరు? అనే ఆసక్తిని రేకెత్తించేలా టీజర్‌ను కట్ చేశారు. 190 కోట్ల కుంభకోణం చుట్టూ కథ తిరిగేలా ఉంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే అంటూ చివర్లో వచ్చిన డైలాగ్‌తో టీజర్ మీద మరింత ఆసక్తిని పెంచేసినట్టు అయింది. విజయ్ ఆంటోని ఈ చిత్రంలో ఇది వరకు ఎన్నడూ కనిపించినంత స్టైలిష్‌గా, యాక్షన్ హీరోగా కనిపిస్తున్నారు. ఈ సినిమాకు విజయ్ ఆంటోని సంగీతాన్ని కూడా అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ షెల్లీ కాలిస్ట్ విజువల్స్ ఈ టీజర్‌లో అద్భుతంగా అనిపిస్తున్నాయి. విజయ్ ఆంటోనీ ఆర్ఆర్, రేమండ్ డెరిక్ క్రాస్టా ఎడిటింగ్, రాజశేఖర్ కంపోజ్ చేసిన ఫైట్స్ ఈ టీజర్‌లో హైలెట్ అవుతున్నాయి. ఈ సినిమాను సమ్మర్ కానుకగా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు.

పెళ్ళి కోసం తిప్పలు..


సప్తగిరి

సప్తగిరి నటిస్తున్న చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. ఈనెల 21న థియేటర్లలోకి రానుంది. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని థామ మీడియా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై విజన్ గ్రూప్ కె.వై.బాబు, భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించారు.
చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పిస్తోంది. దిల్ రాజు నేతృత్వంలోని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తోంది. గురువారం ఈ మూవీ థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ చేశారు.
ప్రసాద్‌కి 36 ఏళ్ళు దాటుతాయి. పెళ్లి గురించి మరింత ఆందోళన చెందుతాడు. అతను ఏజ్ బార్‌గా భావిస్తున్నప్పటికీ, కాలక్రమేణా ఎక్కువ అనుభవం వస్తుందని అతని తండ్రి అతనికి భరోసా ఇస్తాడు. అయినప్పటికీ, ఇంకేదైనా ఆలస్యం జరిగితే ఇక అవకాశం వుండదని ప్రసాద్ భయపడతాడు. మరోవైపు, హీరోయిన్ తననే కాకుండా తన మొత్తం కుటుంబాన్ని పోషించగల వరుడి కోసం వెతుకుతోంది. వీరిని విధి ఒకచోట చేర్చుతుందా? అనేది ట్రైలర్‌లో చాలా ఎగ్జైటింగ్, హిలేరియస్‌గా ప్రజెంట్ చేశారు. పెళ్లి కాని ప్రసాద్ పాత్రలో సప్తగిరి తన హ్యూమరస్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్నాడు. ప్రియాంక శర్మకు మంచి పాత్ర లభించింది. మురళీధర్ గౌడ్, లక్ష్మణ్ పాత్రలు కామెడీ పోర్షన్‌ని మరింత పెంచింది అని చిత్ర యూనిట్ తెలిపింది.

చేనేతకు బడ్జెట్లో రూ.2వేల కోట్లు కేటాయించాలి

ఆత్మహత్య చేసుకున్న కార్మికులకు రూ.10లక్షలు చెల్లించాలి : చేనేత సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చేనేత రంగం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్లో రూ.2వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాతూ రాష్ట్రంలోని చేనేత, పవర్‌లూమ్ కార్మికులు ఉపాధి లేక, సంక్షేమ పథకాలు అమలు కాక ఏడాది కాలంలో 32 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబాలను రాష్ట్ర మంత్రులెవరూ కనీసం పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని చేనేత కార్మికులందరికీ ఉపాధి కల్పిస్తామనీ, ప్రభుత్వ రంగ సంస్థలకు చేనేత వస్త్రాలను అందించడం ద్వారా మెరుగైన ఆదాయం కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష రూపాయల లోపు రుణాల మాఫీలో ఒక్క రూపాయి ఎక్కువున్నా వర్తించదని ప్రకటించడం



కార్మికులను మోసం చేయడమేనని విమర్శించారు. త్రిఫ్ట్ ఫండ్ పథకం అమలు చేయడానికి ఎంక్వయిరీల పేరుతో లబ్ధిదారులను వేదిస్తూ సంఖ్యను తగ్గించే కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక గ్రూపులకు రెండు చీరలు చొప్పున చేనేత సహకార సంఘాల నుంచి కొనుగోలు చేసి ఇస్తామని ఎనిమిది నెలల క్రితం ప్రకటించిన ప్రభుత్వం నేటికీ ఆ పథకాన్ని ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ప్రాథమిక చేనేత సహకార సంఘాలతో పాటు టెస్కోకు ఎన్నికలు జరిపి ఈ రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. బడ్జెట్లో చేనేతకు నిధుల కేటాయింపు, సమస్యల పరిష్కారానికి సర్కార్ చొరవ తీసుకోకుంటే రాబోయే కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు వనం శాంతికుమార్, కూరపాటి రమేష్ పాల్గొన్నారు

రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి హోలీ శుభాకాంక్షలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హోలీ శు భాకాంక్షలు తెలిపారు. ఈ రంగుల పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాలు జరుపుకునే ఈ పండుగ సమైక్యతకు అద్దం పడుతుందని పేర్కొన్నారు.
అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ హోలీ పండుగ అందరి కుటుంబాల్లో ఆనందోత్సవాలు నింపాలని ఆకాంక్షించారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ రాష్ట్ర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

సాత్విక్, చిరాగ్ ముందంజ
ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఓపెన్



బర్మింగ్‌హామ్ (ఇంగ్లాండ్) : జూనియర్ సర్క్యూట్‌లో ఆడేందుకు వయసు తప్పుడు వయసు ధ్రువపత్రాలను సృష్టించిన కేసులో క్రిమినల్ విచారణ ఎదుర్కొంటున్న యువ షట్లర్ లక్ష్యసేన్ ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్‌లో దూసుకెళు న్నాడు. ప్రతిష్టాత్మక బిడబ్ల్యూఎఫ్ సూపర్ 1000 టోర్నమెంట్‌లో లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో వరల్డ్ నం.2, మూడో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేషియా)పై వరల్డ్ నం.15, అన్‌సీడెడ్ లక్ష్యసేన్ 21-13, 21-10తో వరుస గేముల్లో గెలుపొందాడు. 36 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో లక్ష్యసేన్ అదరగొట్టాడు. తొలి గేమ్‌లో జొనాథన్ క్రిస్టీ ఏ దశలోనూ లక్ష్యసేన్‌కు పోటీ ఇవ్వలేకపోయాడు. 11-6తో విరామ సమయానికి విలువైన ఆధిక్యంలో నిలిచిన లక్ష్యసేన్ అదే జోరు కొనసాగించాడు. రెండో గేమ్‌లో లక్ష్యసేన్ ముందంజ వేసినా 6-6తో జొనాథన్ క్రిస్టీ రేసులోకి వచ్చాడు. కానీ వరుసగా పాయింట్లు సాధించిన లక్ష్యసేన్ 11-6తో ముందంజ వేశాడు. బ్రేక్ తర్వాత వరుసగా ఆరు పాయింట్లు సాధించిన లక్ష్యసేన్ 21-10తో ఏకపక్ష విజయం నమోదు చేశాడు. నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్లో ఆరో సీడ్, వరల్డ్ నం.6 లి షి ఫెంగ్ (చైనా)తో లక్ష్యసేన్ తలపడనున్నాడు. లి షి ఫెంగ్‌తో ముఖాముఖిలో లక్ష్యసేన్‌కు (7-4) మెరుగైన రికార్డు ఉంది. చివరగా నిరుడు థామస్ కప్‌లో ఈ ఇద్దరు తలపడగా లక్ష్యసేన్ పైచేయి సాధించాడు.

పురుషుల డబుల్స్‌లో స్టార్ షట్లర్లు సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ ముందంజ వేసింది. తొలి రౌండ్లో డెన్మార్క్ షట్లర్లు డానియల్, మాడ్స్‌లపై అలవోక విజయం సాధించారు. 21-17, 21-15తో 40 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బాన్సోద్ ప్రీ క్వార్టర్స్‌లో ఓటమి పాలైంది. మూడో సీడ్ అకానె యమగూచి (జపాన్) చేతిలో 16-21, 13-21తో వరుస గేముల్లోనే ఓటమి చెందింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి పుల్లెల, ట్రెసా జాలి జోడీ రెండో రౌండ్‌కు చేరుకుంది. 21-17, 21-13తో తొలి రౌండ్లో చైనీస్ తైపీ జోడీపై గెలుపొందారు.

రష్యాకు ఒనగూడేదేం వుంది

ఉక్రెయిన్ కాల్పుల విరమణ ప్రతిపాదనపై క్రెమ్లిన్ స్పందన

ప్రతిపాదనపై ఇంకా కసరత్తు అవసరమని వ్యాఖ్య : వారు యుద్ధమే కోరుకుంటున్నారని వెల్లడైందన్న జెలెన్స్కీ



కీవ్ : ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణ ప్రతిపాదన వల్ల రష్యాకు ఒనగూడేదేమీ వుండదని, దానిపై తిరిగి కసరత్తు చేయాల్సిన అవసరం వుందని పుతిన్ సన్నిహిత సహాయకుడు యుష్‌కొవ్ వ్యాఖ్యానించారు. రష్యా స్వప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రతిపాదనను తిరిగి రూపొందించాల్సి వుందని అన్నారు. ఈ ప్రతిపాదన పత్రం చూస్తుంటే చాలా హడావిడిగా రూపొందించినట్లు కనిపిస్తోందని అన్నారు. తమ వైఖరేమిటో కూడా తెలుసుకుని దాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించాల్సిన అవసరం వుందన్నారు. ఈ ప్రతిపాదనలో కేవలం ఉక్రెయిన్ వైఖరి మాత్రమే తెలుస్తోందన్నారు. 30రోజుల పాటు తాత్కాలికంగా కాల్పులను విరమిస్తాం, బాగుంది, దానివల్ల మాకేమిటి లాభం? ఏమీ లేదు. ఉక్రెయిన్లు మళ్లీ సత్తా సమకూర్చుకోవడానికి కొంత సమయమిచ్చినట్లే అవుతంది. వారు బలం చేకూర్చుకుని మళ్ళీ దాడులు మొదలెడతారని యుష్‌కొవ్ రష్యన్ మీడియాతో వ్యాఖ్యానించారు. అమెరికా అధికారులు కాల్పుల విరమణ ప్రతిపాదనలను రష్యాకు అందచేయనున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. దీర్ఘకాల శాంతికి ఈ ప్రతిపాదన అనువుగా లేదన్నారు. అమెరికా-ఉక్రెయిన్ హడావిడిగా చేసిన ఈ చర్యల వల్ల దీర్ఘకాలిక పరిష్కారం లభించదని ఆయన స్పష్టం చేశారు.

ఈ ప్రతిపాదనకు రష్యా నుండి అర్థవంతమైన స్పందన రాలేదంటే ఉక్రెయిన్‌లో వారు సుదీర్ఘ పోరు కొనసాగించాలని కోరుకుంటున్నారని స్పష్టమైందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వ్యాఖ్యానించారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.